
ఆంధ్రప్రదేశ్

సెప్టెంబర్ 1968

★

30 పైసలు



ఆంధ్రప్రదేశ్ ను గురించి...

విస్తీర్ణం	1 06 286 చ. మై
జిల్లాలు	20
తాలూకాలు	189
గ్రామాలు	28,997
పట్టణాలు, నగరాలు	212
మొత్తం జనసంఖ్య (1961)	359 83 లక్షలు
జన సాంద్రత (1961)	339 చ మై 1కి.
అక్షరాస్యులు (1961)	76 27 లక్షలు
షెడ్యూల్డు కులాలవారు (1961)	49 74 లక్షలు
షెడ్యూల్డు తెగలవారు (1961)	13 24 లక్షలు
నమోదైన కర్మాగారాలు	3,9[illegible]8
విశ్వవిద్యాలయాలు	4
పంచాయతీలు	15,266
పంచాయతీ సమితులు	321
ఆంధ్రప్రదేశ్ నుండి పార్లమెంటు సభ్యులు	61
విధానసభ సభ్యులు	288
శాసనమండలి సభ్యులు	90

ఆంధ్రప్రదేశ్

సంపుటి: 12] సెప్టెంబర్ – 1968 [సంచిక: 11

భాద్రపద–ఆశ్వీయుజ, – 1890 శా.శ.

ప్రధాన సంపాదకులు

బి. యస్. రామన్, ఐ. ఏ. యస్.

సంపాదకులు

ఎస్. వి. గోపాలశాస్త్రి

ఈ సంచికలో....

మొదటి అట్ట : రామప్ప దేవాలయం

మూడవ అట్ట : ఎగువ సీలేరు పథకం

నాలుగవ అట్ట : నెహ్రూ జ్యూలాజికల్ పార్క్‌లో "కంగారూ"

[ఈ సంచికలోని రచయితలు వెలువరించిన అభిప్రాయాలకు తప్పనిసరిగా ప్రభుత్వం కట్టుబడివున్నట్టు భావించ నక్కరలేదు]

పేజీ

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా

రాష్ట్రపతి సందేశం

భారత స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా రాష్ట్రపతి డాక్టర్ జాకిర్ హుసేన్ రేడియో ద్వారా దేశప్రజలకు ఇచ్చిన సందేశము పూర్తిపాఠం.

"21 వ స్వాతంత్ర్య దినోత్సం సందర్భంగా మీ అందరికి అభివందనాలు తెలుపుతున్నాను. మీ భవిష్యత్తుకివే నా శుభాకాంక్షలు."

క్రితం సారి స్వాతంత్ర్య వార్షికోత్సవ సమయంలో మీ అందరితో మాట్లాడిన దరిమిలా పెక్కు రాష్ట్రాలలో ప్రత్యేకంగా బీహార్, ఉత్తర ప్రదేశ్‌లలో వ్యాపించిన కరువు కాటకాలనే కాళరాత్రి నుంచి మనం బయటపడ్డాం. ఈ యేడు 9 కోట్ల 50 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు పండించుకోగలిగామంటే కొత్త రకం విత్తనాల అభివృద్ధివల్లా, నవీన వ్యవసాయ విధానాల వల్లా, అన్నిటికంటె మిన్నగా వ్యవసాయ దారులు నూతన భావాలను కూలించటంవల్లా సాధ్యమయింది. వ్యవసాయ రంగంలో యీ విధంగా గడ్డు పరిస్థితిని దాటటం అన్నది దృశ్యమానం అవుతున్నప్పటికి అది వాస్తవరూపం ధరించటం, వ్యవసాయ నిర్వహణ అనే బ్రహ్మాండమైన యీ సమస్యను పరిష్కరించటం మన సామర్థ్యంపై ఆధారపడి వుంటుంది. మన అపజయానికి మానవ లోపమే యెక్కువ కారణమని యీ పావన సమయంలో అందరం నిష్కపటంగా ఒప్పుకోవలసి వుంది. అదే మనందరికి పెద్దసవాలు, అందుచేత యీ యేటి సుభిక్షమైన పంటనుచూసి తృప్తిపడి ఊరుకోనివ్వరాదనీ. గడచిన సంవత్సరాల అనుభవాలను మరచిపోనివ్వరాదనీ మనస్ఫూర్తిగా భగవంతుణ్ణి వేడుకొంటున్నాను.

ముడి పదార్థాలు యిప్పుడు బాగా లభించటం, వినియోగదారుల కొనుగోలు శక్తి పెరగటం–వీటివల్ల పారిశ్రామికోత్పత్తికి ప్రోత్సాహం కలుగుతుంది. నిజానికి పరిశ్రమల రంగంలో మాంద్యానికి సంబంధించినంత వరకూ మనం ఒడ్డుకు చేరుకున్నట్లే తోస్తుంది. మొత్తంమీద పరిశ్రమల రంగంలో మనం చెప్పుకోతగిన ప్రగతి సాధించాము. మూడు పంచవర్ష ప్రణాళికల్లోనూ



దృఢమైన పునాదులువేసి నానావిధాలైన పరిశ్రమలు నెలకొల్పాము. వర్ధమాన పారిశ్రామిక రంగంలో అత్యాధునికాలైన యంత్రాలతో సహా అన్ని రకాల కార్మగారాలనూ, యంత్రపరికరాలనూ చాలావాటిని మనమే నమూనాలు తయారుచేసి రూపొందించుకోగల స్థితిలో యీనాడు మనం వున్నాము. అనేక సందర్భాలలో విదేశీ సంస్థలపై ఆధార పడివుండే పరిస్థితిని తొలిగించుకోగలిగాము.

డిజైను ఇంజనీరింగులో నైపుణ్యాన్ని తగినంతగా అభివృద్ధి పరుచుకున్నాము. విదేశాల సహాయమూ, సహకారమూ అంతర్జాతీయ రంగంలో అనేక కారణాలవల్ల కుదించుకునిపోతున్న యీ తరుణంలో యిదిచాలా ప్రముఖమైన విషయం.


అయినప్పటికీ వ్యవసాయంలో, పరిశ్రమల రంగంలో సాధించిన యీ అభివృద్ధి అంతా యిప్పటివరకూ పేదరికాన్ని నిర్మూలించటంలో అంతగా తోడ్పడలేదు. ఇకముందు చేయవలసిన దాన్ని తలచుకున్నప్పుడు యింతకుముందు జరిగిన కృషియెంత అల్పమో తెలుస్తుంది.

ఈ బృహత్తర సమస్యలకు ప్రపంచంలో మరెక్కడా సాటి లేదనటం నిస్సంశయం. మన జనాభా బ్రహ్మాండమైనది. ప్రపంచ జనాభాలో 14 శాతం ప్రపంచలోని భూభాగంలో కేవలం 2.4 శాతం భూభాగంలో క్రిక్కిసలాడుతున్నారు. ఇన్ని భాషలు మాట్లాడే ప్రజలు–ఇంత స్వీయజ్ఞానం వున్న ప్రజలు ఫెడరల్ ప్రజాస్వామ్య విధానంలో వొకేవొక రాజ్యంగావున్న ప్రజలు–మరెక్కడా వుండరు. వివిధ సంస్కృతుల సమ్మేళనంతో జాతీయ సంస్కృతిని రూపొందించే మన ఉద్యమంకూడా అద్వితీయమైనదే. వేర్వేరు భాషలు, మతాలు, సంస్కృతుల నుంచి–సుసంపన్నమైన వొక జాతీయ సంస్కృతిని–భారతీయ సంస్కృతి అని గుర్తించ బడగలిగేదాన్ని – నిర్మించటానికి ప్రయత్నిస్తున్నాము. అందుచేత యింతకు మునుపెన్నడూ లేనివిధంగా వేర్వేరు శక్తుల

వత్తిడి, ప్రభావమూ కనపడవచ్చు అంతమాత్రంచేత ఆశక్తుల అస్తిత్వాన్నే ఖండించటంగానీ, లేక వాటి బలాన్ని అతిగా అంచనా వేయడంగానీ పొరపాటే అవుతుంది.

ఈనాడు మనం—మన ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పుతేవటానికి కృషిచేస్తున్నాము. ఈ కృషికి ప్రజల ఉత్సాహము, మనఃపూర్వక సహకారమూ, క్రమశిక్షణాబద్ధమైన ఉద్యమమూ—దోహదపడనట్లయితే ముందుకు పోలేము. అభివృద్ధి ప్రణాళికలు రచించటం, అవులు జరపటం అన్నది—కేవలం ప్రభుత్వ వ్యవహారంకాదు ప్రజలు తమ స్థితిగతులను మెరుగు పరచుకోవటానికి తమంత తాము ముందుకు రావాలి తద్వారా దేశానికి ఉత్కృష్టమైన భవిష్యత్తును నిర్మించాలి. మన అభివృద్ధికి నిశ్చయంగా తోడ్పడే అంశం వొకటుంది. అది—జాతీయతాభావన; విచ్ఛిన్నకర శక్తులను నిరుత్సాహపరిచే ఆరోగ్యకరమైన జాతీయతాభావన. ప్రాచీనమైనమహత్తరమైన మన దేశంపట్ల—మానవ కృషికి సంబంధించిన అన్నిరంగాలలోనూ యుగయుగాలుగా మన దేశం సాధించిన విజయాలపట్ల—ప్రజాహృదయాలలో ప్రేమాభిమానాలను నాటాలి. ఈనాడు దేశానికెంతో అవసరమైన ఉత్సాహము ప్రజలలో పెల్లుబకాలంటే దేశభక్తివల్లనే సాధ్యపడుతుంది. వేర్పాటు ధోరణులను ప్రతిఘటించి, జాతి ఆత్మవిశ్వాసానికి తోడ్పడుదాము. మనఆర్థిక, సామాజికరంగాలలో క్రమబద్ధమైన మార్పు రావటానికి—యీఆత్మవిశ్వాసం,యీజాతీయతత్వం అనేవి ప్రోద్బలాలవుతాయి. భారతదేశ సుదీర్ఘ చరిత్రచూస్తే సహనానికి, పరస్పరావగాహనకూ, భౌతిక విలువలపై నైతికవిలువల ప్రాబల్యానికి ప్రాముఖ్యం వున్నట్లు తెలుస్తుంది ఆ సంప్రదాయాలకు—మన యిప్పటిచర్యలవల్ల కళంకం ఆపాదించగూడదు. ఘనమైన ఆసంప్రదాయాలకు కట్టుబడివుంటే—భారత జాతీయ—వాస్తవమైన అంతర్జాతీయత పెరుగుదలకూ తోడ్పడగలదని నావిశ్వాసం. ఆదర్శవాద పూర్వకమైన అన్నిరంగాలలో కూడా బలీయమైన జాతీయభావాలు పనిచేస్తుంటాయని యిటీవల సంఘటనలు ఋజువు పరిచాయి. నేను, నా జాతి అన్న భావనను గుర్తించి, ఉపయోగపరిచినప్పుడే—ప్రజలలోని నిర్మాణాత్మక శక్తుల సమీకరణజరిగి విచ్ఛిన్నకర ధోరణులు పరిహరింపబడుతాయి. అత్యుత్సాహంతో, అవిరళకృషితో బలీయమైన సమైక్య భారతావనిని నిర్మించటానికి పూనుకోవాలి, మన శక్తి సామర్థ్యాలలో విశ్వాసం—యితర ప్రపంచ రాజ్యాలతో సమానస్థాయిలో వ్యవహరించగల్గటం— యివే మనకు బలం

వచ్చే అక్టోబరుమాసంలో మహాత్మా గాంధీ శతజయంత్యుత్సవాలను ప్రారంభించబోతున్నాము 'నా గృహాన్ని నాలుగు వైపులా గోడలతో బంధించి, కిటికీలను మూసివేసుకోవటం నా కిష్టంలేదు. దేశదేశాల సంస్కృతీ వాయువులు సాధ్యమైనంత స్వేచ్ఛగా నా గృహంలో వీచటమే నా అభీష్టం కాని ఆ వాయువేగానికి నేను తడబడిపోను బంధిఖానావలె నా మతం సంకుచితమైంది కాదు. భగవంతుని సృష్టిలో అత్యల్ప ప్రాణులకు కూడా నా మతంలో స్థానం వుంది కాని నా జాతి వేరు, మతం వేరు వర్ణం వేరు, అనే అహంభావానికి మాత్రం చోటులేదు" అన్నారు గాంధీజీ. ఈనాడు మనం యెదుర్కొంటున్న సమస్యలన్నింటికీ గాంధీజీ బోధనలన్వయిస్తాయి. భయరాహిత్యంతో, ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో, స్వచ్ఛమైన నిజాయితీతో నడుచుకోవాలని ఆయన యిచ్చిన సందేశం—దేశానికి యీనాడెంతో అవసరం. నైతిక ధర్మమే పరమోత్కృష్టమైనదన్న గాంధీజీ విశ్వాసాన్ని మనం అలవరచుకోవాలి. ఈనాడు మనదేశంలో బోధనకూ ఆచరణకూ మధ్య విపరీతమైన వ్యత్యాసం కనబడుతున్నది; దీని ఫలితంగా జాతీయజీవనంలో వివిధరంగాలలో ప్రమాణాలు పడిపోవటం— క్రమశిక్షణారాహిత్యం పెరిగిపోవటం జరుగుచున్నది. అహింసా సిద్ధాంతాన్ని ఒక మత విశ్వాసంగా స్వీకరించినా, స్వీకరింపకపోయినా — నాగరిక ప్రపంచపు ప్రవర్తనగా — మానవ వ్యక్తిత్వంపట్ల గౌరవ ప్రకటనగా స్వీకరించాలి. హింసావిధానం ప్రజాస్వామ్య మూలసిద్ధాంతానికే వ్యతిరేకం. సహనం, అహింస, అవగాహన — యీ లక్షణాలు ప్రజాజీవనంలో ఔచిత్యాన్ని సాధించడానికే కాక — మన అస్తిత్వాన్ని నిలబెట్టుకోవటానికే — అత్యావశ్యకం. గడచిన ఉజ్వలకాలాన్నీ, భవిష్యత్తునూ దృష్టిలో వుంచుకుని ప్రస్తుతం మనం యెదుర్కొంటున్న సమస్యలను చూడగలుగుతే — ఆ లక్షణాలు మన ప్రజలకు తేలికగా, సహజసిద్ధంగా అలవడుతాయి.





పాకిస్తాన్‌తో నిర్యుద్ధ సంధి:
ప్రధాని చే ప్రతిపాదన పునరుద్ఘాటన

21వ స్వాతంత్ర్య వార్షికోత్సవ సందర్భంగా చరిత్రాత్మకమైన ఎర్రకోట బురుజుపైనుంచి జాతినుద్దేశించి ప్రసంగిస్తూ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి, భారత దేశం ధైర్యసాహసాలు, కృతనిశ్చయంగల దేశమని, ఏ ఒకరి ఒత్తిడికీ తలవొగ్గదని అభిభాషించారు. ఉభయ దేశాల శ్రేయస్సుకు ఉత్తమ మార్గమైన నిర్యుద్ధ సంధికి భారత దేశం చేసిన ప్రతిపాదనను పునరాలోచించవలసినదిగా పాకిస్తాన్‌కు ప్రధాని విజ్ఞప్తి చేశారు.

దేశాన్ని అభ్యుదయంవైపు, సౌభాగ్యపథంవైపు మళ్ళించి ముందుకు పురోగమింపజేయడంలో ప్రజలంతా పరస్పరం చేతులు కలిపి ప్రభుత్వానికి చేయూత నివ్వాలని ప్రజలకు ఆమె విజ్ఞప్తి చేశారు. దేశ సమైక్యతకు చిచ్చుపెట్టే విచ్ఛిన్నకర శక్తులపట్ల ప్రజలు అప్రమత్తులై మెలగాలని ప్రధాని హెచ్చరించారు. దేశంలో మాటిమాటికి కులమత సంఘర్షణలు, హింసా దౌర్జన్యాలు చెలరేగడం తనకెంతో బాధాకరంగా వున్నదని చెప్పుతూ యిటువంటి విచ్ఛిన్నకర కార్యకలాపాలలో తలదూర్చడం ద్వారా యువజనులు తమ శక్తియుక్తులను వృధాచేయరాదని ప్రధాని ఉద్బోధించారు. ప్రపంచమంతటా యువజనులలో నేడు ఒక క్రొత్తరకం అశాంతి తాండవిస్తున్నదని, క్రొత్త సమస్యలను పాత సమాధానాలతో పరిష్కరించుకొనలేమని, క్రొత్త సవాళ్ళను యువజనులు ధైర్యంతో ఎదుర్కోవాలని ఆమె ఉద్ఘాటించారు.

వ్యవసాయ రంగంలో సాధించిన విప్లవంపట్ల హర్షం ప్రకటిస్తూ 'అధిక లాభాలు, వేతనాలమీదనే కేవలం తమ దృష్టిని కేంద్రీకరించరాదని' పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తలకు, వ్యాపారస్తులకు ప్రధాని విజ్ఞప్తి చేశారు. "ధనికులు, పేదలమధ్య అసమానతలను తొలగించడానికై అందరితో కలిసి దేశాన్ని ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారానికి వారు కూడా కృషి చేయాలి" అని ఆమె అన్నారు.

పాకిస్తాన్‌కు ఆయుధాలు అమ్మేందుకు రష్యా గైకొన్న నిర్ణయం భారత దేశంలో ప్రతి ఒక్కరికీ ఆందోళన కలిగించే విషయమైనప్పటికీ దీనిని తలచుకొని భయ విహ్వలులం కావలసిన అగత్యం లేదని. దురదృష్టవశాత్తు పాకిస్తాన్‌తో మన సంబంధాలు స్నేహ పూర్వకంగా లేవని. భారత దేశంతో ఎప్పుడూ ఏదో సంఘర్షణద్వారా పాకిస్తాన్ ఉద్రిక్తతను రెచ్చగొడుతూనే వస్తున్నదని ప్రధాని వక్కాణించారు.

ప్రజలు ఎప్పుడూ మెళుకువతో అప్రమత్తులై వుండాలనీ, భారత దేశంలోనూ, మరి కొన్ని యితర దేశాల్లోనూ ప్రజాస్వామ్యానికి ప్రమాదం వాటిల్లవచ్చునన్న ఆందోళన వ్యక్తం చేయబడుతున్నదని అయితే ఈ దేశంలో ప్రజాస్వామ్యం సన్నగిల్లడం జరుగదని—ప్రజలు ప్రజాస్వామ్యాన్ని వర్ధిల్లజేయడం దాని విలువలను గుర్తించడం జరుగుతున్నదని, వారి హక్కులేమిటో వారికి బాగా తెలుసునని ప్రధాని వ్యక్తం చేశారు.

దేశం త్వరలోనే గాంధీ మహాత్ముని శతజయంతి ఉత్సవాలను జరుపుకొనబోతున్నదన్న విషయం జ్ఞప్తికి తెస్తూ, ఆ మహాత్ముని పవిత్ర బోధలను అనుసరించి ఆచరించవలసినదిగా ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా

ముఖ్యమంత్రి సందేశం

ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి, దిగువ సందేశం యిచ్చారు: —


"మన భారత దేశ స్వాతంత్ర్యదినోత్సవం దేశమంతటా ఉల్లాసంగా వేడుకలు జరుపుకోడానికీ, స్వాతంత్ర్యయోధులకు కృతజ్ఞతాంజలులు సమర్పించుకోవడానికీ అవకాశం కలిగిస్తుంది. ఇరవై ఒక్క సంవత్సరాల క్రితం మనం స్వాతంత్ర్యం పొందినప్పటి నుంచీ, మన జాతి, నూత్నమైన, సమృద్ధమైన జీవనాన్ని సాధించాలనే లక్ష్యం వైపుకు పురోగమిస్తున్నది. మనదేశ ప్రజల ఆర్థిక, సాంఘిక ప్రమాణాలను పెంపొందించడానికై రాజకీయ స్వాతంత్ర్యాన్ని మనం సాధనంగా ఎంచాము. నూత్న ప్రమాణాలను, విలువలనూ సాపించడానికీ దేశ రూపు రేఖలను తీర్చి దిద్దడానికీ మనం ఫలప్రదంగా ప్రయత్నించాము. మనం సాధించిన విజయం చరిత్రలో నిలిచివుంటుంది.

"అయితే మనం సాధించవలసింది కూడా చాలావుంది. అనిశ్చితమైన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మన ఆహారోత్పత్తి రంగంలో నిరంతర కృషి జరుగవలసి వుంటుంది. పారిశ్రామికాభివృద్ధికి కూడా తీవ్రస్థాయిలో ప్రయత్నం జరుగవలసి వుంది. ఈ విధంగా మనలను అనేక సాంఘిక, ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నాయి.

"భారతస్వాతంత్ర్య పోరాటం రెండు లక్ష్యాలతో కూడుకున్నది. విదేశపాలన నుంచి విముక్తి పొందడం వాటిలో మొదటి లక్ష్యం. ఆర్థిక, సాంఘిక స్వాతంత్ర్యాన్ని సాధించి దేశంలో దారిద్ర్యాన్ని తొలగించడం రెండవలక్ష్యం. ఇప్పటి వరకు మనం మూడు పంచవర్షప్రణాళికలను విజయవంతంగా అమలు జరుపుకున్నాం. అధిక పెట్టుబడితో నాలుగవ ప్రణాళికను అమలు జరపదలచాం. స్వయం శక్తి జనకమైన ఆర్థికవ్యవస్థను నిర్మించడంలో యిది చాలావరకు తోడ్పడగలదని ఆశించవచ్చు.

మనస్ఫూర్తిగా విజయాన్ని కాంక్షించి కృతనిశ్చయంతో కృషిసలిపినట్లయితే మన ప్రియతమ లక్ష్యాలను, మన జీవిత కాలంలోనే సాధించగలుగుతాం. ఈ పవిత్రమైన లక్ష్యాల సాధనకై మనః పూర్వకంగా దృఢసంకల్పంతో కృషిచేయడానికి ఈ సందర్భంలో మరోసారి దీక్షబూనుదాం."





ప్రాంతీయ అసమానతలు తొలగించబడాలని

ముఖ్యమంత్రి విజ్ఞప్తి

ఆత్మ విశ్వాసముతో దేశం అభ్యుదయ పథం వైపు పురోగమించాలంటే, ప్రాంతీయ అసమానతలు—సాంఘిక, ఆర్థిక అసమానతలు తెచ్చి పెట్టే జంట ప్రమాదాలను సత్వరం తొలగించుకోవడం అవసరమని ఆగస్టు 15న సికిందరాబాద్ పేరేడ్ గ్రౌండులో స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా జరిగిన సైనిక విన్యాసంలో ప్రసంగిస్తూ ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి ఉద్ఘాటించారు.

ముఖ్యమంత్రి సైనిక వందనం స్వీకరించి, సైనిక విన్యాసాన్ని పర్యవేక్షించారు.

ఈ సందర్భంలో ప్రసంగిస్తూ ఆర్థిక సాంకేతిక సహాయార్థం మనం ఎక్కువగా యితర దేశాలపై ఆధారపడడం వల్ల స్వశక్తి ఉత్సాహాలు మనలో నశిస్తాయని, అభివృద్ధి చెందుతున్న దేశానికి బయటి సహాయం కొంతవరకు అవసరం కావచ్చునేమో కాని దేశం స్వశక్తి పైననే ఆధార పడేందుకు ఎక్కువగా కృషి చేయడమనేది ప్రధానమైన విషయమని ముఖ్య మంత్రి నొక్కి వక్కాణించారు.

రెండు సంవత్సరాలపాటు కొనసాగిన కష్టకాలం తర్వాత, గత సంవత్సరం పంటలు సమృద్ధిగా పండడంతో ఈ పరిస్థితి దేశాభివృద్ధికి భారీ ఎత్తున నాల్గవ పంచవర్ష ప్రణాళిక రూపొందించుకొనేందుకు ఆలోచనను కలిగించిందని చెప్తూ, ఈ సంవత్సరం, ఆంధ్రప్రదేశ్‌లో చాలా ప్రాంతాలు తీవ్ర దుర్భిక్ష పరిస్థితులకు గురి కావడం జరిగిందని ఈ క్లిష్ట పరిస్థితుల నెదుర్కొనేందుకు ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేయగలదని ముఖ్య మంత్రి హామీ యిచ్చారు.

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హైదరాబాదులోని రోటరీ క్లబ్‌లో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ రాజకీయ పరాధీనత కన్నా, "ఆర్థిక పరాధీనత" హీనమైనదని అన్నారు. యితర దేశాలనుండి ఎల్లప్పుడు ఆర్థిక సహాయం పొందలేమనీ, "మన కాళ్ళపై మనం నిలువబడా"లనీ ఆయన అన్నారు.

నీలోఫర్ స్త్రీల, బాలల ఆసుపత్రిలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ సమావేశంలో ప్రసంగిస్తూ, నాలుగవ ప్రణాళికలో తాలుకా ఆసుపత్రులకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తగిన మొత్తాలను కేటాయించాలని ముఖ్యమంత్రి అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో యితోధిక వైద్య సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుందని ఆయన అన్నారు.

జిల్లాలలో

కడపలో జిల్లా కలెక్టరు, శ్రీ ఎం. వెంకటేశ్వరరావు, జాతీయ పతాకాన్ని ఎగురవేసి, సైనిక వందనం స్వీకరించారు. ఆ తర్వాత కలెక్టరు, జిల్లా పరిషత్తు అధ్యక్షులు డా॥ డి. ఎన్. రెడ్డి, సమావేశంలో ప్రసంగిస్తూ ఎన్నో యిక్కట్టులను అనుభవించి సంపాదించుకున్న భారతదేశ స్వాతంత్ర్యాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరాన్ని గూర్చి నొక్కి చెప్పారు.

ఏలూరులో పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టరు, శ్రీ కె. సుబ్రహ్మణ్యం, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. రిజర్వు పోలీసు మైదానంలో సైనిక వందనం స్వీకరించారు. ఈ సందర్భంలో ఆయన ప్రసంగిస్తూ పారిశ్రామికీకరణ ప్రాధాన్యతను గూర్చి నొక్కి చెప్పారు.

కర్నూలు జిల్లా కలెక్టరు శ్రీ బి. కె. రావు, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసు మైదానంలో జరిగిన పెరేడు సమర్పించిన సైనిక వందనాన్ని స్వీకరించారు. కలెక్టరు ప్రసంగిస్తూ, ప్రస్తుత పరిస్థితులలో కష్టపడి పనిచేయాల్సిన అవసరాన్ని గూర్చి నొక్కి చెప్పారు.

ఇదేవిధంగా వివిధ జిల్లాలనుండి స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకున్న వార్తలు అందాయి.

విదేశాలలో భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

జకార్తా

ఆగస్టు 15 ఉదయం యిచ్చట భారతరాయబారి గృహంవద్ద ఏర్పాటుచేయబడిన పతాకావిష్కరణోత్సవంలో 500 మంది స్థానిక భారతీయులు పాల్గొన్నారు. రాష్ట్రపతి సందేశం అందరికి చదివి వినిపించబడింది.

నైరోబి :

భారత దేశంలోని వ్యావసాయిక విప్లవం, పారిశ్రామిక ప్రగతి, ఎగుమతుల పెంపుదల, శాస్త్ర, విద్య, ఆరోగ్యరంగాల్లో పురోగమనం గురించిన విశేషాలను వివరిస్తూ ప్రత్యేక అనుబంధాలతో యిక్కడ వివిధ వార్తాపత్రికలు వెలువడ్డాయి

అట్టావా :

స్వాతంత్ర్యదినోత్సవ సందర్భంగా యిక్కడ భారత హైకమీషనర్ జనరల్ జె యస్. చౌదరి ఆహ్వానసభ నొకటి ఏర్పాటుచేశారు. ఇండో - కెనడా అసోసియేషన్ సభ్యులు, స్థానిక భారతీయులు కెనడియన్ ప్రముఖులు ఈ సభకు హాజరయ్యారు. మాంట్రిల్, క్విబెక్స్, విండ్సార్ తదితర కెనడియన్ పట్టణాలలో కూడా స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు జరిగాయి.

లావోస్ :

అనేకమంది స్థానిక భారతీయుల సమక్షంలో భారత హైకమీషనర్ శ్రీ రామచంద్రన్, తమ నివాస గృహంవద్ద పతాకావిష్కరణ గావించారు నైజీరియాలో అన్నిరంగాల్లో భారతీయులు వహించే పాత్రలను గురించి ఆయన ప్రసంగించారు దినదినాభివృద్ధిగాంచే ఇండో - నైజీరియా స్నేహసంబంధాల గురించి కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. స్వాతంత్ర్యోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక అనుబంధాలతో స్థానిక పత్రికలు వెలువడ్డాయి.

డబ్లిన్ :

జాతీయగీతాలాపన చేసి యిక్కడి భారతీయులు భారత 21వ స్వాతంత్ర్యవార్షికోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. జాతినుద్దేశించి రాష్ట్రపతి యిచ్చిన సందేశాన్ని అందరికీ చదివి వినిపించారు. స్థానిక టెలివిజన్‌సంస్థ ఈ సంఘటనను ప్రసారం చసింది.

బ్యాంకాక్ :

ఇక్కడ భారత దౌత్యకార్యాలయం వద్ద పతాకావిష్కరణ కార్యక్రమం జరిగింది అనేకమంది స్థానిక భారతీయులు ఈఉత్సవానికి హాజరయ్యారు. భారతరాయబారి శ్రీ కె. ఆర్. నారాయణ్ రాష్ట్రపతి సందేశాన్ని చదివి వినిపించారు.

గ్యాంగ్‌టక్ :

ఆనందోత్సాహాలతో ఆగస్టు 15 యిక్కడ వైభవోపేతంగా జరుపబడింది. ఒకవైపు కుండపోతగా వర్షం కురుస్తున్నప్పటికినీ 2000 మందిదాకా ప్రజలు పతాకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. హాజరైన ప్రముఖ అతిథివర్గంలో చోగ్యాల్, గ్యాల్మో, యితర రాజకుటుంబీకులు వున్నారు. ఈ సందర్భంగా వ్యాసరచనా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

పోర్టు ఆఫ్ స్పెయిన్ : ట్రినిడాడ్

స్వాతంత్ర్యోత్సవ చిహ్నంగా యిక్కడ ఒక సమావేశం ఏర్పాటు చేయబడింది. రాష్ట్రపతి డా॥ జాకిర్ హుసేన్, హైకమీషనర్ మనిలాల్ సందేశాలను పతాకశీర్షికలతో ప్రకటించిన ప్రత్యేక అనుబంధాలతో స్థానిక వార్తాపత్రికలు వెలువడ్డాయి. భారత స్వాతంత్ర్య విధాతలకు జోహారులర్పించే ప్రత్యేక కార్యక్రమాన్ని ట్రినిడాడ్ రేడియో ప్రసారం చేసింది. ట్రినిడాడ్ టెలివిజన్ కూడా స్వాతంత్ర్యానంతరం భారతదేశ ప్రగతిని గురించి 45 నిమిషాల ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రసారం చేసింది.

డెమాస్కస్ :

ఇక్కడ భారత దౌత్యకార్యాలయంవద్ద, భారతీయులు స్వాతంత్ర్యదినోత్సవం జరుపుకున్నారు. శాంతియుత మార్గంలో సాధించబడిన భారత స్వాతంత్ర్యాన్ని గురించి రాయబారి శ్రీ కిద్వాయ్ ప్రసంగించారు. స్వేచ్ఛాభారతావనిపై భారతీయుల దృఢ దీక్ష సంకల్పాలు పెద్ద అధినేతలైన బ్రిటిష్‌వారిని సైతం రాజ్యం అప్పగించేలా చేసాయి అని ఆయన అన్నారు. సైగాన్, దారుస్సలాంలలోకూడా స్వాతంత్ర్య దినోత్సవాలు నిర్వహించబడినవి.

కైరో :

ఇండో-అరబ్ సంఘం ఏర్పాటుచేసిన బ్రహ్మాండమైన సాంస్కృతిక ఉత్సవంలో భారత స్వాతంత్ర్యదినం వేడుకగా నిర్వహించబడింది స్థానిక భారతీయులు విదేశ అతిధులుకూడిన సభను ఉద్దేశించి శ్రీ యల్. యన్. రే. ప్రసంగించారు

టెహరాన్ :

టెహరాన్‌లో భారత-యిరానియన్ సంఘం భారత దౌత్యకార్యాలయంవారు ఏర్పాటుచేసిన సంయుక్త కార్యక్రమంలో స్వాతంత్ర్యదినోత్సవం వైభవోపేతంగా నిర్వహించబడింది దౌత్యగృహంవద్ద ఏర్పాటుచేసిన సభకు కొన్ని వేల మంది అతిధులు విచ్చేశారు ఈ సభలో భారతరాయబారి శ్రీ కె. వి. పద్మనాభన్ రాష్ట్రపతి సందేశం చదివి వినిపించారు. భారతీయ సాంప్రదాయాన్ని ప్రతిఫలింపజేసే నృత్య సంగీత కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేయబడినవి ప్రముఖ దినపత్రికలైన 'ఎటెలెట్' 'టెహరాన్‌జర్నల్' ప్రగతిపథంలో భారతదేశం అనే అంశంపై వ్యాసాలు ప్రచురించాయి రేడియో, టెలివిజన్ సంస్థలు ప్రత్యేక కార్యక్రమాలు ప్రసారంచేశాయి.

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్‌లో చేరుట ద్వారా

మీ భవిష్యత్తుకై పొదుపు చేయండి

ఇది భారత ప్రభుత్వముచే ప్రారంభింపబడినది.
స్టేట్ బ్యాంక్ ఆవ్ ఇండియా మరియు దాని సబ్సిడియరీల అన్నిటిలోను చందాలను అంగీకరించెదరు.

చందాకట్టె పద్ధతి

ఏడాదికి రు. 100కు తక్కువ కాకుండగాను, రు. 15,000 కు మించకుండాను ఏ సమయములోనైనా ఎన్ని దఫాలుగానైనా రు. 5 గుణాంకములలో ఎంత మొత్తముగానైనా మీరు చందాను చెల్లించవచ్చును. ఐతే, నెలకు ఒక్క పర్యాయము వంతున మాత్రమే దీనిని చెల్లించాలి. ప్రస్తుత సంవత్సరములో మీ చందా సొమ్ముపై సాలీనా 4.8 శాతమువడ్డీ లభిస్తుంది.

పన్నులో రాయితీలు

ఆదాయపు పన్ను చట్టములో పేర్కొనబడినట్లు మీరు చందా కట్టిన సొమ్ము పన్ను కట్టవలసిన ఆదాయమునుండి మినహాయింపబడుతుంది. మీకు లభించే వడ్డీపైకూడా ఆదాయపుపన్ను వుండదు ఈ ఫండులో నిలువ వున్న సొమ్ముపై సంపదపన్ను వుండదు.

సొమ్ము తీసుకొనుట, అప్పులు

ఈ ఫండ్‌లో సొమ్ము వేయుట ప్రారంభించిన 15 సంవత్సరముల తరువాత సొమ్మును పూర్తిగా తీసుకొనవచ్చును ఒకవేళ చందా కట్టిన వారు చనిపోయినట్లయితే ఈ గడువులోగానే చనిపోయిన వ్యక్తి పేర్కొనినవారికిగాని, చట్టసమ్మతులైన వారి వారసులకుగాని సొమ్ము పూర్తిగా చెల్లించబడుతుంది ఈ ఫండ్ నుండి పాక్షికముగా సొమ్ము తీసుకొనుట పరపతి సౌకర్యములుకూడా నిర్ణీత పరిమితిలో లభించగలవు.

జప్తునుండి రక్షణ

ఏ కోర్టు డిక్రీద్వారాగాని ఈ ఫండ్‌లో వుండె సొమ్మును జప్తు చేయుటకు వీలులేదు.

డాక్టర్లు, లాయర్లు, నటులు, వర్తకులు, పెన్షను పొందేవారు ఈ ఫండ్‌లో సొమ్ము పొదుపు చేయుటకు సౌకర్యము కల్పించబడినది స్వయముగా పై వృత్తులలో నిమగ్నులైన వ్యక్తులు ఈ ప్రావిడెంట్ ఫండ్‌ద్వారా బచ్చితముగా సొమ్మును పొదుపు చేసుకొని, పన్ను రాయితీలను కూడా పొందవచ్చును

ఇతర వివరములకు మీకు సమీపములో వుండె స్టేట్ బ్యాంక్ ఆవ్ ఇండియా మరియు దాని సబ్సిడియరీ బ్యాంకులనుండి సమాచారమును పొందవచ్చును

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ పథకము

ప్రజలకు వరప్రసాదము వంటిది

ఆర్థిక మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వము

davp 68/185

కరువు ప్రాంతాలలో సహాయక చర్యలు

కలెక్టర్ల సమావేశంలో నిర్ణయాలు

ఆంధ్రప్రదేశ్‌లో కరువు పరిస్థితి దారుణమైనదిగా ఉన్నదనీ, రాష్ట్రంలో పరిస్థితిని తెలుసుకోవడానికిగాను కేంద్రం పరిశీలన బృందాలను పంపించాలని ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి నేడు జూబిలీ హాలులో జిల్లా కలెక్టర్ల నుద్దేశించి ప్రసంగిస్తూ అన్నారు. ఈ సమావేశం ఆగస్టు 22వ తేదీన ప్రారంభమైంది.

నెలాఖరులోగా కేంద్ర ప్రభుత్వం పరిశీలన బృందాలను పంపించగలదని ముఖ్య మంత్రి ఆశాభావం ప్రకటించారు మున్నెన్నడూ సంభవించనంత తీవ్రమైన కరువు ఏర్పడినందున కేంద్ర ప్రభుత్వం రెండు మూడు పరిశీలన బృందాలను పంపించడం మంచిదని ముఖ్యమంత్రి సూచించారు.

కరువు పరిస్థితులను పరిశీలన బృందాలు వాస్తవిక దృష్టితో పరిశీలించాలి. కేంద్రం నుంచి ఏవో కొన్ని కోట్ల రూపాయలు రాబట్టుకోవడం కోసం కరువు పరిస్థితులను రాష్ట్ర ప్రభుత్వం గోరంతను కొండంత చేస్తున్నదనే దురభిప్రాయానికి ఆస్కారం కల్పించకూడదు–అని ఆయన అన్నారు.


మూడు రోజులపాటు జరిగిన కలెక్టర్ల సమావేశాన్ని గవర్నర్ శ్రీ ఖండూభాయ్ దేశాయ్ ప్రారంభించారు.

కరువు పీడిత ప్రజలందరికి సంతృప్తికరమైన సహాయం చేయడానికి భారీ యెత్తున కరువు ప్రాంతాలలో సహాయ చర్యలు చేపట్టవలసిన విషయమై కలెక్టర్ల సమావేశం చర్చించింది.

కరువు ప్రాంతాలలో కల్పించే సహాయక చర్యల ఫలితాలు పేదరైతులకు దక్కేటట్లు చేయడానికి కలెక్టర్లు ఏమేమి చేయ్యాలనే విషయం గురించి ముఖ్యమంత్రి, గవర్నర్ కూడా ప్రసంగించారు.

ఎన్నో చిక్కులను ఎదుర్కొవలసి వచ్చినప్పటికి కొరత రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్ రెండు మూడు లక్షల టన్నుల బియ్యాన్ని పంపించ గలిగినదనీ, ఇది హర్షించదగిన విషయమనీ ముఖ్యమంత్రి అన్నారు.

ఇంకా ఏమైనా పంపించగలమని నేను అనుకోను. అంతే గాక, పెద్దఎత్తున మనమే మైదాపిండి, జొన్నలు దిగుమతి చేసుకొనవలసి వస్తుందనుకొంటాను– అని శ్రీ బ్రహ్మానందరెడ్డి అన్నారు.



ఆంధ్రప్రదేశ్ గవర్నరు శ్రీ ఖండూభాయి దేశాయ్ ఆగస్టు హైదరాబాదులో 22న కలెక్టర్ల సమావేశాన్ని ప్రారంభించారు. ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి శ్రీ వి. బి. రాజు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ధరల పెరుగుదల

పెక్కుచోట్ల ఇప్పటికే ధరలు పెరుగుతున్నవని ముఖ్యమంత్రి అన్నారు. అలజడి చేయడం ప్రజలకు ఇష్టం లేకపోయినప్పటికీ ఇది వారి ప్రశాంతతను భగ్నపరుస్తుంది ధరలు విపరీతంగా పెరిగినప్పుడు శాంతి భద్రతల సమస్యలు ఏర్పడగలవని ముఖ్యమంత్రి అన్నారు.

ధరల పెరుగుదలను అరికట్టడానికి గట్టి చర్యలను తీసుకోవాలని ముఖ్యమంత్రి కలెక్టర్లకు విజ్ఞప్తి చేసారు ఇప్పుడు సైతం చాలామంది ప్రజలకు మైదా అందుబాటులో లేదు. పరిస్థితి ఇలా ఉన్నందున ధరల పెరుగుదలను అరికట్టే విషయమై కలెక్టర్లు బాగా ఆలోచించడం అవసరం- అని ముఖ్యమంత్రి అన్నారు

అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రభుత్వానికి చాలినన్ని అధికారాలు ఉన్నవనీ, అక్రమ రవాణాను అరికట్టడానికి తగిన చర్యలు గైకొంటున్నందుకు హర్షిస్తున్నామని, త్వరలోనే అక్రమ రవాణా పూర్తిగా నివారణ కాగలదని ఆశిస్తున్నామని, ముఖ్యమంత్రి అన్నారు

వర్షపాతం

జూన్ జూలై ఆగస్టు నెలల్లో వర్షాలు చాలా నిరాశ కలిగించినవని శ్రీ బ్రహ్మానందరెడ్డి అన్నారు మామూలుగా కురిసే వర్షాలలో ఈయేడాది సగంమాత్రమే కురిసినవని ఆయన అన్నారు. రాష్ట్రం మొత్తంలో పడిన వర్షం లెక్కలుకూడా సరైనవి కావని ఆయన అన్నారు ఎందుకంటే అక్కడక్కడ మట్టుకే వర్షాలు కురిసినవి. వివిధ ప్రాంతాలనుండి వచ్చిన రిపోర్టులు తెలియజేస్తున్న దానికంటే పరిస్థితి ఇంకా అధ్వాన్నంగానే ఉన్నదని అనుకోవలసి వస్తున్నది- అని ఆయన అన్నారు రాబీ పంట క్రింద 63 లక్షల 70 వేల ఎకరాలలో పైర్లు వేసిఉండవలసింది. ఐతే 39 లక్షల 15 వేల ఎకరాలలో మట్టుకే పైర్లు వేశారు. ఖరీఫ్ పంటలో 149 లక్షల ఎకరాలలో పైరువేసి ఉండవలసింది. ఐతే 78 లక్షల ఎకరాలలో మట్టుకే పైర్లు వేయడమైనది. పెక్కు ప్రాంతాలలో వేసిన పైర్లుకూడా మాడిపోతున్నాయి. కనీసం వచ్చే కొద్ది రోజులలోనైనా బాగా వర్షాలు కురిస్తే ఈ పైర్లు దక్కవచ్చు-అని ఆయన అన్నారు.

పేద రైతులకు సత్వర సహాయం చేసే విషయమై చర్యలను ఆలోచించవలసిందిగా ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్లకు విజ్ఞప్తి చేశారు నష్టమైన పంటలకు పూర్తిగా మన మెలానూ పరిహారాన్ని ఇవ్వలేము. కనీసం కరువువల్ల కలిగే ఇబ్బందులను ఎదుర్కోవడంలోనైనా మనం సహాయం చేయవలసి ఉంది. ఈ విషయంలో పంచాయతీరాజ్ సంస్థల సహకారాన్ని వినియోగించుకోవాలి అని ఆయన అన్నారు.

ఇరిగేషన్ అవకాశాలు ఉన్న వివిధ ప్రాజెక్టులక్రింద ఆయకట్టును అభివృద్ధి పరచుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు.

అడవుల పెంపకం

అడవుల పెంపకం కార్యక్రమానికి ఇతోధిక ప్రాముఖ్యం ఇవ్వవలసిందిగా ముఖ్యమంత్రి కలెక్టర్లను కోరారు అడవులను నిర్మూలించడం వర్షాలు సక్రమంగా కురవకపోవడానికి ఒక కారణమని చెబుతుంటారు. ఇందులో కొంత నిజం ఉన్నదని అనుభవం వల్ల తెలుసుకున్నాము. అటవీ శాఖవారు ఈ విషయంలో చేస్తున్న కృషి కాకుండా కలెక్టర్లు ఆయా జిల్లాలలోని ప్రతి ఒకరు ఒక్కొక్క మొక్కను నాటేటట్టు ప్రయత్నించాలని ముఖ్యమంత్రి సూచించారు.

బంజరు భూముల పంపిణీ

బంజరు భూముల పంపిణీ కార్యక్రమాన్ని త్వరితగతిని అమలు జరిపినందుకు ముఖ్యమంత్రి కలెక్టర్లను అభినందించారు. ఐతే జరగవలసిన కృషి ఇంకా ఉన్నదన్నారు భూముల కేటాయింపునకు అధిక ప్రాముఖ్యం ఇవ్వాలని ఆయన కోరారు.

చిన్న కమతాలున్న మెట్ట భూముల రైతులకు సహాయం చేయడానికిగాను ప్రభుత్వం పెక్కుచర్యలను గైకొన్నదని ముఖ్యమంత్రి వివరించారు పేద ప్రజలకు సహాయం చేయడంకంటె ఉత్తమమైన సేవ మరొకటి లేదన్నారు

జిల్లా బోర్డుల ఏర్పాటును ప్రస్తావించి ప్రభుత్వం తొందరపడి ఇట్టి జిల్లా బోర్డులను ఏర్పాటు చేసినదని భావించడానికి ఎట్టి కారణం కనిపించడం లేదని ముఖ్యమంత్రి అన్నారు. గత తొమ్మిది నెలల అనుభవాన్ని బట్టి వివిధ రంగాలలో జిల్లా బోర్డులు ఎంతో కృషిచేసినవని చెప్పవచ్చునని ఆయన అన్నారు. ఇంకా జరగవలసిన కృషి ఎంతో ఉన్నదనికూడా ఆయన అన్నారు.

విద్యుచ్ఛక్తి సరఫరా

వ్యవసాయ ప్రయోజనాలకు విద్యుచ్ఛక్తి సరఫరా గురించి మాటాడుతూ ఈ సంవత్సరాంతంలోగా 39 వేల కనెక్షన్లు ఇచ్చే లక్ష్యం, 6650 గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేసే లక్ష్యం నెరవేర్చాలని ఆయన అన్నారు.

రిగ్ యంత్రాల సరఫరాను ప్రస్తావించి కలెక్టర్లు ఈ విషయమై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ముఖ్యమంత్రి అన్నారు. కనీసం ఒక్కొక్క తాలూకాకు ఒక్కొక్క రిగ్ యంత్రాన్నైనా ఇవ్వాలన్నదే తమ లక్ష్యమని ఆయన వివరించారు.

గవర్నర్ ప్రసంగం

వర్షాభావం వల్ల ఏర్పడిన పరిస్థితులు విస్తృత ప్రాంతాలను పీడించవచ్చునని గవర్నర్ శ్రీ ఖండూభాయ్ దేశాయ్ తమ ప్రసంగంలో హెచ్చరించారు రాష్ట్ర ప్రభుత్వం సహాయ చర్యల నిమిత్తం ఇదివరకే 6 కోట్ల 25 లక్షల రూపాయలు వ్యయపరచిన

దని గవర్నర్ అన్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం కూడా సహాయం చేయడానికి ముందుకు వస్తున్నది—అని ఆయన అన్నారు

ఉప ప్రధాని శ్రీ మొరార్జీ ఇటీవల రాయలసీమలో పర్యటించినందువల్ల రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్రం మరింతగా అవగాహన చేసుకొనగలదని, రాష్ట్రంలో కరువు పరిస్థితి ఎదుర్కోవడానికి ఇతోధికంగా సహాయం చేయగలదని ఆశిస్తున్నామని గవర్నర్ చెప్పారు.

కరువు ప్రాంతాలలో పేద రైతుల కడగండ్లు నివారించడం కోసం కలెక్టర్లు చేస్తున్న కృషిని గవర్నర్ ప్రశంసించారు "పరిస్థితిని ఎప్పటి కప్పుడు జాగ్రత్తగా గమనిస్తూ ఉండండి ప్రజలు కష్టపడకుండా శ్రద్ధ వహించండి. అనావృష్టి పరిస్థితిలో ప్రజలకు కావలసిన సౌకర్యాలు సమకూర్చడానికి ప్రయత్నించండి" అని గవర్నర్ కలెక్టర్లను కోరారు.

కలెక్టర్లు సహకరించినప్పుడే ఇతర రాష్ట్రాలకు ఆహార ధాన్యాలను ఒడుదుడుకులు లేకుండా రవాణా చేయడం సాధ్యమౌతుందని, ఈ రాష్ట్రంలో ఇందుకు సంబంధించిన కృషి సంతృప్తిగా కొనసాగినందుకు హర్షిస్తున్నామని, మొత్తంమీద ఆశించిన మేరకు ఇతర రాష్ట్రాలకు సహాయం చేయగలిగామని, ఈ ఖ్యాతి కలెక్టర్లదేనని ఆయన అన్నారు.

ప్రణాళికా యుగమైన ఈనాడు కలెక్టర్లే జిల్లాల్లో ప్రభుత్వమని గవర్నర్ అన్నారు. మనకు ఉన్న పరిమిత సాధన సంపత్తులన్నీ ఉత్పత్తి యోగ్యంగా సక్రమ వినియోగం కావాలని గవర్నర్ అన్నారు.

హరిజన సమస్య

హరిజనుల, గిరిజనుల పరిస్థితిని మెరుగు పరచడానికి సాధ్యమైన అన్ని చర్యలను గైకొన వలసిందిగా గవర్నర్ కలెక్టర్లను ఉద్బోధించారు. హరిజన సంక్షేమం గురించి ప్రత్యేక శ్రద్ధ వహించగల "సెల్" ఏర్పాటు చేయడంపట్ల గవర్నర్ హర్షం తెలియజేసారు ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన సమస్యల విషయంలో రాజకీయ పార్టీలు పరస్పర విరుద్ధంగా మాట్లాడవచ్చు. అటువంటి సందర్భాలలో కలెక్టర్లే ప్రజా శ్రేయస్సు దృష్ట్యా ఏది ఉత్తమమో అట్టి నిర్ణయాలను గైకొంటుండాలని గవర్నర్ సలహా ఇచ్చారు. ఫలానా వారిపట్ల పక్షపాతంతో వ్యవహరించారనే మాట పడకుండా ఉండటంకోసం త్వరగా చర్యలు గైకొనకుండా మానుకొనవద్దు అని కూడా ఆయన సలహా చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ సంక్షేమ నిధి ప్రధాన ప్రోత్సాహకుడుగా, ఈ నిధి ఎలా ఉపయోగ పడుతున్నదో చూడటం తన కర్తవ్యమని ఆయన అన్నారు. "మీ సహాయ సహకారాలతో ఈ నిధులను పెంచే ప్రయత్నాలు ఫలించగలవని ఆశిస్తున్నాను" అని గవర్నర్ అన్నారు.

జిల్లాల్లో పరిపాలనా వ్యవస్థ పనిచేస్తున్న తీరు పట్ల గవర్నర్ సంతృప్తి వ్యక్తపరిచారు. జిల్లాలనుండి ఎప్పటికప్పుడు పరిస్థితి ఎలా ఉన్నదో, ఏమేమి చేస్తుండాలో సమాచారం పంపుతూ ఉండాలి. జిల్లా స్థాయిలో ప్రభుత్వానికి ప్రజలమధ్య కలెక్టరు పాత్ర ముఖ్యమైనది—అని గవర్నర్ అన్నారు.

శ్రీ వి. బి. రాజు సూచన

ఎన్ని చిక్కులు ఎదుర్కొనవలసి వచ్చినా, ఆంధ్ర ప్రదేశ్ తరుగు రాష్ట్రాలకు బియ్యం సరఫరా చేసినదని, కలెక్టర్ల సమావేశానికి అధ్యక్షత వహించిన రెవిన్యూ మంత్రి శ్రీ వి. బి. రాజు అన్నారు ముఖ్యమంత్రి చెప్పినట్టు ఇతర రాష్ట్రాలకు ఇంకా ఎక్కువ మొత్తంలో బియ్యం పంపడం సాధ్యం కాకపోవచ్చునని శ్రీ రాజు అన్నారు. ముతకరకం ధాన్యాలకై మన రాష్ట్రమే కేంద్రానికి విజ్ఞప్తి చేసినట్లు ఆయన తెలియజేసారు.

త్రాగే నీటికి, వ్యవసాయావసరాల నీటికి కూడా సర్వత్రా ప్రజలు సౌకర్యాలు కోరుతున్నారని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని ఈ సమస్య పరిష్కారానికై కృషి చెయ్యాలని శ్రీ రాజు అన్నారు

స్వాతంత్ర్యానంతరం, మొత్తంమీద పట్టణ ప్రాంతాల ప్రజలు సంపన్నులైనారనీ, ఇలా సంపన్నులయినవారు వ్యవసాయావసరాలకు ధనాన్ని పెట్టుబడి పెట్టాలనీ ఆయన సూచించారు

వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలను గుర్తించి పరిశీలించే టందుకుగాను సమావేశంలో పాల్గొంటున్న అధికారులు ఐదు బృందాలుగా చీలి, చర్చలు జరిపారు. +

రెవిన్యూబోర్డు సభ్యులు

రెవెన్యూబోర్డు సభ్యుల ఉద్యోగ హోదాలు దిగువ పేర్కొనబడినవి. ఇవి 1968 జూన్ 12 వ తేదీ నుండి అమల్లోనికి వచ్చినవి.

1. శ్రీ వి. కె రావు, ఐ. సి. ఎస్, మొదటి సభ్యుడు. భూమిశిస్తు, వాణిజ్య పన్నులు, నీటిపారుదల విషయాల కమీషనరు. 2. శ్రీ వి రాజేశ్వరరావు, ఐ ఏ ఎస్, రెండవ సభ్యుడు. సర్వే సెటిల్మెంట్స్ కమీషనరు. 3. శ్రీ ఎన్. కె. గురుస్వామి, ఐ. ఏ. ఎస్, మూడవసభ్యుడు. పౌరసరఫరాలు, భూసంస్కరణల కమీషనరు. 4. శ్రీ ఐ జె నాయుడు, ఐ. ఏ. ఎస్. నాలుగవ సభ్యుడు. పంచాయతీరాజ్, ఆయకట్టు అభివృద్ధి విషయాల కమీషనరు. 5. శ్రీ ఆర్. విఠల్‌రావు, ఐ. ఏ. ఎస్, అయిదవ సభ్యుడు ఎక్సైజు, మద్యనిషేధం కమీషనరు.

న్యాయశాఖ కార్యదర్శి

ఇంతవరకు న్యాయశాఖలో సంయుక్తకార్యదర్శిగా వున్న శ్రీ జె.వీరాస్వామి కార్యదర్శిగా నియమితులైనారు.

ఆంధ్రప్రదేశ్

ప్రత్యేక అధికారాల (పత్రికలు) బిల్లు, 1968

ఉద్దేశాలు, కారణాలను గురించిన ప్రకటన

--- పి. శేషాద్రి

వివిధ మతాలు, కులాలు, భాషలకు చెందిన వ్యక్తులతో సంబంధం వున్న ప్రతిసంఘటనమూ మతసంఘటనగా చిత్రిస్తూ ఇరువర్గాల ప్రజలమధ్య విద్వేషాన్ని, ఉద్రిక్తతనూ రెచ్చగొట్టేవార్తలను ప్రకటించడం ఇటీవల పెంపొందుతున్నది. కొన్ని పత్రికలు యిందుకు ఉద్దేశపూర్వకంగా పూనుకుంటున్నాయి ఇది ప్రజల క్రమబద్ధ ప్రవర్తనకు తప్పనిసరిగా విఘాతంకలిగిస్తుంది పాఠకుల మనస్సులపై వార్తాపత్రికల ప్రభావం అధికంగావుంటుంది కనుకనూ, మారుమూల ప్రదేశాలకుసైతం వీటిని శీఘ్రంగాపంపించి విస్తృతంగా ప్రచారంచేయడానికి ఆధునిక సౌకర్యాలు వున్నాయి కనుకనూ ప్రజల క్రమబద్ధతా ప్రయోజనాలదృష్ట్యా యిటువంటి వ్రాతల విషయంలో నిరోధక చర్యలు తీసుకోడం అవసరం.

నిందాపూరితమైన, అమర్యాదకరమైన, లేక అసభ్యకరమైన వ్రాతలు ప్రచురించే పత్రికలు చాలా వుంటున్నాయి. ఇటువంటి వ్రాతలు ప్రజలకు-ముఖ్యంగా యువకులకు, తరుణ ప్రాయులకు ఎంతో హాని కలిగిస్తాయి కాబట్టి మర్యాద, నీతి నియమాల ప్రయోజనాల దృష్ట్యా యిటువంటి వ్రాతలవిషయంలో నిరోధక చర్యలు గైకొనడం అత్యావశ్యకం. పైన పేర్కొన్న ఉద్దేశాలను సాధించడం కొరకు 1968 వ సం. పు ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక అధికారాల (పత్రికలు) బిల్లును రూపొందించడం జరిగింది.

1968 వ సంవత్సరపు ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక అధికారాల (పత్రికలు) బిల్లును, 1968 జూలై 16 వ తేదీన ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ప్రవేశపెట్టారు ప్రజల క్రమబద్ధత, మర్యాద, నీతినియమాల ప్రయోజనం దృష్ట్యా పత్రికలనూ, ప్రచురణలనూ అదుపులో పెట్టడానికి యిది ఉద్దేశించబడినట్లు దీని అవతారిక వెల్లడిస్తున్నది. అనేక యితర అంశాలతో పాటుగా, మత తత్వంతోకూడిన వార్తలు మొదలైనవాటి ప్రచురణ విషయంలో నిరోధక చర్యలు తీసుకోడం, అమర్యాదకరమైన, లేక అసభ్యకరమైన వ్రాతలను ప్రచురించే పత్రికలపై చర్యలు గైకొనడం ఈ బిల్లు ఉద్దేశమైనట్లు దీనికి అనుబంధ పరిచిన "ఉద్దేశాలు, కారణాలను గురించిన" ప్రకటన బట్టి స్పష్టంగా విదితమవుతున్నది. మర్యాద, నీతినియమాల ప్రయోజనం దృష్ట్యా అమర్యాదకరం, అసభ్యకరమైనవ్రాతల విషయంలో నిరోధక చర్యలు తీసుకోడానికి వీలుకలుగజేసే శాసనం రావడం ఎంతైనా సమర్థనీయం. మన భావిసంతతివారి మనస్సులు కలుషితం కాకుండా వుండడానికి యిది అత్యంత ఆవశ్యకమైనది.

ఈ బిల్లు రెండవ సెక్షను ననుసరించి రాష్ట్ర ప్రభుత్వం, లేక సంబంధిత అధికారి, లేదా అధికారవర్గం అవసరమైన సందర్భంలో ముద్రాపకుని కానీ, ప్రచురణకర్తను కానీ, సంపాదకుని కానీ లిఖితపూర్వకంగా కోరడంద్వారా ఏదైనా ప్రత్యేక విషయం, లేక విషయాలకు సంబంధించి ఏదైనా అంశంతో కూడిన పత్రం, లేక పత్రాలను నిర్దిష్టకాలం వరకు కానీ, లేక వార్తాపత్రికల, లేక యితర పత్రిక యొక్క నిర్దిష్ట సంచిక, లేక సంచికలలోకానీ ప్రచురించడాన్ని నిషేధిస్తూ ఉత్తర్వు చేయవచ్చు ఈ ఉత్తర్వు రెండు నెలలవరకు మాత్రమే అమలులో వుంటుంది. ఉత్తర్వు అందజేయబడిన తేదీ నుంచి పది రోజులలోగా సంబంధిత వ్యక్తులు విన్నపం చేసుకునే పక్షంలో దీనిని పునః పరిశీలిస్తారు. పునః పరిశీలనానంతరం ప్రభుత్వం అట్టి ఉత్తర్వును మార్పు చేయవచ్చు, ఖాయంచేయ వచ్చు, లేదా రద్దుపరచవచ్చు. ఈ విధమైన అధికారం ప్రభుత్వానికి వుంటుంది.

"ప్రజల క్రమబద్ధత", "మర్యాద, లేక నీతి నియమాలు" అనే పదాలను ఈ బిల్లు నిర్వచించడం లేదు. సుప్రీంకోర్టు రమేష్ థాపర్ కేసు సందర్భంలో "ప్రజల క్రమబద్ధత" అనే పదాన్ని ఈ విధంగా విపులీకరించింది :- "......ప్రభుత్వం ఆంతరంగిక నిబంధనలను అమలు పరిచిన కారణంగా రాజకీయ సమాజంలో నెలకొనివున్న ప్రశాంత పరిస్థితులను సూచిస్తుంది". ఘోష్-జోసఫ్ కేసు సందర్భంలో సుప్రీంకోర్టు, "ప్రజల క్రమబద్ధత అంటే ప్రజల శాంతి భద్రతలని అర్థం చెప్పుకోవచ్చు" నని పేర్కొన్నది. కనుక శాంతి పరిస్థితులకు భంగం కలిగించగల ధోరణులను అరికట్టడానికి ఈ శాసనం పూర్తిగా అవకాశం కలిగిస్తుందనేది స్పష్టమవుతున్నది. "మర్యాద" అంటే సత్ప్రవర్తన, ఉత్తమ అభిరుచి అని అర్థం చెప్పుకోవచ్చు. కాబట్టి తద్భిన్నమైన

దంతా "అమర్యాద" క్రిందికే వస్తుంది. "మర్యాద" కారణంగా వాక్ స్వాతంత్ర్యాన్నీ, భావ ప్రకటనా స్వాతంత్ర్యాన్నీ పరిమితం చేయడానికి భారత రాజ్యాంగం రాష్ట్రాలకు అధికారం యిస్తున్నది. "అమర్యాద", "అసభ్యకరం" నిర్వచనాలు ఒకటి కావు. శంకర్‌కూ, మద్రాసు ప్రభుత్వానికీ సంబంధించిన కేసు సందర్భంలో ఈ అంశం వెల్లడైంది. ". . . . అసభ్యకరమైనవి కాకుండానే అమర్యాదకరమైనటువంటి పదాలను ఉదహరించవచ్చు". అని పై కేసు సందర్భంలో పేర్కొనడం జరిగింది. దీని దృష్ట్యా ప్రస్తుత బిల్లును "అసభ్యకరం" అనే గీటురాయిమీద పరీక్షించ నవసరం లేదు. "మర్యాద" కారణంతోనే పరీక్షిస్తే చాలు. ఈ ప్రమాణం దృష్ట్యా ఈ బిల్లు, రాజ్యాంగ బద్ధమైన 'పోలీసు అధికారం' పరిమితులను ఉల్లంఘించదు

కొన్ని అంశాల ప్రచురణను నిషేధించడానికి సంబంధించిన 2 (1) వ సెక్షను 1956 వ సం.పు పంజాబు ప్రత్యేక అధికారాల (పత్రికలు) చట్టంలోని 2 (1) (ఏ)వ సెక్షను వంటిది. పైన పేర్కొన్న 2 (1) (ఏ) వ సెక్షను రాజ్యాంగ బద్ధమైనదేనని వీరేంద్ర-పంజాబు ప్రభుత్వాలకు సంబంధించిన కేసు సందర్భంలో సుప్రీంకోర్టు తీర్పుచెప్పింది. పంజాబు ప్రత్యేక అధికారాల (పత్రికలు) చట్టం (1956) 2 (1) (ఏ)వ సెక్షను క్రింద చేసిన ఉత్తర్వు అధికార్లు ఏకపక్ష నిర్ణయంతో చేసినట్టిదనీ. యిందుకు సంబంధించినవారి అభిప్రాయాలను తెలుసుకోకుండా యిది చేయబడిందనీ పైన తెలిపిన కేసులో అభ్యంతరం తెలుపుకొనబడినందుకు సుప్రీమ్‌కోర్టు, "శీఘ్రంగా నిర్ణయం తీసుకొని సత్వరంగానూ, పటిష్ఠంగానూ చర్యతీసుకోవడం ఈ అధికారాల ప్రయోజనం. కాబట్టి శాంతి భద్రతల పరిరక్షణకు బాధ్యత వహిస్తున్న ప్రభుత్వాధికార్లు ఏక పక్ష నిర్ణయంతో వీటిని అమలుపరచడానికి అవకాశం వుండాలి. న్యాయ పరిశీలనకు లోబడి ఈ అధికారాలను వినియోగించడం ఈ చట్టం ఉద్దేశాన్నే వమ్ముచేస్తుంది". పై అభిప్రాయం దృష్ట్యా. ఈ బిల్లుననుసరించి ప్రభుత్వానికీ, అధికార్లకూ పత్రికా స్వాతంత్ర్యంపై దాడి చేయడానికి అధికారం వుంటుందనే వాదనకు ఆస్కారమే లేదు. కనుక ఈ బిల్లులోని 2 (1) వ సెక్షను రాజ్యాంగబద్ధమైనది

రెండు కాలాల మేటరును ప్రచురింపచేయడానికి అధికారం

ఏదైనా వార్తాపత్రిక, లేక యితర పత్రిక యొక్క నిర్దిష్ట సంచిక, లేక సంచికలలో నిర్ణీత ప్రతిఫలం తీసుకొని రెండు కాలాలకు మించకుండా ఏదైనా విషయాన్ని ప్రచురించడానికి 2 (11)వ సెక్షను క్రింద ప్రభుత్వం, లేక అధికార్లు ముద్రాపకుని, ప్రచురణ కర్తను, లేదా సంపాదకుని కోరవచ్చు. ఈ నిబంధన వార్తా పత్రికలూ, యితర పత్రికలూ అభిలషించదగినది. ప్రతిఫలం తీసుకొని వార్తలు ప్రచురించడానికి పత్రికలు సంతోషించవచ్చు. ప్రతిఫలం చెల్లించినప్పటికీ వార్తలు ప్రచురించడానికి యిష్టపడని పత్రికలకే యిది వర్తిస్తుంది ప్రజల సంక్షేమార్థం ప్రభుత్వం సాగిస్తున్న వివిధ కార్యకలాపాలను గురించిన వార్తలను పత్రికలు ప్రచురించి ప్రజలు ఆ విశేషాలను తెలుసుకునేటట్లు చేయడం ప్రజాస్వామ్యంలో అత్యంతావశ్యకం. ప్రభుత్వం అనుసరిస్తున్న కొన్ని విధానాలు తమకు నచ్చకపోవడం వల్లకానీ లేక తమ విధానాన్ని పురస్కరించుకొని కానీ ప్రస్తుతం కొన్ని పత్రికలు, ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యకలాపాలకు ప్రచారం యివ్వడానికి యిష్టపడడంలేదు తమ విధానాలలో ఏమైనా లోపాలు వుంటే వాటిని సరిదిద్దుకొనడానికై నిర్మాణాత్మకమైన విమర్శను ప్రభుత్వం ఎల్లప్పుడూ కోరుతుంది. ప్రభుత్వం సాగిస్తున్న ఏదైనా ముఖ్యమైన కార్యక్రమాన్ని గురించి ప్రచురించడానికి పత్రికలు నిరాకరించటం శ్రేయస్కరంకాదు. ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారానికి అవకాశంవుండడానికి ఈ నిబంధన ఉద్దేశించబడినట్లు, 1968 జూలై 17వ తేదీన ముఖ్యమంత్రి శాసనసభలో ప్రకటన చేసిన సందర్భంలో స్పష్టీకరించారు. ప్రభుత్వ కార్యకలాపాలను, అభివృద్ధి కార్యక్రమాలను గురించి ప్రచారం చేయవలసి వుంటుందని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు ప్రభుత్వం అందజేసిన సమాచారాన్ని ప్రచురించిన తరువాత ప్రభుత్వం తన పొరపాట్లను సవరించుకోవడానికి వీలుగా అందులోని లోపాలను పేర్కొనడానికీ, నిర్మాణాత్మకంగా విమర్శించడానికీ పత్రికలకు స్వేచ్ఛ వుండనేవుంది కాబట్టి పత్రికల స్వేచ్ఛకు ఈ నిబంధన ప్రతిబంధకమైనదనడం సబబుకాదు.

ప్రచురణకు పూర్వం పరిశీలన

2 (111)వ సెక్షను. ప్రచురించడానికి పూర్వమే ఏదైనా అంశాన్ని పరిశీలించడానికి సంబంధించినది ఇది నిరోధక చర్య క్రిందికి వస్తుంది ఈ నిబంధన క్రింద సంక్రమించే అధికారం ఈ శాసనం ప్రయోజనానికీ, యిది నిర్దిష్టపరుస్తున్న విధానానికీ అనుగుణంగావుంది మత సామరస్యానికి భంగకరమైన కార్యకలాపాల్ని నిరోధించడానికి యిది ఉద్దేశించబడింది. జాతీయ సమైక్యతా సాధనకు వివిధ మతాలవారు కలసి కట్టుగా వుండడం మాత్రమే గాకుండా జాతి వ్యతిరేక ధోరణులను సమూలంగా నిర్మూలించడంకూడా అవసరమే. ఈ నిబంధన ప్రధానంగా ఈ లక్ష్యానికి అనుగుణంగావుంది యిది రాజ్యాంగ వ్యతిరేకమైనదికాదు. పత్రికలను సెన్సార్ చేయడాన్ని భారత రాజ్యాంగం నిర్దిష్టంగా నిషేధించడం లేదనేది గమనార్హమైన అంశం.

పత్రికలు, లేక ప్రచురణల ప్రవేశంపై నిషేధం

రెండవ సెక్షనులో పేర్కొన్న ప్రయోజనాలు నిమిత్తమై రెండు నెలలకు మించకుండా, ఏదైనా వార్తాపత్రిక, యితర పత్రిక, కరపత్రం, లేదా ప్రచురణను ఆంధ్రప్రదేశలోనికి ప్రవేశించనివ్వకుండా నిషేధించడానికి, బిల్లులోని 3వ సెక్షను ప్రభుత్వానికి, లేక సంబంధిత అధికార్లకు అధికారం సంక్రమింపజేసుంది నిషేధపుటుత్తర్వును అధికారిక గెజెటులో ప్రచురించిన తేదీ నుంచి పది రోజుల లోపుగా తత్సంబంధీకులు విన్నపం చేసుకునే పక్షంలో ఈ ఉత్తర్వును పునః పరిశీలిస్తారు. నిషేధ కాలానికి పరిమితినీ, సంబంధితవ్యక్తులు విన్నపం చేసుకోవడానికి అవకాశాన్నీ యిచ్చివున్నట్లయితే సుప్రీంకోర్టు, పంజాబు

తేక అధికారాల (పత్రికలు) చట్టంలోని 3 (1)వ సెక్షన్ను కొట్టివేసి వుండేదికాదేమో అయితే ఆంధ్రప్రదేశ్ బిల్లులోని 3వ సెక్షను ఈ రెండింటికీ అవకాశం కలిగిస్తుంది కాబట్టి సుప్రీం కోర్టు, పై చట్టం విషయంలో పేర్కొన్న లోపం దీనికి వర్తించదు

ప్రచురణలను జప్తు చేయడానికి అధికారం

రెండవ సెక్షను, మూడవ సెక్షను క్రింద చేసిన ఉత్తర్వును ఉల్లంఘించిన సందర్భంలో ప్రచురణ ప్రతులనన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం జప్తు చేసుకోవడానికి అయిదవ సెక్షను అధికారం సంక్రమింపజేస్తుంది. అధికారిక గెజెటులో ప్రకటన చేయడం ద్వారానే యిలా చేయడానికి వీలుంటుంది 5 (1)వ సెక్షను క్రింద ప్రకటన చేసినప్పుడు అట్టి అభ్యంతరకర ప్రచురణ రాష్ట్రంలో ఎచ్చట కనిపించినప్పటికీ దానిని జప్తుచేసుకోడానికి 5 (2)వ సెక్షను నిబంధన మేరకు ఎవరైనా పోలీసు అధికారికి అధికారం వుంటుంది అట్టి ప్రచురణ ప్రతి వున్న ఏదైనా ఆవరణలోకానీ లేక అది లభించవచ్చునని అనుమానంగా వున్న ఆవరణలోకానీ ప్రవేశించి దాని కొరకు అన్వేషించడానికి, పోలీసు సబ్ యిన్‌స్పెక్టరు హోదాకు తక్కువకాని ఎవరైనా అధికారికి ఏ మెజిస్ట్రేటు అయినా అధికారం యివ్వవచ్చు. ఈ శాసనం ప్రయోజనం ఫలప్రదంగా నెరవేరడానికి ఈ నిబంధన చాలా అవసరం. ఈ నిబంధన లేకపోయినట్లయితే అభ్యంతరకర ప్రచురణను నిషేధించినప్పటికీ అది రహస్యంగానైనా సర్క్యులేషనులో వుంటుంది. జప్తు ఉత్తర్వును సవాలుచేస్తూ సంబంధిత వ్యక్తులు, ఉత్తర్వు జరిగిన తేదీ నుంచి అరవై (60) రోజులలోపుగా హైకోర్టుకు అప్పీలు చేసుకోవడానికి 5 (3)వ సెక్షను వీలు కలిగిస్తుంది. ఈ చట్టం క్రింద అధికార్లు "అధికారాలను దుర్వినియోగం" చేసారనుకుంటే దానికి ఈ విరుగుడు వుండనేవుంది కదా.

ముద్రణశాల జప్తు

రెండవ సెక్షను క్రింద చేసిన ఉత్తర్వును ఉల్లంఘించిన సందర్భంలో ముద్రణకు, లేక ప్రచురణకు ఉపయోగించిన ఏదైనా ముద్రణశాలను, లేక పరికరాలను జప్తుచేయడానికి ఉత్తర్వు చేసేందుకు ఆరవ సెక్షను ప్రభుత్వానికి, లేక అధికార్లకు అధికారం సంక్రమింపజేస్తుంది ఈ సెక్షను మేరకు ఉత్తర్వు జరిగినప్పుడు రాష్ట్ర ప్రభుత్వ అధికారం పొందిన ఎవరైనా అధికారి, లేక పోలీసు అధికారి పైన తెలిపిన వాటిని జప్తు చేయవచ్చు. వారు ఆ విధంగా జప్తుచేసిన వెంటనే ఆ సమాచారాన్ని మొదటి తరగతి మెజిస్ట్రేటుకు తెలియజేయాలి అంతట ఆయన జప్తుఅయిన వస్తువును క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (1898) 523, 524 లేక 525 వ సెక్షను ననుసరించి తీసివేయడానికి ఉత్తర్వు చేస్తారు. చట్టబద్ధమైన ఉత్తర్వులను మున్ముందు మళ్లీ మళ్లీ ఉల్లంఘించకుండా వుండడానికై నిరోధకచర్య తీసుకోవడానికి ఆరవ సెక్షను అవకాశం యిస్తున్నది ఈ సెక్షను పోలినట్టి నిబంధనను రాజ్యాంగ సమ్మతమైనదిగా సమర్థించడం జరిగింది.

ఈ చట్టం క్రింద ఏదైనా చర్య తీసుకున్నందుకు, లేక తీసుకొనదలచినందుకు ప్రభుత్వానికి, లేదా ఎవరైనా అధికారికి వ్యతిరేకంగా న్యాయశాస్త్రరీత్యా చర్యతీసుకోడానికి ఏడవ సెక్షను ననుసరించి వీలుండదు. ప్రస్తుతం అమలులోవున్నటువంటి యిందుకు సంబంధించిన యితర శాసనాలకు భంగంలేకుండా వుండడానికి బిల్లులోని 8 వ సెక్షను అవకాశం కలిగిస్తున్నది

శిక్షలు

రెండవ సెక్షను, లేక మూడవ సెక్షను క్రింద చేసిన ఉత్తర్వును ఉల్లంఘించడం, నిర్లక్ష్యం చేయడం జరిగిన సందర్భంలో దోషులకు ఒక సంవత్సరానికి మించకుండా జైలు శిక్షను కానీ, లేక ఒక వెయ్యిరూపాయలకు మించకుండా జరిమానాను కానీ, లేదా ఈ రెండు శిక్షలను కానీ విధించవచ్చు

ప్రతిపాదిత శాసనం, ప్రజాస్వామ్యం ప్రయోజనాల దృష్ట్యా ఆవశ్యకమైనదని చెప్పవచ్చు ప్రభుత్వానికి, లేక అధికార్లకు ఈ విధమైన విశేషాధికారాలు వుండడంవల్ల పత్రికా స్వాతంత్ర్యానికి భంగంవాటిల్లుతుందనడం సరికాదు వాక్ స్వాతంత్ర్యంవున్నందున నేరాలుచేయడానికై ప్రజలను ప్రోత్సహించడానికి కానీ, శాంతి పరిస్థితులకు భంగంకలిగించే చర్యలకు పూనుకోడానికి కానీ ఎవ్వరికీ వీలువుండదు. శాసనాన్ని అమలు పరిచేవారు అధికారాలను దుర్వినియోగ పరచడానికి అవకాశంవున్నంత మాత్రాన ఆ శాసనం చెల్లకుండాపోదు. అక్రమమైన ఉత్తర్వును న్యాయస్థానం ద్వారా కొట్టివేయించడానికి సంబంధిత వ్యక్తులకు ఎప్పుడూ అవకాశం వుండనేవుంది. ప్రతిపాదిత శాసనం న్యాయస్థానాల జోక్యానికి లోబడేవుంటుంది న్యాయస్థానాల పరిశీలనను అనుమతించడానికి సంబంధించిన నిబంధన ఈ బిల్లులోవుంది. ఈ బిల్లు ఆమోదించబడినట్లయితే చెప్పుకోదగిన పత్రిక ఏదీ వుండదనడం పొరపాటు అభిప్రాయం ఈ శాసనంవల్ల తమ స్వాతంత్ర్యం హరించుకొనిపోతుందని పత్రికలు భావించుకోడానికి సరిఅయిన కారణమేదీ కనిపించడంలేదు. అంతేగాక అట్టి స్వాతంత్ర్య పరిరక్షణకు యిది దోహదకారికూడా. ప్రాణప్రదమైన స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు శాసనం ద్వారానే పరిరక్షించబడతాయి కాబట్టి, వాటిని రక్షించడానికి ఉద్దేశించిన శాసనంవల్ల తమ స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు ముప్పువచ్చిందని వాదించడం విడ్డూరం.

ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డిగారు శాసనసభలో ఈ విధంగా ప్రకటించారు. "మేము పత్రికలు పూర్తిస్వేచ్ఛను అనుభవించ కోరుతాం. ప్రభుత్వంలోని పొరపాట్లను సవరించుకోడానికి నిర్మాణాత్మకమైన విమర్శలను వాంఛిస్తాం. పత్రికలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలువుండాలనే వారిలో నేను మొదటి వాణ్ణి. అయితే జాతి ప్రయోజనాల దృష్ట్యా సమంజసమైన కొన్ని పరిమితులకు లోబడి ఇవి వుండాలనే నా అభిప్రాయం." ముఖ్యమంత్రి చేసిన ఈ ప్రకటనను బట్టి ప్రతిపాదిత శాసనం పత్రికా స్వాతంత్ర్యాన్ని అరికట్టగలదని ఆందోళన చెందడం అర్థరహితమైనదనే విషయం స్పష్టపడుతున్నది.

1968 వ సం. పు ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక అధికారాల (పత్రికలు) బిల్లును రాష్ట్రశాసనసభ జూలై 17వ తేదీన సంయుక్త సెలక్ట్ కమిటీకి నివేదించింది.

×

ఆంధ్ర ప్రదేశ్‌లో అనావృష్టి పరిస్థితి


స్వల్పకాలిక, దీర్ఘకాలిక సహాయక చర్యల ఆవశ్యకత

సి. వి. హెచ్. రావు

ఉప ప్రధాని శ్రీ మొరార్జీదేశాయ్, రాయలసీమలో తీవ్రంగా అనావృష్టికి గురిఅయిన కొన్ని ప్రదేశాలను సందర్శించిన మీదట, ఈ ప్రాంతాలలో కరువు నివారణ చర్యలను శాశ్వత ప్రాతిపదికపై తీసుకొనవలసిన అవసరం వున్నదని తాము భావిస్తున్నట్లు తెలియజేశారు. ప్రస్తుతం రూపొందించ బడుతున్న నాలుగవ పంచవర్ష ప్రణాళికలో యిందుకొరకు మొత్తాలు కేటాయించ బడతాయని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో అనావృష్టికి గురిఅయిన యితర ప్రాంతాలలో సహాయక చర్యలు తీసుకొనవలసిన బాధ్యత ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వంమీద వుంటుందనీ, కేంద్రం ఈ విషయంలో సాధ్యమైనంత సహాయం చేస్తుందనేవి ఆయన అభిప్రాయాలైనట్లు కనిపిస్తున్నవి. ఆంధ్రప్రదేశ్‌లో పైన పేర్కొన్నటువంటి రెండు రకాల ప్రాంతాలూ వున్నాయి. అందుచేత యిక్కడ తాత్కాలిక సహాయక చర్యలు, శాశ్వత సహాయక చర్యలు కూడా అవసరమవుతాయి. భౌగోళికమైన కారణాల వల్ల కొన్ని ప్రాంతాలు అనావృష్టికి గురిఅవుతుండగా ఏటేటావచ్చే వర్షాలు పడక పోవడంవల్ల మరికొన్ని ప్రదేశాలు దుర్భిక్షానికి లోనవుతున్నాయి. కాబట్టి, దీర్ఘ కాలికమైన కరువు నివారణ సమస్యనూ, తాత్కాలికమైన అనావృష్టి సహాయక చర్యలనూ శ్రీ మొరార్జీ దేశాయ్ భిన్నమైనవిగా పేర్కొనడం సమంజసంగావుంది.

వర్షాభావం

వర్షాలు ఆశాభంగం కలిగించినప్పుడు రైతులు ఆందోళన పడతారు. రాష్ట్రానికి తీవ్ర నష్టం కూడా కలుగుతుంది. ఇవి, మన దేశంలో వ్యవసాయం యిప్పటికీ చాలా వరకు ఋతుపవనాలపై ఆధార పడివున్నదనే అంశాన్ని వెల్లడిస్తున్నాయి. వర్షాలు సకాలంలో సరిగా పడినప్పుడు ప్రజానీకంలో ఉత్సాహం వెల్లివిరుస్తుంది. ఆశలు చిగురిస్తాయి. అవి చిన్న చూపు చూసినప్పుడు ప్రజలలో నైరాశ్యం, ఆందోళన బయలుదేరుతాయి. నీటిపారుదల సౌకర్యాలు మృగ్యమై, ఇరిగేషను పద్ధతి ద్వారా నీటి సరఫరాకు అవకాశం లేకుండా వున్న ప్రదేశాలలోనూ, చెరువులవంటి చిన్న రకం నీటి పారుదల వనరులు నిర్జలమై పోయిన ప్రదేశాలలోనూ ప్రధానంగా వుండే పరిస్థితి యిది. 1965_66 సంవత్సరంలోనూ, ఆ తరువాత 66_67 సంవత్సరంలోనూ తీవ్ర అనావృష్టి ఎర్పడి ఆహారోత్పత్తిలో తగ్గుదల ఏర్పడిన తరువాత 1967 వ సం॥లో ఋతు పరిస్థితులు సానుకూలంగా వుండడం వల్ల వ్యవసాయ పరిస్థితి మెరుగుపడి ఉపశమనం కలిగింది. కాని మళ్లీ ఈ సంవత్సరం వరుణ దేవుని అనుగ్రహం తప్పింది. వర్షాలు ఆలస్యం



రాయల సీమలో కరువుకు గురైన ప్రాంతాల్లో ఒకటైన ఉరవకొండలో ఉప ప్రధాని శ్రీ మొరార్జీ దేశాయ్ ఆగస్టు 11 న రైతులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న దృశ్యం

కావడంతో ఈ ప్రాంతాలలో వ్యవసాయం బాగా దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. వచ్చే కొన్ని వారాలలోనైనా పరిస్థితి చక్కబడి, కనీసం ఎదిగిన పైర్లన్నా కోలుకొనగలవనీ, వచ్చే రాబీ ఋతువు నాటికైనా అనుకూల పరిస్థితి ఏర్పడగలదనీ మనంఆశిద్దాం.

రెండురకాల సమస్యలు

ఇదివరకే పేర్కొన్నట్లు ఆంధ్రప్రదేశ్‌లో అనావృష్టి సమస్య రెండు అంశాలతో కూడుకున్నది. సాధారణంగా తగినంత వర్షాలు పడుతున్నప్పటికీ కొన్ని కొన్ని ఋతువులలో యివి విఫలమయ్యే ప్రదేశాలలో ఏర్పడే పరిస్థితికి సంబంధించినది మొదటి అంశం. వర్షపాతం అరుదుగా వుండి, కొన్ని సంవత్సరాలుగా చెరువులు, గొట్టపు బావులు, బోరింగు బావులు, సాధారణ బావుల వంటి చిన్నరకం నీటి వనరులు అందుబాటులో వున్న ప్రదేశాలలో తప్ప భూములు సాగు కాకుండా వున్న రాయలసీమ, తెలంగాణా ప్రాంతాలూ, రాష్ట్రంలోని ఉత్తర భాగంలోగల జిల్లాల పరిస్థితికి సంబంధించినది రెండవ అంశం.

మొదట పేర్కొన్న కారణాలవల్ల శ్రీకాకుళం, అనంతపురం, నల్గొండ, విశాఖపట్నం జిల్లాలలో చాలా ప్రాంతాలలో పంటలకు బాగా దెబ్బతగిలినట్లు తెలుస్తున్నది. తూర్పుగోదావరి



రాయలసీమలో ఉపప్రధాని శ్రీ మొరార్జీదేశాయ్ పర్యటన సందర్భంగా గుంతకల్ రైలుస్టేషనో ఆయనకు స్వాగతం చెప్తున్న ప్రజానీకం

పశ్చిమ గోదావరి, కృష్ణాజిల్లాల్లోని మెట్ట తాలూకాలు; గుంటూరు, నెల్లూరు జిల్లాల్లోని కొన్ని తాలూకాలు; రాయలసీమలోని అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో పంటలకు విస్తృతంగా దెబ్బతగిలినట్లు తెలియవస్తున్నది. రాష్ట్రంలోని 1 5 తాలూకాలలోనూ 58 తాలూకాలు దెబ్బతిన్నాయి. ఖరీఫ్ సేద్యం క్రింద 65.56 లక్షలఎకరాల విస్తీర్ణం వుండగా, వర్షాభావంవల్ల 46.35 లక్షల ఎకరాల విస్తీనికి దెబ్బతగిలింది. ఫలితంగా సుమారు రూ 130 కోట్లు విలువ చేసే పంటలకు నష్టం వాటిల్లింది. భూమిశిస్తు రెమిషనువల్ల రాష్ట్ర ప్రభుత్వానికి 1967_68 వ సంవత్సరంలో రూ. 1.58 కోట్లనష్టం కలిగినట్లు అంచనా. దెబ్బతిన్న ప్రాంతాలలో శిస్తు వసూళ్ళను వాయిదా వేయడంవల్ల మరో రూ. 58.35లక్షలవరకు నష్టంవచ్చినట్లు అంచనా.అనావృష్టి ఏర్పడడంవల్ల భూమిశిస్తుకు రెమిషన్లు మంజూరు చేయడం,లేక శిస్తు వసూళ్ళను వాయిదా వేయడం అవసరమవుతుంది కాబట్టి దీనిమూలంగా రాష్ట్ర ఆదాయానికి భంగం వాటిల్లుతుంది. ఇదిగాక తక్కావీ ఋణాలు ఆపత్కాల ఋణాలు మంజూరుచేయడం, ఉపాధులులేని వ్యవసాయకూలీలకు తాత్కాలికంగా పనులు కల్పించే నిమిత్తం రోడ్లనిర్మాణం, చిన్నరకం నీటిపారుదల వనరుల నిర్మాణం, మరమ్మతులవంటి సహాయక చర్యలు గైకొనడం, ప్రజలకు ఆహారధాన్యాలను తగ్గింపుధరలకు సరఫరా చేయడం, పశుగ్రాసం సరఫరాచేయడంవంటి పనులకొరకుకూడా ఖర్చు చేయవలసి వుంటుంది. దెబ్బతిన్న అనేక ప్రదేశాలలో మంచినీటికి కొరత ఏర్పడడం సర్వసాధారణం కాబట్టి మంచినీటి బావులు త్రవ్వకోవడానికి, లేక వాటిని లోతుచేయడానికి అక్కడి ప్రజలకు ఋణాలు కూడా యివ్వబడినవి ఇంకా ఇవ్వవలసి వుంది.

కేంద్ర పరిశీలక బృందాలు

1966_67 వ సంవత్సరంలో అనావృష్టి తీవ్రంగా ఏర్పడడంవల్ల ఈ పరిస్థితిని పరిశీలించి సహాయార్థం గైకొనవలసిన చర్యలను గురించి సిఫార్సు చేసే నిమిత్తం కేంద్రప్రభుత్వ అధికార్ల బృందం రాష్ట్రాన్ని సందర్శించింది. కేంద్ర అధికార్లు, పరిస్థితి తీవ్రతను పరిశీలించి సహాయం అందజేసే విషయంలో మదింపు వేయడానికై 1968 ఏప్రిల్‌లోనూ, వర్షాలు ఆలస్యం కావడంవల్ల తిరిగి 1968 జూన్‌లోనూ రాష్ట్రానికి వచ్చారు సహాయక కార్యక్రమాలను 1968 జూలై మొదటితేదీ వరకు కొనసాగించడానికి రూ. 3.75 కోట్లు, ఈ పనులను అక్టోబరు నెలాఖరువరకు సాగించడానికి రూ. 5 8 కోట్లు అవసరమవుతాయని ఈ బృందంవారు సిఫార్సు చేశారు. రూ. 8 కోట్లు ఖర్చుచేయవలసి వుంటుందని రాష్ట్ర ప్రభుత్వం అంచనావేసింది. ఇప్పటి వరకు కేంద్రం రూ. 3 కోట్ల ఋణం యిచ్చింది. రాష్ట్రప్రభుత్వం దీనికి రూ. 1.25 కోట్లు చేర్చింది. సహాయక చర్యలు నిరాటంకంగా కొనసాగే నిమిత్తం రాష్ట్రం మరో కోటి రూపాయలను కేంద్రం నుంచి ఋణసహాయాన్ని ఆశించి, కేటాయించింది.

1968_69 లో ఖరీఫ్ పంట దిగుబడి బాగా వుండడంవల్ల, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా వుండడంవల్ల గత జూన్ నెలలో పరిస్థితి ఆశాజనకంగా వుంది. కాని వర్షాలు ఆలస్యం కావడంవల్ల, కొన్ని ప్రదేశాలలో ఇప్పటివరకు వర్షాలు పడక పోవడంవల్ల ఈ పరిస్థితి మారిపోయింది. నైరుతి ఋతుపవనాలు యిప్పటివరకూ నిరాశనే కలిగిస్తున్నాయి. జూలై నెలలో రాష్ట్రం మొత్త మీద సగటు వర్షపాతం 96.7 మిల్లీమీటర్లు మాత్రమే వుంది. అయితే మామూలుగా రాష్ట్రంలో సగటు వర్షపాతం 164.4 మి. మీ. వుంటుంది, పోతే తెలంగాణా ప్రాంతంలోనూ, పశ్చిమగోదావరి, కృష్ణా, నెల్లూరు, కర్నూలు జిల్లాలు మినహా ఆంధ్రప్రాంతంలోని మిగతా జిల్లాలన్నింటిలోనూ సగటు వర్షపాతం తక్కువగా వుంది. కాగా అనంతపురంజిల్లాలో యిది మరీ తక్కువ. దీని ఫలితంగా ఖరీఫ్ పంటలను చాలా ఆలస్యంగా వేయడం, జరిగింది. పైర్లు పడినచోట్లలో మొక్కలు ఎండిపోవడం నాట్లు వేయకపోవడం జరిగింది. ముఖ్యమైన జలాశయాలలోనూ, వీటిమీద ఆధారపడివున్న కాలువలలోనూ నీటిమట్టం చాలా తక్కువగా వున్నట్లు తెలుస్తున్నది. మెట్ట ప్రాంతాలలోని గ్రామాలలో మంచినీటికి, పశుగ్రాసానికి కూడా కొరత ఏర్పడింది.

1968_69 వ సంవత్సరంలో వివిధ సహాయక చర్యలు తీసుకోడానికీ, ప్రస్తుతం అమలులోవున్న చర్యలను కొనసాగించడానికీ రూ. 20 కోట్లు మొదలు రూ. 22 కోట్ల మొత్తం వరకు అవసరముంటుందని అధికారికంగా అంచనా వేశారు. కేంద్రం తక్షణమే రూ. 2 కోట్లు సహాయంగా యివ్వవలసిన అవసరాన్ని గురించి రాష్ట్రప్రభుత్వం నొక్కివక్కాణించింది. ఈ విధంగా ఎంత మేరకు సహాయం చేయవలసి వుంటుందనే అంశాన్ని కేంద్ర ప్రభుత్వ అధికార్లు మళ్లీ మదింపు జరిపి నిర్ధారించవలసి వుంది. అనావృష్టికి తీవ్రంగా గురి అయిన అనంతపురం జిల్లా ప్రాంతాలలో పర్యటించి అక్కడి పరిస్థితులను శ్రీ మొరార్జీ దేశాయ్ ప్రత్యక్షంగా చూశారు. కాబట్టి తక్షణమే కొంత సహాయం లభించగలదని ఆశించవచ్చు, ఇదే విధంగా శ్రీ జగ్జీవన్‌రామ్ రాష్ట్రంలో పర్యటించిన ఫలితంగా, అనావృష్టి ఏర్పడిన ప్రాంతాలలో బావులు త్రవ్వడానికి 'రిగ్గులు' దిగుమతి చేసుకునే నిమిత్తం తక్షణమే విధులు లభ్యంకాగలవని ఆశించబడుతున్నది.

తక్షణ చర్యలు


ప్రస్తుతకరువు పరిస్థితుల దుష్ప్రభావం రాష్ట్రంలో వచ్చే సంవత్సరపు ఆహారపరిస్థితిపై ఉంటుంది. ఆహారోత్పత్తిలో ఏర్పడే కొరతను యిప్పుడే అంచనావేయడం సాధ్యంకాదు. అయితే రాష్ట్రంలో ఖరీఫ్ పంట ప్రధానమైనది కాబట్టి 1967–68 కన్నా యీయేడు ఉత్పత్తిచాలా తక్కువగా ఉంటుందని చెప్పవచ్చు అందువల్ల రాబీపంట కాలంలో ప్రభుత్వం, పెద్ద ఎత్తున ఎక్కువ మొత్తంలో ఆహారధాన్యాలను సేకరించి, అవసరకాలంలోవినియోగం నిమిత్తం నిల్వచేయాలి అంతేగాక కేరళ, పశ్చిమ బెంగాలు వంటి దక్షిణ, పశ్చిమ తరుగు రాష్ట్రాలకు వాగ్దానంచేసిన బియ్యం సరఫరా నిమిత్తం కేంద్రం యీ రాష్ట్రాన్ని వత్తిడిచేయకుండా కేంద్రానికి నచ్చచెప్పాలి. ఇప్పటి కప్పుడే ఊర్ధ్వముఖం పట్టిన ఆహారధరల స్థితిని జాగ్రత్తగా పరిశీలిస్తూ ఉండాలి.

అనివాయితీగా సంభవిస్తున్న యీ కరువు పరిస్థితులను ఎదుర్కోడానికి అత్యవసరంగా అవసరమైన అదనపు సహాయం సత్వరంగా అంద చేయబడుతుందని మనం ఆశించవచ్చు. పారంపర్యంగా కరువు పరిస్థితులకు నిలయమైన ప్రదేశాలలో దీర్ఘకాలిక ప్రాతిపదికపై ఉత్పత్తిదాయకమైన కార్యక్రమాన్ని చేపట్టి కరువును శాశ్వతంగా నివారించాలి. ఈ కరువు ప్రాంతాలలో తగిన నిధులను కేటాయించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమిష్టిగా సమన్వయ కృషి జరపాల్సి ఉంటుంది.

కొన్ని సంవత్సరాల క్రితం కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ, ఆహారమంత్రిత్వ శాఖ వేసిన అంచనాలననుసరించి ఆంధ్ర ప్రదేశ్ లో సాధారణంగా 59,000 చదరపుమైళ్ళలో (అందులో ఎక్కువ భాగం విస్తీర్ణం రాయలసీమ జిల్లాలలోఉంది.) కరువు పరిస్థితులు ఏర్పడుతుంటాయి. తత్ఫలితంగా 14.7 మిలియనుల ప్రజలు యీ కరువుకు గురిఅవుతున్నారు. అంటే రాష్ట్రం విస్తీర్ణం మొత్తంలో 56.5 శాతం, జనాభామొత్తంలో 41.4 శాతం వెనుకబడిన తనానికి, బడుగు పరిస్థితికి లోనవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రచురించిన "1951–68 ఆంధ్ర ప్రదేశ్‌లో ఆర్థిక అభివృద్ధి". అనే పుస్తకంలో వివరించినట్లుగా బడుగు రాష్ట్రమైన ఆంధ్ర ప్రదేశ్‌లో కొన్నిరంగాలలో తక్కువ స్థాయినుండి కృషిని ప్రారంభించాల్సి ఉన్న ఫలితంగా అభివృద్ధి విజయాలను పూర్తిగా అనుభవించడానికి ముందు అనేక యిబ్బందులను దూరంచేయాల్సి ఉంటుంది. తరుచుగా కరువుకు గురిఅయ్యే ప్రాంతాలలో అభివృద్ధి మార్గంలో వాస్తవమైన కృషిని ప్రారంభించాల్సి ఉంటుంది.

కరువు ప్రాంతాలలో తాత్కాలిక ప్రాతిపదికపై వార్షికంగా పెద్ద మొత్తాలలో నిధులను ఖర్చుచేస్తున్నప్పటికీ సంవత్సరాల తరబడి అక్కడ ఆర్థిక యిబ్బందులు కొనసాగుతూ రాష్ట్ర సగటు ఆదాయానికి అంతగా ఫలితం దక్కడం లేదు. రాష్ట్రంలో యితర ప్రాంతాలలోమాదిరిగా యిక్కడ కూడ అభివృద్ధిని సాధించడానికి అధిక మొత్తాలను వెచ్చించాల్సి ఉంటుంది.

ప్రణాళిక, ప్రణాళికేతర పథకాలద్వారా విద్యుచ్ఛక్తి సౌకర్యాల విస్తరణ, నీటి పారుదల నిమిత్తం, భూగర్భజలాల వినియోగంతో పాటు చిన్నతరహా నీటి వనరులను విస్తృత ప్రాతి



అనంతపురంలో కలెక్టర్లు, జిల్లా పరిషత్తు అధ్యక్షులు, పార్లమెంటు సభ్యులు శాసన సభ్యుల సమావేశానికి ఉపప్రధాని అధ్యక్షత వహించిన దృశ్యం.

పదికపై ఉపయోగం, విద్య, వైద్యసౌకర్యాల వంటి సాంఘిక సేవాకార్యక్రమాలను, వ్యవసాయం, వ్యవసాయ సంబంధ ప[illegible] క్రమలను పెద్ద ఎత్తున కరువు ప్రాంతాలలో అమలు జరపాలి అంతేగాక రాయలసీమ, తెలంగాణా ప్రాంతాలలోని భూములల[illegible] దుఫసలా సేద్యం పద్ధతిని విస్తృతంగా అవలంబించడానికి అపా[illegible] మైన అవకాశాలు ఉన్నాయి. కోస్తా ప్రాంతాలలో 20 శాతం యి[illegible] పద్ధతిన సేద్యం చేస్తుండగా పై ప్రాంతాలలో నీటి పారుదల కొరత కారణంగా ఒక పంట మాత్రమే వేస్తున్నారు. నీటి పారుద[illegible] సౌకర్యం కల్పించి దుఫసలా పంట వేయడాన్ని ప్రోత్సహించాలి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత

ఇటువంటి బృహత్తరమైన కార్యక్రమాన్ని అమలు జరపాల్సిందిగా దశాబ్దాల తరబడి కాకున్నా, కొన్నిసంవత్సరాల తరబడి కోరుతూ వచ్చారు. అయితే నాలుగవ ప్రణాళిక రూపు దాల్చిన యీ తరుణంలో దాని అవసరం గుర్తించబడుతున్నది. ముఖ్యమంత్రి, శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి నొక్కి చెప్పినట్లుగా, ఉపప్రధాని శ్రీ మొరార్జీదేశాయ్ అంగీకరించినట్లుగా వివిధ రాష్ట్రాలలో దుర్భిక్ష పరిస్థితి ఏర్పడిన ప్రాంతాలు, ప్రతిరాష్ట్రంలో కరువు ఏర్పడిన ప్రాంతాలు, వెనుక బడిన ప్రాంతాలలో ఆర్థిక అసమానతను తొలిగిచడానికి అవసరమైన నిధులను ప్రణాళికలో కేటాయించాలి. వెనుకబడిన ప్రాంతాలు విస్తృతంగా ఉన్న రాష్ట్రాలకు కేంద్ర సహాయం లభింపజేయడంలోను, పెట్టుబడులు, వనరుల సమీకరణలోను కొత్త పద్ధతులను అనుసరించి పథకాలను రూపొందించాలి ఈ సమస్య విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రధానమైన పాత్ర నిర్వహించాల్సివుంది. అయితే అనేక సంవత్సరాలపాటు అవిచ్ఛిన్నంగా అవసరమైన తగినన్ని నిధులను కేటాయించే అతిముఖ్యమైన బాధ్యత కేంద్రంపై ఉంటుంది.

రాయలసీమ, తెలంగాణాలలోని కొన్ని ప్రాంతాలు భౌగోళికంగా వెనుకబడి ఉండడాన్ని అందరూ అంగీకరిస్తారు. అయితే యిది పరిష్కరించ జాలని సమస్యయేమీకాదు. సాంకేతిక పరిజ్ఞాన సహాయంతో, మానవ కృషితో యీ పరిస్థితిని మెరుగు



అనంతపురం సమావేశంలో ప్రసంగిస్తున్న ఉప ప్రధాని

పరచవచ్చు. రాయలసీమ ప్రాంతంలో భూగర్భనీటి వినియోగం నిమిత్తం సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి. నీటిసరఫరా అతిక్లిష్టమైన సమస్య అయిన కారణంగా భూగర్భ జలాన్ని వెలికితీసే 'రిగ్గు' ల సేకరణకు అత్యంత ప్రాధాన్యత యివ్వాలి. అదే విధంగా యీ ప్రాంతాలలో లభించే ఖనిజ సంపదను వెలికి తీసే కార్యక్రమాన్ని అమలు జరిపి పారిశ్రామిక ప్రయోజనం నిమిత్తం వాటిని వినియోగించడానికి పథకాలను రూపొందించాలి. ఆంధ్రప్రదేశ్‌లోని కడప తదితర జిల్లాలలో అమలు జరుపుతున్న "ఆపరేషన్ హార్డ్‌రాక్" కార్యక్రమం ఫలితాలను ఎప్పటి కప్పుడు ప్రచారం చేయాలి.

ప్రణాళికలో భాగం

ఆంధ్రప్రదేశ్‌లోని కరువుప్రాంతాలు, వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధి కార్యక్రమాన్ని రాష్ట్రజాతీయ ప్రణాళికలలో భాగంగా రూపొందించాలి. ఈ సందర్భంలో రెండు సంవత్సరాల క్రితం తిరుపతిలో జరిగిన ఆంధ్రప్రదేశ్, మైసూరు, మహారాష్ట్ర మద్రాసు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో దత్తమండలాలు పరిసర ప్రాంతాలలో కరువు, బడుగు పరిస్థితులనివారణకు జరిపిన చర్చలను, రూపొందించిన పథకాలను ప్రస్తావించవచ్చు. సమిష్టిగా రూపొందించిన యీ ప్రతిపాదనలను బూజు దులిపి జాగ్రత్తగా పరిశీలించడం చాలా అవసరం. నాలుగవ పంచవర్ష ప్రణాళికా రచనలో యీ ప్రతిపాదనలను పరిశీలిస్తూ, "మూడవ ప్రణాళిక కాలంలో ముఖ్యంగా 1965లో అనావృష్టి పరిస్థితులకారణంగా తరచుగా కరువుకు గురిఅయ్యే ప్రాంతాలను గూర్చి పరిశీలించాల్సిన అవసరంఏర్పడింది, కరువుపరిస్థితుల ఫలితంగా ప్రజలు కష్టనష్టాలకు గురికావడం, సహాయక కార్యక్రమాల అమలు నిమిత్తం పెద్ద మొత్తంలో ఖర్చులతోపాటు బాధిత ప్రాంతాలలో భూమి, నీటివనరుల వినియోగంలో కూడ నష్టం వాటిల్లుతున్నదని," పేర్కొన్నారు. తత్ఫలితంగా వ్యవసాయార్థిక పరిస్థితులు, వాతావరణ పరిస్థితులకు అనువైన విధంగా అక్కడ లభించే ప్రకృతి వనరులను వినియోగించడానికి సర్వేజరిపి, పైలెట్ పథకాలను అమలుజరపడానికిగాను నాలుగవ ప్రణాళికలో రు. 40 కోట్లు కేటాయి అయితే యీ కటాయింపు కేవలం సర్వేపైలెట్ పథకాల అమలుకు మాత్రమేగాని నికరమైన కార్యక్రమాల అమలుకు కాదనే విషయాన్ని గుర్తించాలి. ప్రతిపాదిత కేటాయింపును ఎక్కువ చేయకపోయినా, కనీసం నాలుగవ ప్రణాళికకు తుదిరూపం యిచ్చిన తర్వాత కూడ కొనసాగిస్తారని ఆశించ బడుతున్నది.

కలెక్టర్ల సమావేశం

ఇటీవలి సంవత్సరాలలో ఎప్పుడూ లేనంతగా యీ సంవత్సరం అనావృష్టి పరిస్థితి విస్తృతంగా ఏర్పడిందనీ, గత కొన్ని వారాలుగా యీ పరిస్థితి మరింత అధ్వాన్నమైందనీ కొద్ది రోజుల క్రితం జరిగిన కలెక్టర్ల సమావేశంలో వెల్లడయింది. ఇటీవలివరకు 11 జిల్లాల్లోని 58 తాలూకాలలో ఋతుపవనాలు విఫలమైనప్పటికీ నైరుతి పవనాలద్వారా పరిస్థితి మెరుగవుతుందనే ఆశ ప్రబలంగా ఉండేది. ఆ ఆశ కూడ యిప్పుడు నిరాశగా మారింది. అంతేగాక రాష్ట్రంలోని 58 తాలూకాలలో 6000 గ్రామాలలో అనావృష్టి పరిస్థితులు నెలకొని ఉన్నాయన్న స్థితి మారిపోయి దాదాపు అన్ని జిల్లాలలో 115 తాలుకాలలో 17000 గ్రామాలలో అనావృష్టి పరిస్థితులు అవతరించాయి. తద్వారా 1.28 కోట్ల ప్రజలు దుస్థితికి లోనయ్యారు. రాష్ట్రం మొత్తంలో సాధారణంగా ఉండే వర్షపాతంలో 37 శాతం తగ్గుదల ఏర్పడిందని అంచనావేశారు. రాయలసీమలో 43 శాతం, తెలంగాణాలో 42 శాతం, కోస్తా జిల్లాలలో 34 శాతం వర్షపాతంలో తగ్గుదల ఏర్పడింది. గత సంవత్సరం ఆహార ధాన్యాల సేద్యం విస్తీర్ణం 75.93 లక్షల ఎకరాలు ఉండగా యీ సంవత్సరం 53.22 లక్షల ఎకరాలకు తగ్గింది. విత్తనాలు వేసిన మొత్తం విస్తీర్ణం 133.9 లక్షల ఎకరాల నుండి 90.65 లక్షల ఎకరాలకు తగ్గింది. మెట్టసేద్యం విస్తీర్ణం 35 శాతం తగ్గింది. సహాయకార్యక్రమాలకు నెల క్రితం రూ 22 కోట్లు ఖర్చు అవుతాయని అనుకున్న అంచనా, రు 47. కోట్లకు పెరిగింది. అంటే రు. 25. కోట్లు ఎక్కువ అవుతుంది. బియ్యం ఉత్పత్తిలో 62.3 శాతం, మెట్ట పంటలలో 69 శాతం తగ్గుదల ఉంటుందని అంచనా వేయబడింది. ఈ విధంగా రు 426కోట్ల నష్టంవాటిల్లుతుందని అంచనా వేయబడింది.

వాటిన్నిటి ఫలితంగా దేశం యొక్క రాష్ట్రం యొక్క వ్యవసాయ, ఆహార రంగాలలో పరిస్థితి ఆందోళన కరంగా పరిణమించింది. ప్రజలు అనావృష్టి పరిస్థితులకు తట్టుకొని వాటిని అధిగమించడానికి వీలుగా కేంద్ర ప్రభుత్వం అదునులో తగిన విధంగా సహాయం చేయాలని ముఖ్యమంత్రి, రెవిన్యూశాఖ మంత్రి కోరడం సహజమే. అనావృష్టి ఫలితంగా రాష్ట్రంలోని అనేక గ్రామాలలో మంచినీటి బావులు ఒట్టిపోయాయి. ఆవిధంగా మంచినీటి కొరత, పశుగ్రాసం కొరత ఏర్పడింది. అనావృష్టి పరిస్థితి విస్తృత ప్రాతిపదికపై ఏర్పడినప్పుడు దాని దుష్ఫలితాలు అనేక విధాలుగా ఉంటాయి.

(తరువాయి 49 వ పుటలో)

అధికాహారోత్పత్తికి కొన్ని సూచనలు

ఈనాడు మనదేశం ఎదుర్కొంటున్న సమస్యలలో ఆహార సమస్య ప్రధానమైనది. మనదేశంలో ఆహారోత్పత్తికంటె జనాభా నానాటికి విపరీతంగా పెరుగుతున్నది. 1948 నుండి 1963 వరకు సేకరించిన వివరములను బట్టి మన ఆహారోత్పత్తి 3.1 శాతము పెరుగగా జనసంఖ్య 3.36 కి పెరిగింది. మన వ్యవసాయదారులు ఎక్కువగా వర్షముపై ఆధారపడి వుండుటవలన ఆహారోత్పత్తి కూడా వర్షముల ననుసరించి వుంటుంది. ఈ పరిస్థితిలో ఆహారోత్పత్తిని పెంచుటకు ఎక్కువ భూమిని సాగులోనికి తీసుకొని వచ్చుటకాని, ప్రతి ఎకరమునకు ఎక్కువ పంట పండించుటకాని పరిష్కారమార్గములు.

ఇప్పటికే గరిష్ఠ పరిమితి భూమిని సాగులోనికి తీసుకొని వచ్చుట వలన ఇంతకంటె ఎక్కువ భూమి సాగులోనికి వచ్చే అవకాశం లేదు. అందుచేత ప్రస్తుతం సాగులోవున్న భూమిలో ప్రతి ఎకరమునకు ఉత్పత్తిని పెంచుటయే సరియైన మార్గము. ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించుటద్వారా ఇప్పటికంటె 3 నుండి 4 రెట్లు పంటను ఎక్కువగా పండించ వచ్చును ఏడాదికి రెండు పంటలకు బదులుగా మూడు పంటలను పండించుటద్వారా అధికోత్పత్తిని సాధించవచ్చునని ఇటీవలి ప్రయోగములద్వారా నిరూపించబడినది.

నీటి పారుదల వసతులు కలిగిన భూములలో ఇదివరలో కంటె అనేక రెట్లు ఎక్కువగా పండించుటకు ఈ క్రింది చర్యలను తీసుకొంటున్నారు. 1 అత్యధికమైన పంటలనిచ్చే మేలిరకపు గోధుమ, వరి, మొక్కజొన్న, జొన్న, సజ్జ విత్తనములను రైతులకు సరఫరా చేస్తున్నారు. 2. నత్రజని, భాస్వరము, పొటాష్, పోషక పదార్థములనిచ్చే రసాయనికపు ఎరువులను విరివిగా వాడుటకు రైతులకు సదుపాయములను కలుగ చేస్తు న్నారు. 3 నీటిపారుదల సదుపాయములు బాగా వున్న చోట ప్యాకేజి పథకములను అమలులో పెట్టి రైతులకు అత్యధికమైన పంటలను పండించుటకు కావలసిన సదుపాయములను కలుగజేస్తున్నారు. ఈ పథకముల ద్వారా రైతులు ఆకుమడిని ఏవిధముగా తయారుచేయాలో, విత్తనములను ఎప్పుడు ఏవిధముగా ఎంతలోతులో చల్లాలో, ఎంతెంత దూరములో ఎన్ని మొక్కలను నాటాలో, ఏ సమయములో ఏపాళ్ళలో రసాయనికపు ఎరువులను వాడాలో, కలుపు మొక్కలను ఏ విధముగా అరికట్టాలో, ఏ సమయములో ఎంత నీరు పెట్టాలో ఏ సస్య సంరక్షణ పద్ధతులను అవలంబించాలో రైతులకు వివరముగా తెలియజేస్తున్నారు.



మనదేశములో పంటలకు రసాయనికపు ఎరువులను వాడే పద్ధతి ఇటీవలనే ప్రారంభించ బడినది. తక్కిన దేశములతో పోల్చి చూసినట్లైతే మనదేశములో ప్రతి ఎకరమునకు ఉపయోగించే రసాయనికపు ఎరువులు చాలా తక్కువేనని చెప్పాలి. అంతేకాక నత్రజని, భాస్వరము, పొటాష్ ఎరువులను తగిన పాళ్ళలో వాడకుండా నత్రజనిని ఎక్కువగా మనం వాడుతున్నాము. దీనివలన నత్రజని యొక్క పూర్తి విలువను మనం పొందలేక పోతున్నాము. జపాన్‌లో ఒకపౌను నత్రజనివలన 20 కి॥ గ్రా॥ వరిపంట ఎక్కువగా పండగా మనదేశములో 10 నుండి 11 కి॥ గ్రా॥ మాత్రమే పండుతూంది. రసాయనికపు ఎరువులను వేసే సమయము, పద్ధతికూడా పంట ఎక్కువ పండుటకు తోడ్పడుతుంది. ఉదాహరణకు కాల్షియం అమోనియం నైట్రేటును దమ్ముచేయునప్పుడు వేసినప్పటికంటె ఊడ్చిన మూడు వారముల తరువాత వేసినట్లైతే ఎక్కువ పంట పండుతుంది సూపర్‌ఫాస్ఫేటును వెద జల్లుటకంటె నేలలో తగిన లోతులో వేయుటవలన ఎక్కువ లాభము వుంటుంది.

మనదేశములో రసాయనికపు ఎరువుల సరఫరా తక్కువగా వుండుటచే మనకు లభించే ఎరువులను లాభదాయకముగా ఉపయోగించుట ముఖ్యము దీనికి నేలను పరీక్షించిన తరువాత ఆ నేలకు తగిన ఎరువులను వేయుట సరియైన పద్ధతి యూరియా వంటి ఎరువులను నేలలో వేయుటవలన కంటె పంటపై చల్లుటవలన ఎక్కువ లాభము వుంటుంది. నేలను పరీక్షించిన తరువాత తగిన ఎరువులను వేయుటవలన అత్యధికమైన పంటలు పండినట్లు పరిశోధనలద్వారా నిరూపించబడింది బంగాళాదుంప, సీమవంగ, జనపనార, చెరకు మొదలైన పంటలకు నత్రజనిని సరఫరా చేయుటకు యూరియాను పంటపై చల్లుట అత్యంతలాభదాయకమని తేలింది. కొన్ని తృణధాన్యములకు కూడా యూరియాను పంటపై చల్లుటయే లాభదాయకమని నిరూపించబడింది.

గడచిన సంవత్సరములోను, ఈ సంవత్సరములోను

అనేక ప్రాంతములు వర్షాభావమునకు లోనైనవి. ఇటువంటి ప్రాంతములలో కూడా రసాయనికపు ఎరువులను ఉపయోగించ వచ్చునని పరిశోధనల ద్వారా నిరూపించ బడినది. విత్తనములను చల్లు సమయములో నేలలో తగినంత తేమ వున్నట్లైతే రసాయనికపు ఎరువులను వీటితో పాటు చల్లవచ్చును దీనివలన మొక్కల వేళ్ళు బాగుగా వ్యాపించి క్రింది పొరల నుండి తేమను గ్రహించ గలుగుతాయి. వర్షాభావమునకు లోనైన ప్రాంతములలో ఈవిధముగా లోపలి పొరలనుండి మొక్కలకు నీటిని సరఫరా చేయ వచ్చును.

వరి, గోధుమ పంటలకు నీరు చాల ముఖ్యమైనది అందుచేత తగిన వ్యవధిలో పంటకు కావలసిన నీటిని సరఫరా చేయుట చాలా ముఖ్యము నీటి సరఫరాలో ఏమాత్రము లోపము కలిగినా పంట దెబ్బతింటుంది. అదేవిధముగా నీటి ముంపువలన కూడా పంట దెబ్బతింటుంది. అందుచేత తగినంత నీరు మాత్రమే పంటకు సరఫరా అయ్యేటట్లు చూడాలి.

భూమిలోని సారమును తీసుకొనుటలో పంటతోపాటు కలుపు మొక్కలు కూడా పోటీ పడతాయి వీటిని అరికట్టుటకు శాస్త్రజ్ఞులు ఇటీవల అనేక మందులను ప్రవేశ పెట్టారు. కలుపు మొక్కలతోపాటు చీడలను, తెగుళ్ళను కూడా అరికట్టుట ముఖ్యము ఎంత మంచి పంట పండినా చీడలను, తెగుళ్ళను అరికట్టలేకపోతే అది వ్యర్థమే అవుతుంది. క్రిమి నాశక ఔషధములను వాడి చీడలను, తెగుళ్ళను అరికట్టినప్పుడు విదేశాలనుండి ఆహార ధాన్యములను దిగుమతి చేసుకోవలసిన అవసరము కూడా చాలా భాగము తగ్గిపోతుంది. *

అఖిల భారత పాల పోటీలు

పోటీ స్థలం :

1 మండపేట — తూర్పుగోదావరి జిల్లా
1968 అక్టోబరు 17, 18, 19 తేదీలలో

2. గుడ్లవల్లేరు — కృష్ణా జిల్లా
1968 నవంబరు 15, 16, 17 తేదీలలో

ఎక్కువ పాలు ఇచ్చే ఆవులకు విలువైన బహుమతులు

1.	మొదటి బహుమతి	...	రూ 2,000 లు
2.	రెండవ బహుమతి	...	రూ. 1,000 లు
3.	మూడవ బహుమతి	...	రూ. 500 లు

ఒక్కొక్క జాతి విభాగంలో పోటీలో పాల్గొనే పశువుల సంఖ్య 50 కంటె ఎక్కువగా ఉన్నట్లయితే, అదనంగా రూ. 250 లు విలువచేసే ఒక కన్సొలేషన్ బహుమతి ఇవ్వబడుతుంది. 75 కు మించి వున్నట్లయితే రెండు బహుమతులు యివ్వబడతాయి.

పాల పోటీలో చేర్చబడే పశువుల పాల దిగుబడి కనీస అర్హతలు :—

1.	ఒంగోలు జాతి ఆవులలో	...	9 కి. గ్రాములు
2.	గేదెలలో	...	16 కి గ్రాములు
3.	సంకరజాతి ఆవులలో	...	23 కి. గ్రాములు ఉండాలి.

పూర్తి వివరాలకు :—

1. ప్రభుత్వ పశువుల ఆసుపత్రి, మండపేట, తూర్పు గోదావరిజిల్లా.
2. ప్రాంతీయ సాంద్ర పశుగణాభివృద్ధి కేంద్రం, గుడ్లవల్లేరు, కృష్ణా జిల్లా.

అయిదు చిన్నరకం నీటిపారుదల పథకాల ప్రారంభం

నీటి పారుదల శాఖా మంత్రి శ్రీ శీలం సిద్దారెడ్డి విశాఖపట్నం జిల్లాలో అయిదు చిన్నరకం నీటిపారుదల పథకాలకు ఆగస్టు మొదటి వారంలో ప్రారంభోత్సవం చేశారు. ఆ పథకాలు ఇవి : తజంగి రిజర్వాయరు పథకం, కొయ్యూరు ఆనకట్ట, బంగారమ్మపేట ఆనకట్ట పథకం, తొడుకులగడ్డ రిజర్వాయరు, చిలకల మామిడిగడ్డ ఆనకట్ట.

చింతపల్లి తాలూకాలోని తజంగి రిజర్వాయరు పథకానికి రూ. 13.36 లక్షలు ఖర్చవుతుంది. మాచ్‌ఖండ్ జలవిద్యుత్ పథకం క్రింద జాలాపుట్ వద్ద నష్టపోయిన కుటుంబాలకు యిచ్చిన భూములకు నీటిపారుదల చేసే నిమిత్తం యిది ఉద్దేశించబడింది. ఈ పథకం క్రింద 725 అడుగుల పొడవున మట్టిడాము నిర్మిస్తారు. దీనివల్ల 600 ఎకరాలకు నీటిపారుదల జరుగుతుంది. తరువాత మరో వంద ఎకరాలకు ఈ సౌకర్యాలు విస్తృతీకరిస్తారు.

చింతపల్లి తాలూకాలోనే వున్న తొడుకుల గడ్డ రిజర్వాయరు పథకానికి రూ. 4.80 లక్షలు ఖర్చవుతుంది. 480 ఎకరాలకు యిది నీటిపారుదల చేస్తుంది. 1990 అడుగుల మట్టి డాముతో కూడిన ఈ రిజర్వాయరు నీటి పరిమాణ శక్తి 60 మిలియన్ల ఘనపుటడుగులు.

చింతపల్లి తాలూకాలో కొయ్యూరు సమీపంలో వున్న కొయ్యూరు ఆనకట్ట 375 ఎకరాలకు కొత్తగా నీటిపారుదల చేస్తుంది. దీని నిర్మాణ వ్యయం రూ. 1.56 లక్షలు. ప్రస్తుతపు 480 ఎకరాల విస్తీర్ణానికి దీని క్రింద నీటి సరఫరా జరుగుతుంది. 180 అడుగుల పొడవున ఆనకట్ట నిర్మించారు.

చింతపల్లి తాలూకాలోని బంగారమ్మపేట ఆనకట్ట పథకం 679 ఎకరాలకు నీటి పారుదల చేస్తుంది. రూ. 4.23 లక్షలు ఖర్చయ్యే ఈ పథకం క్రింద 207 అడుగుల పొడవున ఒక ఆనకట్ట నిర్మిస్తారు.

చిలకమామిడిగడ్డ ఆనకట్ట పాడేరు తాలూకాలోనిది. నాలుగు లక్షల రూపాయల వ్యయంతో కూడిన యిది 320 ఎకరాలకు నీటిపారుదల చేస్తుంది.

విశాఖపట్నం జిల్లాలో వారం రోజుల పాటు పర్యటించిన సందర్భంలో నీటిపారుదల శాఖా మంత్రి, నర్సీపట్నం వద్ద వున్న రావనపల్లి రిజర్వాయరునూ, అనకాపల్లి వద్ద కొడకొండ పథకాన్నీ యలమంచిలి వద్ద రంగబోలు గడ్డనూ, గాది గడ్డ రిజర్వాయరు, సుంకరపాలెం ఆనకట్ట పథకం, డెంకడ ఆనకట్ట. నడిపల్లి పంపింగ్ పథకం, తాటిపూడి రిజర్వాయరులను కూడా తనిఖీ చేశారు.

మంత్రి వివిధ ప్రదేశాలలో సభలలో ప్రసంగించిన సందర్భంలో, గిరిజన కుటుంబాల నిమిత్తం కాలనీలను నెలకొల్పడానికి సంబంధించిన పథకాన్ని ప్రభుత్వం అమలు పరచదలుస్తున్నదని తెలియజేశారు. ఈ కాలనీలలోని గిరిజనులకు రెండు ఎకరాల తరి భూమి, మూడు ఎకరాల ఖుష్కి భూమి యిస్తారనీ, కాలనీకి నీరు సరఫరా చేసేందుకు ఒక రిజర్వాయరును నిర్మిస్తారనీ, గిరిజనులకు వ్యవసాయం కొరకు ఎద్దులనూ, కాలనీలో యిండ్లు నిర్మించుకోడానికి డబ్బునూ యిస్తారని కూడా మంత్రి తెలియజేశారు.

* * * *

బొర్రమ్మగడ్డ ఆనకట్ట నిర్మాణానికి ప్రారంభోత్సవం

విశాఖపట్నం జిల్లా, సబ్బవరం పంచాయతీ సమితిలో నీటిపారుదల శాఖామంత్రి శ్రీ శీలం సిద్దారెడ్డి, ఆగస్టు 7 వ తేదీన బొర్రమ్మగడ్డ ఆనకట్ట నిర్మాణానికి శంకుస్థాపన చేస్తూ రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో త్వరలోనే దాదాపు 100 నీటిపారుదల పథకాలను అమలు జరుపనున్నట్లు వెల్లడించారు.

విశాఖపట్నం జిల్లాలోనే యీ సంవత్సరం నీటిపారుదల పథకాల నిమిత్తం రు 1,10,00,000 లు ఖర్చు చేస్తున్నారని మంత్రి అన్నారు. 22 చిన్నతరహా నీటి పారుదల పథకాల అమలు పూర్తి చేయబడింది. తద్వారా జిల్లాలో ప్రస్తుతపు 700 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడంతో పాటు కొత్తగా అదనంగా 6,800 ఎకరాల భూమికి నీటిపారుదల సౌకర్యం కల్పించబడిందని మంత్రి అన్నారు వాటికి తోడు, కరువు సహాయక పథకం క్రింద జిల్లాలో 80 నీటిపారుదల పథకాలను చేపట్టడం జరిగింది. వెనుకబడిన ప్రాంతంగా అంగీకరించబడిన యీ జిల్లాకు యిప్పటి యీ పథకాలు సరిపోవని మంత్రి అంగీకరించారు. సహాయ కార్యక్రమాల నిమిత్తం రు. 10 లక్షలు ఖర్చుచేయడం ప్రస్తుత ఆర్థిక క్లిష్టపరిస్థితులలో ప్రభుత్వానికి ఆలవిగాక పోయినప్పటికీ లక్ష, లేక రెండు లక్షల రూపాయల ఖర్చుతో కొత్త పథకాలను ప్రభుత్వం అమలు జరుపుతుందనీ ఆయన హామీ యిచ్చారు. ఎకరాకు దాదాపు రు. 200 ల ఖర్చు చొప్పున చిన్నతరహా నీటిపారుదల ప్రాజెక్టులు నిర్మించబడేవి అయితే ప్రస్తుతం ఎకరాకు రు. 1000 లు కొన్ని ప్రాంతాలలో రు 2500 లు అవసరమవుతున్నాయి. అన్ని ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టబడుతుంది. అయితే ప్రాధాన్య క్రమం మాత్రమే నిర్ణయించాల్సి ఉంది అన్నారు.

శాసనసభ్యులు శ్రీ ఎస్. ఆర్. ఎ. ఎస్. అప్పలనాయుడు, కొల్లా అప్పలనాయుడు, శ్రీ కె. అప్పడుదొర, శ్రీ సన్యాసి అప్పలనాయుడు తదితరులు సూచించిన 13 కొత్త పథకాలను గూర్చి యీ సంవత్సరం పరిశీలించి, మరుసటి సంవత్సరం నిర్మాణం పనులు చేపట్టడం జరుగుతుందని మంత్రి ప్రకటించారు.

ఈ సంవత్సరం ప్రభుత్వం నీటిపారుదల ప్రాజెక్టుల నిమిత్తం రు. 24 కోట్లు, యితర పథకాల నిమిత్తం రు. 300 కోట్లు ఖర్చు చేస్తున్నదని, అయితే రైతులు నీటిపన్ను రూపంలో దాదాపు 15 కోట్లు మాత్రమే చెల్లిస్తున్నారని మంత్రి అన్నారు.

సబ్బవరం పంచాయతీ సమితి అధ్యక్షులు, శ్రీ డి. బంగార రాజు, సమావేశానికి అధ్యక్షత వహించిన శ్రీ ఎస్.ఆర్.ఎ.ఎస్. అప్పలనాయుడు ప్రసంగిస్తూ గత 15 సంవత్సరాలుగా యీ జిల్లాలోని యీ ప్రాంతంలో ఏ పెద్ద పథకాన్నీ అమలు చేయడం జరగలేదని అన్నారు.


వాలేరు సర్కిల్ సూపరింటెండెంటు శ్రీ జి. సుబ్బారావు ఆనకట్ట వివరాలను, తెల్పుతూ యీ ఆనకట్టక్రింద 241.23 ఎకరాల ఆయకట్టకు నీటి పారుదల లభిస్తుందనీ ఇది రు.1,03,410 ల ఖర్చుతో నిర్మించబడుతుందనీ అన్నారు. అమృతపురానికి చెందిన పుచ్చవాని చెరువుకు నీరు అందించే బొర్రమ్మ గడ్డపై 200 అడుగుల ఆనకట్ట నిర్మిస్తున్నారు.

వరాహ రిజర్వాయరుకు ప్రారంభోత్సవం

ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి, విశాఖపట్నం జిల్లా నర్సీపట్నం తాలూకాలోని వరాహనదికి ప్రధాన ఉపనది అయిన సర్పానదిపై వరాహ రిజర్వాయరు ప్రాజెక్టుకు ప్రారంభోత్సవం చేశారు. ఇది రు. 73.92 లక్షల ఖర్చుతో నిర్మించబడుతున్నది.

ఈ ప్రాజెక్టుద్వారా 8000 ఎకరాలకు—5184 ఎకరాల మెట్ట భూమి, అంతగా నీటిసౌకర్యం లేని 2,816 ఎకరాల మాగాణి—నీటి పారుదల సౌకర్యం లభిస్తుంది.

ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ విశాఖపట్నం జిల్లాలో తాండవ, వరాహ ప్రాజెక్టులను చేపట్టడం జరిగిందనీ, వరాహ ప్రాజెక్టు నిర్మాణం రెండింట మూడువంతుల పని పూర్తి అయిందనీ అన్నారు, అయితే వర్షాభావం ఫలితంగా ఆశించిన స్థాయికి నీరురాని కారణంగా లాంఛనప్రాయంగా మాత్రమే ప్రారంభోత్సవం జరిగింది. ఉత్పత్తి రెండింతలుగా పెంచడానికి వీలుగా రైతులు తమ భూములపై పెట్టుబడిపెట్టి తద్వారా ప్రభుత్వ కృషికి దోహదం చేయాలని ఆయన రైతులను కోరారు.



వరాహ రిజర్వాయరుకు ఆగస్టు 2న ముఖ్యమంత్రి ప్రారంభోత్సవంచేస్తున్న దృశ్యం

ఈ ప్రారంభోత్సవానికి అధ్యక్షత వహించిన నీటిపారుదల మంత్రి శ్రీ శీలం సిద్దారెడ్డి ప్రసంగిస్తూ, ఎక్కువ భూమిని సాగులోకి తెచ్చి, తద్వారా అధికాహారోత్పత్తిని సాధించడానికి ప్రభుత్వం అనేక కొత్త ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టుతున్నదని అన్నారు.

ఆ తర్వాత చింతపల్లిలో బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ గిరిజనులు తమ ఉత్పత్తులకు సరసమైన ధరలు పొందడానికీ, వారికి అవసరమైన సరకులను అనువైన ధరలకు లభింపజేయడానికీ ప్రభుత్వం గిరిజనఅభివృద్ధి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిందని అన్నారు. ఆ విధంగా చేయనిపక్షంలో పెట్టుబడిదార్లు గిరిజనుల అమాయకతను, పేదరికాన్ని తమ స్వప్రయోజనాలకు వినియోగించుకోడాన్ని కొనసాగిస్తారన్నారు.

ఆవలి ప్రాంతాల ప్రజలు గిరిజనుల భూములను కొనుగోలు చేసినప్పటికీ అది చెల్లనేరదని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో యితరులు కొనుగోలుచేసిన 30,000 ఎకరాల గిరిజనుల భూములను తిరిగి గిరిజన ప్రజలకు వాపసు చేయడం జరిగింది. ఈ జిల్లాలో సర్వే జరిపిన తర్వాత దాదాపు 7000 ఎకరాల భూమిని గిరిజనులకు పంపిణీచేయడం జరుగుతుంది. ఈ భూములకు అవసరమైన నీటిని చిన్నతరహా నీటి ప్రాజెక్టుల ద్వారా అందజేయబడుతుంది. "పోడు" వ్యవసాయం చేయవద్దని ముఖ్యమంత్రి గిరిజనులకు విజ్ఞప్తి చేశారు. గిరిజనులు సరఫరా చేసిన వస్తువులకు యిప్పటికన్నా ఎక్కువధర చెల్లించాలని ఆయన కార్పొరేషన్‌ను కోరారు.

గిరిజన ప్రాంతాలకు నీటిపారుదల, విద్య, కమ్యూనికేషన్ సౌకర్యాలను యితోధికంగా కల్పించాలనీ, కార్పొరేషన్ డిపోలను ఎక్కువ చేయాలనీ గిరిజన శాసనసభ్యులు శ్రీ డి. కొండలరావు, శ్రీ టి. చిట్టినాయుడు ముఖ్యమంత్రికి విజ్ఞప్తిచేశారు.

ఆంధ్రప్రదేశ్ లో భూగర్భ జలాల వినియోగానికి కేంద్ర సహాయం

నాగార్జున సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు దార్ల సమావేశం, ఆగస్టు 17 న నల్గొండ జిల్లా కోదాడులో జరిగింది. కేంద్ర ఆహార, వ్యవసాయ మంత్రి శ్రీ జగ్జీవన్‌రామ్ యీ సమావేశంలో ప్రసంగిస్తూ 10,000 ట్రాక్టర్లను దిగుమతి చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం యిటీవలనే నిశ్చయించిందని అన్నారు. దేశంలో మర నాగళ్లను తయారు చేయడానికి అనేక మందికి లైసెన్సులను యివ్వడం జరిగింది. దేశంలో అవి తయారు అయ్యే వరకు మర నాగళ్ళను దిగుమతి చేసుకోవడానికి ప్రభుత్వం అనుమతి యిస్తుందని ఆయన అన్నారు.

రాష్ట్రంలో భూగర్భ నదీ జలాలను వెలికి తీసే నిమిత్తం 'రిగ్గు'లను దిగుమతి చేసుకోవడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తలపెట్టిందని కేంద్ర మంత్రి వెల్లడించారు. "రిగ్గు"లను దిగుమతి చేసుకోవడానికి విదేశ మారక ద్రవ్యాన్ని మంజూరు చేయడంతో పాటు అన్ని సదుపాయాలను కేంద్రం సమకూర్చగలదని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఆయకట్టు అభివృద్ధి నిమిత్తం భూమి తనఖా బ్యాంకులు, వ్యవసాయ రిఫైనాన్సు కార్పొరేషన్ ఋణాలు మంజూరు చేసే విధంగా కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ చూడగలదని ఆయన అన్నారు.

నాగార్జునసాగర్ నిర్మాణం నిమిత్తం యితోధిక సహాయానికై విజ్ఞప్తి

ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ముఖ్యమంత్రి, శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ప్రసంగిస్తూ, నాగార్జున సాగర్ నిమిత్తం వచ్చే ఒకటి, రెండు సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం రు. 40 నుండి 45 కోట్ల మేరకు నిధులు యిచ్చిన పక్షంలో మొదటి దశ నిర్మాణం పనిని పూర్తిచేసి సేద్యం నిమిత్తం 22 లక్షల ఎకరాలకు నీటి పారుదల సౌకర్యం కల్పించ బడుతుందని ఆయన అన్నారు. గత సంవత్సరం దాదాపు 6 లక్షల ఎకరాలకు నీరు సరఫరా చేయడం జరిగింది. ఈ సంవత్సరం ఉభయ కాలువల క్రింద 50,000 ఎకరాల చొప్పున అదనంగా లక్ష ఎకరాలకు నీరు లభింప జేయాలని ప్రతిపాదించారు. ఈ సంవత్సరం దాదాపు రు. 14 కోట్లు—ఆనకట్ట నిర్మాణానికి రు. 4.5 కోట్లు, మిగతా మొత్తం కాలువల విస్తరణ నిమిత్తం ఖర్చు చేయాలని ప్రభుత్వం ఉద్దేశించింది. వచ్చే సంవత్సరం అదనంగా దాదాపు మూడు లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటి పారుదల సౌకర్యం కల్పించ బడుతుందని ముఖ్యమంత్రి అన్నారు.

నాగార్జునసాగర్ కుడికాలువ రెగ్యులేటరుకు ప్రారంభోత్సవం

నాగార్జునసాగర్ కుడికాలువపై అద్దంకి సమీపంలో గంటవారిపాలెం వద్ద నిర్మించిన రెగ్యులేటరుకు సహకార శాఖా మంత్రి శ్రీ కె. విజయభాస్కరరెడ్డి జూలై నెలాఖరులో ప్రారంభోత్సవం చేశారు. ఈ రెగ్యులేటరుకు సంబంధించిన అద్దంకి కాలువ 1,88,876 ఎకరాలకు నీటి పారుదల సౌకర్యం కలుగ చేస్తుంది.

ప్రారంభోత్సవానికి, ఎక్సైజు, మద్యనిషేధశాఖల మంత్రి శ్రీ వి. సత్యనారాయణరావు, శాసన మండలి సభ్యుడు శ్రీ కె వెంగళరెడ్డి, జిల్లాపరిషత్తు అధ్యక్షుడు శ్రీ ఎమ్. నాగేశ్వరరావు, కలెక్టరు శ్రీ వెంకటరత్నం, శాసన సభ్యుడు శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య ప్రభృతులు హాజరయ్యారు.

శ్రీ విజయ భాస్కరరెడ్డి మాట్లాడుతూ, కేంద్రం రూ 14 కోట్ల ఋణం యివ్వడం వల్ల నాగార్జునసాగర్ డాము పనులు ముమ్మరంగా సాగుతున్నాయని తెలియజేశారు అయితే కేంద్రం ఉపేక్ష వహించకుండా వున్నట్లయితే ఈ భారీ ప్రాజెక్టు కొంతకాలం క్రిందటనే పూర్తి అయివుండేదని మంత్రి పేర్కొన్నారు.

ఈ కాలువ నీటిని ఉపయోగించుకొని అధిక విస్తీర్ణంలో సేద్యం చేసి యితోధికంగా పంటలు పండించవలసిందిగా శ్రీ విజయభాస్కరరెడ్డి, అద్దంకి, ఆ చుట్టుప్రక్కల తాలూకాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

విద్యుచ్ఛక్తి


లిఫ్ట్ యిరిగేషను కొరకు విద్యుచ్ఛక్తి సరఫరా

విద్యుదీకరణ పథకాలను చేపట్టే నిమిత్తం రాష్ట్ర విద్యుచ్ఛక్తి బోర్డుకు ఋణాలిచ్చిన రైతుల గ్రామాలకు లిఫ్టు ఇరిగేషన్ కొరకు విద్యుచ్ఛక్తి సరఫరాచేసే నిమిత్తం బోర్డు ఒక పథకాన్ని రూపొందించింది. పశ్చిమ గోదావరి జిల్లా, నల్లజర్ల పంచాయతీ సమితిలోని 12 గ్రామాలు, 5 శివారు గ్రామాల రైతులు, ఈ పథకం క్రింద బోర్డుకు రూ. 13.65 లక్షల ఋణం యిచ్చారు.

ఈ గ్రామాలలో 551 పంపు సెట్లకు విద్యుచ్ఛక్తి సరఫరా చేస్తారు. వీటివల్ల సుమారు 4500 ఎకరాలకు నీటిపారుదల జరుగుతుంది. ఫలితంగా రూ. 31 లక్షలు విలువచేసే 4500 టన్నుల ఆహార ధాన్యాలు అధికంగా ఉత్పత్తి కాగలుగుతాయి. ఈ సంవత్సరం అక్టోబరు మొదటివారం నాటికి ఈ గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేయడం జరుగవచ్చు. విద్యుచ్ఛక్తి బోర్డు ప్రారంభించిన ఈ పథకాన్ని వినియోగించుకొని ఋణాలు చెల్లించడానికి ఇప్పుడు అనేక గ్రామాల రైతులు ముందుకు వస్తున్నారు.

ఈ పథకాన్ననుసరించి రైతులు పంపుసెట్టు ఒక్కంటికి రూ. 2,500—పంపిణీ లైన్లు వేయడానికి రూ. 1,500, కనెక్షను యివ్వడానికి రూ. 1,000—ల చొప్పున ఋణం చెల్లించవలసి వుంటుంది. భూమి తనఖా బ్యాంకు, రైతులకు ఈ డబ్బును ఋణంగా యిచ్చి వ్యవసాయ రీఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి తిరిగి పొందుతుంది. ★

ఎగువ సీలేరు జలవిద్యుత్ ప్రాజెక్టు



ఎగువ సీలేరు జల విద్యుత్ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి ఆగస్టు31వతేదీన ప్రారంభోత్సవం చేసిన దృశ్యం

ఎగువ సీలేరు జలవిద్యుత్ ప్రాజెక్టు, విశాఖపట్నం జిల్లా చింతపల్లి ఏజెన్సీ ప్రాంతంలోని దట్టమైన అరణ్య ప్రదేశంలో విశాఖపట్నంనుంచి సుమారు 125 మైళ్ళదూరంలో వుంది. సీలేరు నదిపై గల నాలుగు ప్రాజెక్టులలో ఇది ఒకటి. మాచ్‌ఖండ్ జల విద్యుత్ పథకం వీటిలో మొదటిది. దీని స్థాపిత విద్యుదుత్పాదక శక్తి 114 మెగావాట్లు. 1955 వ సంవత్సరంలో దీనిని వినియోగంలోనికి తేవడం జరిగింది. రెండవది బలిమెల ఆనకట్ట. ఇది ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల సంయుక్తాధ్వర్యంలో నిర్మించ బడుతున్నది. ఎగువ సీలేరు ప్రాజెక్టులో ఎక్కువగా నీటి వినియోగానికై నీటిని నిలువచేసే నిమిత్తం ఇది ఉద్దేశించ బడింది. మూడవది ఎగువసీలేరు ప్రాజెక్టు. దీని స్థాపిత విద్యుదుత్పత్తి శక్తి 120 మెగావాట్లు. ఈ ప్రాజెక్టును రెండవ దశలో రెండు యూనిట్లనుంచి నాలుగు యూనిట్లకు విస్తరింప జేయడానికి అవకాశం వుంది. నాలుగవది దిగువ సీలేరు జల విద్యుత్ ప్రాజెక్టు. ఇది నిర్మాణంలో వుంది. కట్టకడపటి దశలో దీని స్థాపిత విద్యుదుత్పత్తి శక్తి 600 మె. వా. వుంటుంది. మొదటి దశలో, ఒక్కొక్కటి 100 మెగావాట్లు చొప్పున రెండు యూనిట్లు వుంటాయి. 1973-74 నాటికి ఇది పూర్తికావచ్చు. సీలేరుపై వుండే ఈ ప్రాజెక్టుల స్థాపిత విద్యుదుత్పాదక శక్తి సుమారు 1000 మెగావాట్లు వుంటుంది. ఆంధ్రప్రదేశ్ ఒరిస్సా రాష్ట్రాలకు వీటివల్ల ప్రయోజనం కలుగుతుంది.

ఎగువ సీలేరుకు సంబంధించిన సమగ్రమైన పథకం నివేదికను 1957 వ సంవత్సరంలో రూపొందించడం జరిగింది. కాని ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా ప్రభుత్వాలకు మధ్య ఒప్పందం కుదరడంలో ఆలస్యం జరిగింది. 1959 వ సంవత్సరంలో ఈ ఉభయ ప్రభుత్వాలు ఒడంబడిక కుదుర్చుకున్నాయి దీనిననుసరించి, రెండు రాష్ట్రాలు, సీలేరునదిలో సరఫరాకు లభించే జలాలను చెరిసగం వినియోగించుకోవచ్చు. ప్రస్తుత రూపంలో ఉన్న ప్రాజెక్టును రు. 6.08 కోట్లతో నిర్మించడానికి ప్రభుత్వం 1959 డిసెంబరులో మంజూరు చేసింది. అయితే డామ్ నిర్మాణ స్థలం విషయంలో రెండు ప్రభుత్వాలమధ్య అభిప్రాయ భేదాలు ఏర్పడిన కారణంగా నిర్మాణం పని కొనసాగలేదు. 1962 సెప్టెంబరులో అంతిమంగా ఒక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం బలిమెలలో డామ్ నిర్మిస్తారు. డామ్ నిర్మాణానికి రు. 12 కోట్లకు మించకుండా ఖర్చును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భరిస్తుంది.

ఈ ప్రాజెక్టు మొదటి దశలో 60 మె. వా. ల చొప్పున రెండు యూనిట్లు ఉంటాయి. 19000 క్యూసెక్కుల నీరు వాటికి వినియోగిస్తారు. (మాచ్‌ఖండ్ నుండి 15000 క్యూసెక్కులు, మాచ్‌ఖండ్ ఎగువ సీలేరుల మధ్యంతర క్యాచిమెంటు నుండి 4000 క్యూసెక్కులు) ఈ ప్రాజెక్టుకు చెందిన మొదటి యూనిటు 1967 అక్టోబరునుండి వాణిజ్యపరంగా పని ప్రారంభించింది. రెండవ యూనిటు 1968 మార్చి నుండి పని ప్రారంభించింది. ఈ ప్రాజెక్టు గరిష్ఠ స్థాయిలో 120 మె. వా. ఉత్పాదక శక్తితోను, 41 మె.వా. నిస్థిత శక్తితోను పనిచేస్తుంది. బలిమెల ప్రాజెక్టు పూర్తి అయినప్పుడు 2100 క్యూసెక్కుల నీరు లభిస్తుంది. నిస్థిత ఉత్పాదక శక్తి 47 మె.వా.; గరిష్ఠ ఉత్పాదక శక్తి 240 మె. వా. ఉంటుంది.

ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తికావడానికి ఆరు సంవత్సరాలు పట్టింది. 1965 లో భారత పాకిస్థాన్‌ల మధ్య ఏర్పడిన వివాదం ఫలితంగా జనరేషన్, టర్బైన్ పరికరాలను పాకిస్థాన్‌లో నిర్బంధించిన ప్రధాన కారణంగా యీ ఆలస్యం జరిగింది. రెండు సంవత్సరాల తర్వాత 1967 లో యీ పరికరాలను విడుదల చేశారు. టర్బైనులు, జనరేటర్లు, ఇన్‌డోర్ స్విచ్‌గేర్లు ట్రాన్స్‌ఫార్మర్లు, అవుటుడోర్ స్విచ్‌గేర్లను స్విట్జర్లాండునుండి దిగుమతి చేసుకోవడం జరిగింది. పెన్‌స్టాకులకు ఉపయోగించిన ఉక్కును రష్యా, అమెరికా దేశాలనుండి దిగుమతి చేసుకున్నారు. పెన్‌స్టాకు పైపులను స్థానికంగా ప్రభుత్వ పి.డబ్లు డి. వర్కుషాపులో తయారు చేశారు.

ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రు. 18.5 కోట్లు ఖర్చు అయింది. ఇది మొదట్లో అనుకున్న దానికన్నా మూడింతలు ఎక్కువ. ధరలు పెరగడం, రూపాయిమారకం విలువ తగ్గింపు, జనరేటర్ ప్లాంటు, పరికరాలు, (రు. 358 లక్షలు) పెన్‌స్టాకులు (రు. 106 లక్షలు), యితర పరికరాల (రు. 161 లక్షలు) పై ఎక్సైజ్ పన్ను అధికం కావడం, శాశ్వత ప్రాతిపదికపై రోడ్ల నిర్మాణం (రు. 67 లక్షలు) సివిల్ పన్నులు, వరదనీరు విడుదలకు అదనంగా స్పిల్‌వేల నిర్మాణం. నిర్మాణ స్థలంలో మార్పు, సిమెంటు, ఉక్కు, ఇంధనం, కూలీరేట్లు మొదలైనవి పెరిగిన ఫలితంగా నిర్మాణం ఖర్చులు పెరిగాయి. ఈ ప్రాజెక్టు మొదటిదశ నిర్మాణం పూర్తి కావడంతో ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికంగా త్వరితగతిని అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నం అవసరాలను, గ్రామీణ విద్యుచ్ఛక్తి సరఫరా, వ్యవసాయ అవసరాలకు విద్యుచ్ఛక్తి సరఫరాలను సంతృప్తికరంగా ఆదుకోవడం జరుగుతున్నది. *

మహాభారతము

తిప్పెగంటుల లక్ష్మీశాస్త్రి

20

ద్రౌపది కుంతివద్దకుపోయి నమస్కరించి అరణ్యమునకు ఏగుటకు యామె యాజ్ఞను కోరెను. ఆమె, "బిడ్డా! దుఃఖించకుము. స్త్రీ ధర్మములన్నియు నెరిగినదానవు. నీకు నేను ఉపదేశించవలసిన దేమియులేదు నీ పాతివ్రత్యముచేత కులద్వయము పవిత్ర మయ్యెను. నీ ప్రయాణము శుభముగా సాగుగాక నీ కోపముచేత ధార్తరాష్ట్రులు దగ్ధులు కాలేదు వారు అదృష్టవంతులనియే చెప్ప వలెను నీకు శీఘ్రమే మేలు కలుగును. సహదేవుడు సుకుమారుడు. అతనిని శ్రద్ధగా చూచుకొనుము" అని చెప్పెను. ద్రౌపది దుఃఖించుచు ఆమె యేకవస్త్రము రజస్సుచేత రక్తమయమై యుండగా ముక్తకేశయై వెడలిపోయెను. ఆమెను సాగనంపి యిచట దీనులై నిలబడియున్న పుత్రులను ఆలింగనము చేసికొని కుంతి వారితో నిట్లనెను :—

"దైవభక్తి గలిగి ధర్మాత్ములై యున్న మీకు విధివిపర్యము వలన నిట్టి దుఃఖము సంప్రాప్తమయ్యెను. అయ్యో! ఏ దేవుని మ్రొక్కుదును? ఉత్తమ గుణములు గలవారైనను దురదృష్టవంతురాలగు నా గర్భమునందు జనించినందువలన నిట్టి దుఃఖము మీకు కలిగినదేమో. మీరు అరణ్యములో నెట్లు నివసింతురు? ఈ దుఃఖమును చూడకుండ శతశృంగములో మరణించిన మీ తండ్రి పాండురాజే నాకన్న ధన్యుడు. ఆయన పుత్రశోక మనుభవించకుండ మరణించెను మాద్రిగూడ ధన్యురాలే. ఈ దుఃఖమననుభవించుటకే నేను బ్రతికియున్నాను కాబోలు. ఆపత్కాల బాంధవుడగు శ్రీకృష్ణుడిప్పుడు ఊరకున్నాడే. సర్వ ధర్మజ్ఞులగు భీష్మద్రోణాదులు ఉండగా కులమునకిట్టి యాపద యెట్లు సంభవించెను సహదేవా! నీవు నాకు చాల ప్రియుడవు. నన్ను విడిచి పోవకుము, రమ్ము. మీయన్నలను పోవనిమ్ము. నన్ను కాపాడుచు నావద్దనే యుండుము మాతృరక్షణముగూడ ధర్మమేకదా!" అని పరిపరివిధముల దుఃఖించుచున్న తల్లికి నమస్కరించి పాండవులు వనమునకు పోయిరి.

విదురుడు ఆమెను ఓదార్చి తనయింటికి తోడ్కొనిపోయెను ప్రజలందరు పాండవులకు జరిగిన యన్యాయమునకు మిగుల వగచిరి. ధృతరాష్ట్రుని కోడండ్రు ద్రౌపదికి జరిగిన యవమానమునకు మిగుల దుఃఖించి తమ పతులను ఈసడించుకొని చేతులతో ముఖమును కప్పికొని యేడ్చిరి. ధృతరాష్ట్రుని మనస్సునకు శాంతి లేకపోయెను అప్పుడు తనకు శాంతివచనములు చెప్పుటకు విదురుని పిలిపించెను.

వచ్చిన విదురునితో పాండవుల వనవాస గమనమును గూర్చిన విశేషములను చెప్పుమని యడిగెను. ఆమాటకు విదురుడిట్లు బదులుచెప్పెను "యుధిష్ఠిరుడు ముఖముపై బట్టకప్పుకొని నడచుచుండెను అతని వెంట భీముడు తన విశాల భుజములను చూచుకొనుచు, అర్జునుడు ఇసుకను అంతట చల్లుచు, సహదేవుడు తన ముఖముపై మన్ను పూసికొని, నకులుడు శరీరమంతట ధూళి పూసికొని ద్రౌపది తన కేశములతో ముఖమును కప్పికొని నడచుచుండిరి ధౌమ్యాచార్యులు చేతిలో దర్భలను పట్టుకొని రుద్ర యమదేవతాకములగు సామవేద మంత్రములను పఠించుచు పాండవులకు ముందు భాగములో పోవుచుండెను."

ఆ మాటలు విని ధృతరాష్ట్రుడు, "ఇట్లు వివిధములైన రూపములతో వారు పోవుచుండుటకు కారణమేమి?" యని విదురుని అడుగగా నతడిట్లు బదులు చెప్పెను :—"నీ పుత్రులు కపటముతో తమ యెడల ప్రవర్తించినప్పటికిని, ధర్మాత్ముడు కావున యుధిష్ఠిరుడు నీ పుత్రునియెడ దయతోనే మెలగుచుండెను. అట్లున్నను, నీ పుత్రులు కపటద్యూతముతో వారి రాజ్యమును అపహరించినందుచేత మిక్కిలి కోపము గలవాడై యుధిష్ఠిరుడు తాను భయంకరమగు దృష్టితో చూచినయెడల ఒకవేళ నిరపరాధులు గూడ భస్మము కావచ్చునని కన్నులు మూసికొని ముఖమును బట్టతో కప్పికొనెను.

"ధృతరాష్ట్ర మహారాజా! భీముడు, బాహుబలములో తనకు సమానుడు లేడని అభిమానపడుచుండెను గనుక అతడు తన విశాల భుజములవైపు చూచుకొనుచు తన బాహుబలమునకు తగిన కర్మనే భవిష్యత్తులో తాను చేయదలచినట్లు సూచించెను."

"రాజా! అర్జునుడు, ఇసుకను చల్లుచు, అది ఏ విధముగ ఒక కణముతో మరియొక కణమునకు సంబంధము లేకుండ క్రింద పడుచుండెనో ఆ విధముగనే తాను బాణవర్షమునుగూడ శత్రువులపై కురిపించెదనని సూచించుచు ఇసుకను చల్లుచుండెను.

"సహదేవుడు, 'ఇట్టి దురవస్థలో ఎవరును తన ముఖమును గుర్తుపట్టకుందురుగాక' అని తన ముఖముపైన మన్ను పూసుకొని యుండెను.

"రాజా ! నకులుడు, తాను మార్గములో నడుచునప్పుడు తన సౌందర్యముచేత పౌరస్త్రీల మనస్సును దొంగిలించకుందునుగాక యను నుద్దేశముతో ఒంటి నిండ దుమ్ము పూసికొని వికృత రూపముతో నుండెను.

"ప్రభూ ! దీనురాలైన ద్రౌపది ఏకవస్త్రను ధరించి, కేశములను విరియబోసికొని, రజస్వలయై, రజస్సు ఎఱ్ఱగా చీరకు అంటియుండగా ఏడ్చుచు, 'తనవలెనే శత్రువుల భార్యలుగూడ యుద్ధములో మరణించిన తమపతులపైన పడియేడ్చుచు ముక్తకేశలై పతులశరీర రక్తము తమవస్త్రములకు అంటియుండగా తిలతర్పణము చేయుచుందురుగాక' యని చెప్పుచున్నట్లు పతులవెంట నడచుచుండెను.

"ధౌమ్యాచార్యులు, 'తనవలెనే శత్రువుల పురోహితులు శత్రువులు మరణించిన తరువాత యమదేవతాకములగు సామవేదమంత్రములను పఠించుచు తమచేతిలోని దర్భలను నైరుతి దిక్కునకు చూపుచు పోవుదురుగాక' యనిచెప్పుచున్నట్లు ముందు నడచుచుండెను."

"పౌరులందరు 'మాకు ఆప్తులు, ధర్మాత్ములునైన పాండవులను అన్యాయముగ వెడలగొట్టుచున్నారే' యని గొల్లుగొల్లున నేడ్చుచు వెంటపోవుచున్నారు.

"మహారాజా! కుంతీ పుత్రులు నగరమును విడిచి అడవికి పోవుచున్నప్పుడు, మేఘములు లేకయే పిడుగులు పడజొచ్చెను. భూమి కంపించసాగెను. అమావాస్యలేకుండగనే రాహువు సూర్యుని మ్రింగజొచ్చెను. ఆ పట్టణమునకు కుడిభాగమునందు తోకచుక్కలు రాలెను. నక్కలు, గ్రద్దలు, కాకులు మాంసమును, ఎముకలను దేవాలయములయందు పడవేసెను. భరతవంశీయుల వినాశమును సూచించునట్టి యిట్టివేయగు నపశకునములెన్నియో కలిగెను."

పై విధముగ విదురుడు చెప్పుచుండగనే ఆ సభామధ్యమునందు విదురధృతరాష్ట్రులయెదుట నారదుడు ఋషిగణములతో వచ్చినిలిచి "నేటికి పదునాల్గవ సంవత్సరమున సమస్త కౌరవులు దుర్యోధనుని యపరాధము మూలముగా భీమార్జునులచేత చంపబడుదురు." అని చెప్పియాదేవర్షియంతర్ధానము చెందెను. అప్పుడు, "లక్ష్మణునితో రాముడు అడవికిపోయినప్పుడు అయోధ్యావాసులు దుఃఖించినట్లుగా హస్తిపురజనులుగూడ దుఃఖించిరి." అని విదురుడు ధృతరాష్ట్రునితోచెప్పి మరియు నిట్లనెను:—

"తరువాత కర్ణశకుని దుర్యోధనులు ద్రోణాచార్యులను ఆశ్రయించి 'మీరే దిక్కు' అని అతని చరణములపైన రాజ్యమును సమర్పించిరి. అప్పుడు ద్రోణుడు, ఇట్లనెను:—

"పాండవులు దేవతల పుత్రులు. అందుచేత వారు చంపదగిన వారు కారని బ్రాహ్మణులు చెప్పెదరు. ఐనను, నేను నా శక్తికొలది మీకు యుద్ధములో సహాయము సంపూర్ణముగా చేసెదను. అన్నిటికిని దైవము బలీయముగనుక దైవేచ్ఛ ప్రకారమే జరుగును. పాండవులు అరణ్యములో పన్నెండేండ్లు బ్రహ్మచర్యవ్రతమును పాలించుచు మహాశక్తి సంపన్నులై తిరిగివచ్చి తమ పగతీర్చుకొనుటకు శత్రువులపైన పడినపుడు వారిని ఎదిరించుట మిక్కిలి అసాధ్యమగును.

"ఇంతయేకాక, పూర్వము నేను చేసిన అవమానమును భరించలేక ద్రుపదుడు నన్నుచంపు కొడుకును యజ్ఞముచేసి కనెను. అతడే ధృష్టద్యుమ్నుడు అతడు దేవతా వరప్రసాదముచేత సహజములైన ధనుర్బాణములతోను, కవచముతోను పుట్టెను. అతడు దేవత. నేను మర్త్యుడను. కనుక అతనివలన నాకు ప్రాణభయము ఉన్నది. అతనికి నాతో యుద్ధము జరుగుచున్నప్పుడు అతనికొరకు ప్రాణములనుగూడ విడుచుటకు సంసిద్ధుడుగానున్న అర్జునుడు అతనికి సహాయముగా వచ్చినచో అంతకన్నకష్టము మరియొకటి నాకు ఉండదు 'ధృష్టద్యుమ్నుడు ద్రోణునకు మృత్యుస్వరూపుడు' అను వార్తలోకములో వ్యాపించెను. 'నా వధ కొరకే అతడు జన్మించెను. అనికూడ అందరు వినియున్నారు. అతడును మహావీరుడే

"కనుక దుర్యోధనా! 'పాండవులను వనమునకు పంపితిని కదా' యని సంతోషించకుము. అంతటితో నీ యభీష్టము సిద్ధించలేదు. తొందరగా నీ మేలును నీవు చూచుకొనుము. ఈ రాజ్యము మీకు 'శీతకాలములో తాటి చెట్టు నీడవంటిది అది క్షణ మాత్రమే సుఖము నీయగలదు అని తలచుడు. ఇక ఇప్పుడు మీరు పెద్ద పెద్ద యజ్ఞములను చేయుడు. ఇచ్ఛకొలది సుఖములను, భోగములను అనుభవించుడు, ఇష్టము వచ్చిన దానములను చేయుడు. నేటికి పదునాల్గవ సంవత్సరమున మీరు పెద్ద సంకటావస్థను అనుభవించవలసి యుండును."

అని యిట్లు ద్రోణుడు దుర్యోధనాదులతో చెప్పిన ఉపదేశవాక్యమును విదురుడు ధృతరాష్ట్రునకు చెప్పగా నతడిట్లనెను:— "విదురా! ద్రోణాచార్యులు సత్యమునే చెప్పెను. కనుక నీవు వెంటనేపోయి పాండు పుత్రులను తిరిగి నగరమునకు తోడ్కొని రమ్ము. ఒక వేళ వారు రానియెడల, వారికి అస్త్రశస్త్రములు, రథములు, పదాతి సైన్యము వెంటపంపుము. సకలభోగసామగ్రిని వారికి ఇచ్చి సత్కార పూర్వకముగా వారిని అడవికి పంపుము. వారు అడవిలో సుఖముగా ఏ బాధయు లేక తిరుగు చుందురుగాక. వారు గూడ నాకొడుకులేకదా" అని ధృతరాష్ట్రుడు విదురునితో చెప్పెను.

పాండవులు అడవికి పోయిన తరువాత ధృతరాష్ట్రుడు మిక్కిలి చింతించుచు కూర్చుని యున్నపుడు సంజయుడువచ్చి, 'రాజా ! ఏల చింతిల్లుచున్నావు ?' అని యడిగెను. సంజయా ! బలవంతులు, యుద్ధనిపుణులైన పాండవులతో వైరము కలిగిన తరువాత దుఃఖించకుండ ఎట్లుండగలను ?' అని ధృతరాష్ట్రుడనెను. ఆ మాటకు సంజయుడిట్లు బదులు పలికెను :—

"రాజా ! మీరు స్వయముగా చేతులార చేసికొన్న వైరమిది. దీని కారణముగా సమస్త జగత్తుకు వినాశము కలుగనున్నది.


మూర్ఖుడైన దుర్యోధనుడు, భీష్మద్రోణాదులు పలుమారు వారించినను వినక, ద్రౌపదిని సభలోనికి లాగించెను. దేవతలకే వ్యతిరేకుడైన వాని బుద్ధి నశించును. అట్టివానికి అన్నియు విపరీతముగా కనపడును. అన్యాయము న్యాయముగా తోచును. 'వినాశకాలే విపరీత బుద్ధి' యని కదా పెద్దలు చెప్పిరి. వానికి సత్యము అసత్యముగా తోచును. యముడు దండమునుగాని, ఖడ్గమునుగాని తీసికొని మనుజుని శిరస్సు ప్రత్యక్షముగా ఖండించడు. అతడు మానవునకు వినాశకాలమునందు విపరీతబుద్ధిని కలిగించును.

"మహారాజా ! ధర్మస్వరూపురాలు అయోనిజయునైన ద్రౌపది యేక వస్త్ర రజస్వలయై యుండగా ఎంత దురాత్ముడైనను నిండు సభలోనికి ఈడ్పించునా ? ఆమె కురువంశపు రాణియని కూడ నీకొడుకు తలంచలేదే ! పతులు పరాధీనులై యుండగా ఆ పతివ్రతను వారియెదుట అవమానపరచిన పాపము ఊరక పోవదు. కర్ణ దుర్యోధనులు కఠిన వచనములుకూడ పలికిరి. ఆ మాటలన్నియు విని, రాజా నాకు మిక్కిలి వ్యాకులత్వము కలుగుచున్నది" సంజయుని మాటలువిని ధృతరాష్ట్రుడిట్లనెను:-

"సంజయా ! అప్పుడు ద్రౌపదియొక్క దీనమైన దృష్టిపాతముచేత సమస్త భూమి దహించి యుండును. ఆమె శాపముచేత నా పుత్రులందరు నశించియుందురు, కాని ఆమెసహనమే నేడు వారిని కాపాడినది. అప్పటి ఆమె దురవస్థను చూచి గాంధారి మొదలగు భరతవంశ స్త్రీలందరు మిక్కిలి విలపించిరి. ద్రౌపదీ వస్త్రాపహరణమైన దినమున ఊరి బ్రాహ్మణులందరు మిక్కిలి కోపించి నాటి సాయంకాలము మా యింట అగ్నిహోత్రము చేయుటకు గాను వచ్చుటకు గూడ నిరాకరించిరి. ఆ నాడు గొప్ప అంధకారము వ్యాపించి పిడుగులు పడినట్లు ధ్వని కలిగెను. ప్రజలు చాల భయపడిరి. మా రథశాల దగ్ధమయ్యెను. అది అమంగళ సూచకముకదా ! దుర్యోధనుని అగ్నిహోత్రశాలలో నక్కలు కూసెను. అదిచూచి భీష్మాదులగు పెద్దలు సభవిడిచి పోయిరి. అప్పుడు ద్రౌపదిని శాంతింపజేయుటకు నేను ఆమెను పిలిచి ఆమె కోరిన వరములను యిచ్చితిని కదా !"

అప్పుడు విదురుడు ముందుకువచ్చి 'ఈ ద్రౌపది కారణముగా సమస్త కురువంశము నశించగలదు. మహా యుద్ధములో భీమార్జునులను ఎదిరించగలవారు మనలో నెవ్వరును లేరు. అందువలన పాండవులతో శాంతిపూర్వకమైన సంధిచేసికొనుటయే మేలని నా యభిప్రాయము. వీరికన్న వారు బలవంతులని నా నిశ్చయము. కనుక రాజా ! నీవు నిస్సందేహముగా వారితో సంధిచేసికొనుము. ఇది రెండు పక్షములకు క్షేమము. దీనివలన నీకు కల్యాణము కలుగును' అని చెప్పెను. ఇంతగా విదురుడు ధర్మార్థయుక్తములైన మాటలు చెప్పినను, "సంజయా నేను పుత్రుల హితమును కోరినవాడనైనను విదురుని మాటలు పెడచెవినిబెట్టితిని. ఇప్పుడు ఏమిచేయుటకును తోచకున్నది" అని మిక్కిలి విచారించుచు ధృతరాష్ట్రుడు సంజయునితో చెప్పెను.

సభాపర్వము సమాప్తము



*

అరణ్య పర్వము

పాండవుల వనవాసము

తరువాతి కథనుగూర్చి జనమేజయ మహారాజు వైశంపాయనమునిని ఇట్లు ప్రశ్నించుచున్నాడు — "మహాత్మా! దురాత్ములగు దుర్యోధనాదులచేత కపటద్యూతమునందు పరాజితులై కోపించిన నా తాతలగు యుధిష్ఠిరాదులు ఆ తరువాత ఏమి చేసిరి? అంతటి యింద్రవైభవమునుండి భ్రష్టులై కారడవులలో నెట్లు విహరించగలిగిరి? వారివెంట ఎవరెవరు పోయిరి? వారి వసతి, ఆహారము అడవిలో ఎట్లు ఏర్పడెను? సుకుమారియైన ద్రౌపది పన్నెండు సుదీర్ఘ సంవత్సరముల కాలము వారితో ఆ భయంకరాటవిలో నెట్లు గడపజాలెను? దయచేసి వివరించి చెప్పుడు" అని ప్రశ్నించెను.

ఆ ముని యిట్లు బదులుచెప్పెను:—

పాండవులు భార్యతో పురమునువీడి వనమునకు బయలుదేరునప్పుడు వారికి ఆప్తులై యింద్రసేనాదులు తమ స్త్రీలతో వారిననుసరించిరి. అప్పుడు వారికి గలిగిన ఆ అన్యాయమును చూచి సహించజాలక పురజనులు భీష్మ, ద్రోణ, విదుర, కృపాచార్యాదులను మాటిమాటికి నిందించుచు నిర్భయముగా విట్లనిరి — "శకుని దుర్మంత్రములకు లోనైన దుష్టదుర్యోధనుని పాలనలో మన కులములకు, గృహములకు క్షేమములేదు. ఇతడు కర్ణ దుశ్శాసనులచేత రాజ్యమును పాలింపజేయదలచుట మిక్కిలి ఘోరము ఇక మన కులములు, ఆచారములు, ధర్మములు, అర్థములు అన్నియు ఈ పాపిష్ఠుని పాలనలో నశించును. ఇక మనకు సుఖమెక్కడిది? దుర్యోధనుడు గురుద్వేషి, సత్ప్రవర్తనను, మిత్రవాక్యములను నిరాకరించినవాడు, రాజ్యలోభము గలవాడు, దురభిమాని, నీచుడు, నిర్దయుడు ఇట్టివాని రక్షణములోనున్న ఈ భూమి నిలువజాలదు. కనుక మనము పాండవుల వెంటనే అడవికి పోవుదము. వారు ధర్మాత్ములు, దయాదాక్షిణ్యములుగల మహాత్ములు," అని చెప్పి వారి వెనుకనే పోయి వారితో నిట్లనిరి:—

"మహాత్ములారా! సత్పురుషులైన మిమ్ము అన్యాయమార్గములో ఓడించి దురాత్ములైన దుర్యోధనాదులు అడవులపాలు చేసిరి. ఇట్టి మిమ్ము చూచి మేమందరము చాలా దుఃఖించుచున్నాము. మిమ్మువీడి మేము తిరిగి హస్తిపురికి పోజాలము. మీరు లేకుండ మేము అచట ఉండజాలము. దుష్టుల సంబంధము చేత మాకు గూడ దోషములు అంటగలవు. సజ్జనులతో కలిసి యుండుటచేత మాకు శుభములు గలుగును. పూవుల సంసర్గము చేత వస్త్రములకు, జలమునకు, భూమి మొదలగు వస్తువులకు సుగంధము సంక్రమించునట్లు మీవంటి సత్పురుషుల సహవాసము చేత మాకు ధర్మము సంక్రమించగలదు. కనుక మానవులు సర్వదా ప్రాజ్ఞులు, వృద్ధులు, సుస్వభావులు, మహర్షులు, విద్వాంసులు మొదలైనవారి సంసర్గములోనే మెలగవలెను. దానివలన మనస్సునకు శాంతిసౌఖ్యములు కలుగును. విద్య, జాతి, కర్మము ఈ మూడును ఉజ్జ్వలములై యుండునట్టివారి సాంగత్యములోనే ఉండవలెను అట్టి వారితో మెలగుటవలన శాస్త్రములను అభ్యసించుటకంటె ఎక్కువ అనుభవము, ధర్మజ్ఞానము కలుగును. మేము సత్కర్మలను అనుష్ఠించువారముకాము. కనుక మీవంటి వారి సాంగత్యముచేత పుణ్యము సంపాదించగలుగుదుము. పాపుల సంగతిలో నుండినచో పాపము మాకు అంటగలదు. దుష్టుల సాంగత్యమువలన చేసిన పుణ్యకార్యములుగూడ నశించును. నీచసంగతి వలన బుద్ధి నశించును, మధ్యముల సంగతిచేత అది సగముజ్ఞానము గలదగును. ఉత్తమపురుషుల సంసర్గమువలన బుద్ధి క్రమక్రమముగా శ్రేష్ఠమగును పుణ్యపురుషులు తెలిపిన ధర్మార్థకామములు లోకములో ఆచరణీయములై ప్రజలకు సన్మార్గదర్శకములు కాగలవు. అట్టి ధర్మాదులను ఆచరించుటను శిష్టపురుషులు ఆదరింతురు కనుక మహాపురుషులారా! మీయందు సమస్త సద్గుణములు రాశీభూతములై యున్నవిగనుక మేము మీ వెంటనే అడవికిపోయి మీతో నివసించెదము."

వారిమాటలు విని యుధిష్ఠిరుడిట్లనెను:— "మీరు ప్రేమచే మాయందులేని గుణములనుగూడ చెప్పి మమ్ము ప్రశంసించుచున్నారు, మా కోరికను నెరవేర్చుడు. మీరు తిరిగి పట్టణమునకు పొండు భీష్మద్రోణాదుల క్షేమము, మాతల్లి కుంతీదేవి క్షేమము అరయుచుండుడు. వారిని న్యాసముగా మీరక్షణములో నుంచినాము.

వారిని కొలుచుటయే మాకు మీరు హితము చేసినట్లు తలచెదము. అదియే మాకు మీరుచేయు సత్కారము కనుక మీరు తిరిగిపొండు" అని చెప్పగా పౌరులు చేయునదిలేక పాండవుల గుణములను స్మరించుకొనుచు తిరిగిపోయిరి

పురజనులు తిరిగిపోయిన తరువాత పాండవులు రథములపై వెడలి గంగా తీరమునందలి 'ప్రమాణము' అను పేరుగల వట వృక్షమునుచేరి ఆ రాత్రి అక్కడ గడిపిరి. మరునాడు ఉదయమే తిరిగి వారు బయలుదేరగా వారి వెంట వచ్చిన బ్రాహ్మణులు కొందరు వారితోనే అడవిలో నుండుటకు బయలుదేరిరి అప్పుడు ధర్మరాజు వారిని వారించెను వారును విడువక పాండవులనే అనుసరించిరి. ధర్మరాజు అప్పుడు, "మీరు మా వెంట అడవులలో కష్టపడుచు మీ అన్నమును మీరు సంపాదించుకొని తినుచును డుటను నేను సహించజాలను ఈ పాపము నాకు ఒడిగట్టకుడు. నేను ధనహీనుడను, మీకు సహాయము చేయజాలను. తిరిగి పొండు" అనివేడుకొనెను. అప్పుడు వారిలో శౌనకుడు అను జ్ఞానియగు నొక బ్రాహ్మణుడు యుధిష్ఠిరునితో నిట్లనెను

"శోకమునకు భయమునకు అనేక కారణములు వున్నవి అవి ప్రతి దినము అజ్ఞానులను ఆవరించుచుండును కాని వాటి ప్రభావము జ్ఞానులపై పడదు దుష్టములైన అశుభ కర్మలలో మీవంటి జ్ఞానవంతులు చిక్కుకొనరు యమనియమాదులైన అష్టాంగ యోగములు కలిగి, అన్ని అశుభములను పోగొట్టి, శ్రుతిస్మృతుల విజ్ఞానముచే పరిపూర్ణమైన బుద్ధి మీకు గలదు. ఆర్థికము దుస్థిరములైన సంకటములు కలిగినప్పుడు మీవంటి జ్ఞానులు బాధపడరు. పూర్వము జనకమహారాజు అంతఃకరణమును స్థిరముగా నుంచుకొనుటకు కొన్ని నీతి వాక్యములను చెప్పెను. వాటిని చెప్పెదను వినుడు" అని శౌనకుడు యుధిష్ఠిరునకు జనక గీతలు చెప్పెను:—

"సమస్త ప్రపంచము శారీరక మానసిక దుఃఖములతో బాధపడుచుండును. అట్టి దుఃఖముల నివారణకు ఉపాయము చెప్పెదను వినుడు. రోగములు, అప్రియములు, అధిక పరిశ్రమ, ఇష్ట వస్తునాశము — ఈనాలుగు కారణములవలన శారీరక దుఃఖము కలుగును అప్పుడు పైనాలుగు కారణములకు ప్రతీకారముచేయుచు వానిని గూర్చి ఎప్పుడును చింతించగూడదు ఈరెండు ఉపాయములవలన శారీరక మానసిక రోగములు రెండును శమించును కనుక బుద్ధిమంతుడు ఎల్లప్పుడు ప్రియవచనములను పలుకుచు హితములైన భోగములను అనుభవింపజేయును. తొలుత మనుష్యులకు కలిగిన మానసిక దుఃఖములను తొలగించ వలెను. ఎందుకనగా మనస్సులో దుఃఖము కలిగినప్పుడు శరీరము గూడ తపించును ఎట్లనగా, ఇనుప కడవ తపింప జేసినప్పుడు అ దులోని నీరు గూడ వేడిదగును కదా! కనుక జలముచేత అగ్నిని ఆర్పినట్లుగా జ్ఞానము చేత మానసిక దుఃఖమును శమింపజేయవలెను మనో దుఃఖము నశించిన వెంటనే శారీరక దుఃఖముగూడ దూరమగును. మనో దుఃఖమునకు మూలకారణము సంసారమునందు మిక్కిలి ఆసక్తి కలిగి యుండుటయే ఇట్టి స్నేహము వలననే జీవుడు దుఃఖమును పొందుచున్నాడు కనుక దుఃఖమునకు మూలకారణము స్నేహము. దానివలన భయము కలుగును. శోక, హర్ష, క్లేశాదులు కూడ సంసారాసక్తి వలననే కలుగును. ప్రాపంచిక విషయములందు చింతనము, అనురాగముకూడ స్నేహము వలననే కలుగును. ఈ రెండును మిక్కిలి చెడువి. వీటిలో విషయ చింతనము మిక్కిలి అనర్థమును కలిగించును చెట్టుతొర్రలో అంటుకొన్న అగ్ని వృక్షమును సమూలముగా దహించి భస్మము చేసినట్లుగా విషయములందు కలిగిన కొద్ది ఆసక్తి గూడ ధర్మార్థముల రెంటిని కూడ నశింపజేయును. విషయములు లభించక పోవుటచేత ఏర్పడిన త్యాగము త్యాగ కాదు అవి పూర్తిగా లభించినపుడు అవి దుష్టములను భావముచే వాటిని విడిచినవాడే వాస్తవముగా త్యాగి యగును. అట్టివానికే వైరాగ్యము కలుగును వానికి ఎవరిపైనను వైరము ఉండదు సంసారబంధమునుండి వాడే విముక్తుడు కాగలడు. కనుక మిత్రులు, ధన సంపద లభించినప్పుడు వాని యెడల స్నేహము ఉంచకూడదు స్వాభావికముగా కలుగు అట్టి స్నేహము జ్ఞానముచేత తొలగించవలెను జ్ఞాని, యోగి, శాస్త్రజ్ఞుడు, మనస్సును తన వశమునందుంచుకొనినవాడు మొదలగు వారలపై స్నేహ ప్రభావము, కమల పత్రముపైన జలబిందువు నిలువజాలనట్లు ఉండదు రాగము కలవానికి కామము కలుగును. వెంటనే కామ భోగేచ్ఛ ఏర్పడును పిదప ఆశ పెంపొందును అన్నిటికన్న పాప ప్రవృత్తిని కలిగించునది తృష్ణయే అది మనస్సునకు క్షణక్షణము ఉబలాట కలిగించుచుండును. ఆశవలన మానవుడు తరచుగా అధర్మమునే చేయును. ఆ భయంకరమైన పాపమునందు బంధించును దుర్బుద్ధి కలవారు ఆశను విడువజాలరు. శరీరము జీర్ణించినను ఆ జీర్ణముకాదు అది ప్రాణ నాశకరమైన రోగము దానిని వదలిన నాడే సుఖమును పొందగలడు. అది మన శరీరములో నుండినను అనాది, అనంతము అగ్నివలె ప్రాణులను నశింపచేయును. కొయ్యలో పుటిన అగ్నిచేత కొయ్య దహింప బడునట్లే శరీరమునందు పుట్టిన ఆశ శరీరమునే దహించును ప్రాణులకందరికిని మృత్యుభయ ముండునట్లే ధనవంతులకు, రాజువలన, జలము వలన, చోరుల వలన, అగ్ని వలన, బంధు జనము వలన ఎల్లప్పటికిని భయము ఉండును" అని చెప్పెను.

(సశేషము.)

★

వెనుకబడిన తరగతుల సంక్షేమం

1961వ సంవత్సరంలో సేకరించిన జనాభా లెక్కల ననుసరించి ఆంధ్రప్రదేశ్‌లో నిమ్న జాతులవారు 49.75 లక్షల మంది వున్నారు. అంటే రాష్ట్ర జనాభాలో 14 శాతం నిమ్న జాతులవారు. సాంఘికంగా వీరు జనాభాలో దిగువ శ్రేణికి చెందినవారు ఆర్థికంగా చాలా బీదవారు. కాయకష్టం చేసుకొని జీవిస్తారు. గ్రామాలనుంచి దూరంగా అపరిశుభ్రమైన పరిసరాలలో జీర్ణావస్థలలోవున్న కుటీరాలలో నివసిస్తారు. వారి స్థితిగతులను మెరుగుపరిచి వారిని సమాజంలోని ఇతర వర్గాలస్థాయికి చేర్చడానికి ప్రభుత్వం వివిధ చర్యలు తీసుకుంటున్నది.

విద్యా సౌకర్యాలు

సాంఘికమైన పరివర్తన రావడానికి విద్యకుగల విశేష ప్రాముఖ్యాన్ని గుర్తించి ప్రభుత్వం హరిజన పిల్లలలో విద్యావ్యాప్తిపట్ల ప్రత్యేకశ్రద్ధ వహించి ఇందు నిమిత్తం వార్షిక బడ్జెట్లలో అధిక మొత్తాలు వెచ్చిస్తున్నది. హరిజన విద్యార్థులకు అన్ని స్థాయిలలోనూ విద్యాసౌకర్యాలు ఉచితంగా కల్పించబడుతున్నాయి ఇంతేగాక సాంఘిక సంక్షేమశాఖ, వారికి ఉపకార వేతనాలను కూడా మంజూరు చేస్తున్నది.

1967_68వ సంవత్సరంలో 55,786 మంది హరిజన విద్యార్థులు సాంఘిక సంక్షేమ శాఖ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉపకార వేతనాలు పొందారు. వీటిమీద రూ. 43,96,000ల ఖర్చు జరిగింది. పాఠశాలకు వెళ్ళే ప్రతి హరిజన విద్యార్థికీ ఉపకారవేతనాలతో పాటుగా అవసరమైన సందర్భంలో భోజన, వసతి సౌకర్యాలు లభించేటట్లు చూడడమే ప్రభుత్వం ధ్యేయం.

మెట్రిక్ తరువాత కోర్సులు చదివే నిమ్నజాతుల విద్యార్థులందరూ రాష్ట్ర ప్రభుత్వం మంజూరుచేసే ఉపకార వేతనాలతో పాటుగా కేంద్రప్రభుత్వం మంజూరుచేసే ఉపకారవేతనాలు పొందడానికి కూడా అర్హత కలిగివుంటారు. రాష్ట్రంలోనూ, రాష్ట్రం వెలుపలనూగల వివిధ కళాశాలలలో విద్యాభ్యాసంచేసే నిమ్నజాతుల విద్యార్థులకు 1967_68వ సంవత్సరంలో భారత ప్రభుత్వం 5,667 ఉపకారవేతనాలు మంజూరు చేసింది. 563 మంది వైద్య విద్యార్థులూ, 584 మంది ఇంజనీరింగ్ డిగ్రీకోర్సు విద్యార్థులూ, 415 మంది పాలిటెక్నిక్ విద్యార్థులూ వీటిని పొందారు. వీటి మీద రూ. 30.48 లక్షలు ఖర్చు జరిగింది.

భోజన, వసతి సౌకర్యాలు

హరిజన విద్యార్థులకొరకు ప్రభుత్వ వసతి గృహాలు 288 వున్నాయి. సబ్సిడీపొందే వసతి గృహాలు 799 వున్నాయి. వీటిలో కళాశాల విద్యార్థులకొరకు ఉద్దేశింపబడినవి 12. ప్రైవేటు వసతి గృహాలకు సంవత్సరానికి ఒక్కొక్క విద్యార్థికి రూ. 200ల చొ॥న సబ్సిడీ ఇస్తారు. సుమారు 32,000 మంది నిమ్నజాతుల విద్యార్థులకు బోర్డింగ్ గ్రాంటులు మంజూరు చేయడం జరిగింది. ఇందుకు రూ. 65 లక్షల ఖర్చు జరిగింది. ఇదే విధంగా 288 ప్రభుత్వ వసతి గృహాలలో 15,400 మంది హరిజన బాలికలకు సౌకర్యాలు కల్పించేందుకు రూ. 40 లక్షల మొత్తం ఖర్చు పెట్టబడింది.

హరిజన బాలల కొరకు 536 ప్రాథమిక పాఠశాలలున్నాయి. కుల విచక్షణవల్ల హరిజన బాలలకు సాధారణ పాఠశాలలలో సులభంగా ప్రవేశం లభించకుండా వున్న కాలంలో ఈ ప్రత్యేక పాఠశాలలను ప్రారంభించడం జరిగింది. ఇప్పుడు సాధారణ పాఠశాలలన్నింటిలోనూ హరిజన బాలలను చేర్చుకుంటున్నారు. పాఠశాలలలోనూ, కళాశాలలలోనూ హరిజన విద్యార్థుల కొరకు కొంత శాతములో సీట్లు కేటాయింపు కూడా జరుగుతున్నది. హరిజనుల కొరకు ఉద్దేశింపబడిన ప్రత్యేక పాఠశాలలు ఇప్పుడు పంచాయతీ సమితులకు అప్పగించబడినవి. ఇవి మారుమూల గ్రామాలలో హరిజన విద్యార్థులకు ప్రత్యేకంగా ఉపయోగపడతాయి. ఈ పాఠశాలలో సుమారు 16,000 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం క్రింద, ఉపాధ్యాయుల జీతభత్యాల క్రింద 1967_68వ సంవత్సరంలో రూ. 28.16 లక్షల ఖర్చు జరిగింది.

నివేశన స్థలాలు

గ్రామీణ ప్రాంతాలలో హరిజనులు గ్రామానికి దూరంగా అనారోగ్యకరమైన వాతావరణంలో మురికి గుడిసెలలో నివసిస్తుంటారు. అనేక సందర్భాలలో వారి గుడిసెలున్న భూమిపై హరిజనులకు యాజమాన్యం హక్కు ఉండడం లేదు. యెప్పుడైనా వారు తొలిగింపుకు గురికావచ్చు. యజమానులకు యీ అధికారం ఉన్న ఫలితంగా హరిజనులు వారినుండి ఎన్నో దౌర్జన్యాలను ఎదుర్కొంటున్నారు. ఈ విధంగా గ్రామాలలో హరిజనులు, యజమానుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉంటున్నారు. తత్కారణంగా హరిజనులకు ఇండ్ల స్థలాలను కేటాయించడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో కృషి చేస్తున్నది, ప్రభుత్వ భూములు లభించే ప్రదేశాలలో గృహవసతి నిమిత్తం వాటిని హరిజనులకు యిస్తున్నారు. ప్రభుత్వ భూములు లేని గ్రామాలలో భూమిని సేకరించి 3 సెంట్లు మాగాణి 6 సెంట్ల మెట్టభూమి చొప్పున హరిజనులకు కేటాయిస్తున్నారు. 1967_68వ సంవత్సరంలో 4,200 హరిజన కుటుంబాల గృహస్థలాల సేకరణ నిమిత్తం రు. 18 లక్షలు ఖర్చు చేశారు. ఆ స్థలాలలో హరిజనులు గృహాలు నిర్మించుకోవడాన్ని ప్రోత్సహించే నిమిత్తం ప్రతి కుటుంబానికి రు. 100ల చొప్పున గ్రాంటు మంజూరు చేశారు. ఈ సంవత్సరంలో 2,000 హరిజన కుటుంబాలకు యీ ప్రోత్సాహక గ్రాంట్లు మంజూరు చేశారు.

ఇండ్ల స్థలాలను త్వరితగతిని సేకరించడానికి వీలుగా ప్రత్యేక సిబ్బందిని నియమించారు. ప్రభుత్వం అవసరమైన

ప్రదేశాలలో బాటలు, శ్మశానవాటికల నిమిత్తం భూమిని కేటాయిస్తున్నది. ఈ సౌకర్యాలు కల్పించడానికి 1967-68 లో రు. 45,000 ఖర్చు చేశారు. హరిజనులకు మంచినీటి బావులను ఏర్పాటుచేసే నిమిత్తం యీ సంవత్సరం సమితులకు రు. 3.60 లక్షలు యిచ్చారు

షెడ్యూలు కులాల ప్రయోజనం నిమిత్తం, 27 శిక్షణ ఉత్పత్తి కేంద్రాలను ఈ శాఖ నిర్వహిస్తున్నది యీ కేంద్రాలలో అభ్యర్థులకు కుట్టుపని, వడ్రంగం, బట్టల అల్లకం, చర్మకారీ, శిక్షణ పొందుతున్న వస్తువుల తయారీవంటి వాటిలో అనుభవంగల నిపుణుల అధ్వర్యంలో శిక్షణ యిస్తున్నారు. ఈ కేంద్రాలలో 12 నెలలపాటు శిక్షణ యిస్తారు. శిక్షణ పూర్తి అయిన తర్వాత జీవన వృత్తికై ఆయావృత్తులను చేపట్టేవారికి పరికరాలు, వస్తువులరూపంలో ఆర్థిక సహాయం కూడ అందజేస్తున్నారు. గత సంవత్సరం రు. 3.35 లక్షల ఖర్చుతో 10,000 మంది షెడ్యూలు కులాలవారు, ఆర్థికంగా వెనుకబడిన యితర స్త్రీ, పురుషులు యీ కేంద్రాలలో శిక్షణ పొందారు.

హరిజన దినోత్సవాలు

ప్రభుత్వం, హరిజనుల అభివృద్ధి నిమిత్తం వివిధ చర్యలు తీసుకుంటున్నప్పటికీ దేశంలో అంటరానితనం పూర్తిగా నిర్మూలన కాలేదు. ఈ సందర్భంలో ప్రజలలో ప్రబోధం కలిగించే నిమిత్తం ప్రతినెల 30 వ తేదీన బ్లాకు స్థాయిలో హరిజన దినోత్సవం జరుపుతున్నారు. హరిజన వాడలను పరిశుభ్రం చేయడం, పరిశుద్ధతపాటించాల్సిందిగా హరిజనులకు ప్రబోధించడం, సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది హరిజన బాలబాలికలకు వైద్య సహాయం చేయడం, కుటుంబ నియంత్రణగూర్చి తెల్పడంవంటి విషయాలు యీ కార్యక్రమంలో ఉంటాయి. పెద్దల ప్రసంగాలు భజనలు, కీర్తనలు, సామూహిక విందుతో యీ కార్యక్రమం ముగుస్తుంది.

ఈ కార్యక్రమాలద్వారా హరిజనులకు, యితర హిందువులతో మరింత సన్నిహితత్వం కలిగి, హరిజనుల సామాజిక మత స్థాయి పెంపుదలకు దోహదం కలిగినప్పటికీ కేవలం ప్రభుత్వం ద్వారానే వారి పరిస్థితి మెరుగుపడలేదు. యుగాలనుండి కొనసాగుతున్న అంటరానితనాన్ని నిర్మూలించడంలోను, హరిజనుల స్థితిగతులను మెరుగుపరచడంలోనూ ప్రభుత్వానికి యితర అనధికార సంస్థల సహాయ సహకారాలు యితోధికంగా లభించాలి.

రాష్ట్ర హరిజన, హరిజన క్రైస్తవుల సమావేశం

కేంద్ర ఆహార, వ్యవసాయ మంత్రి, శ్రీ జగ్జీవన్‌రామ్, ఆగస్టు 18 న విజయవాడలో రాష్ట్ర హరిజన, హరిజన క్రైస్తవుల సమావేశానికి ప్రారంభోత్సవం చేశారు. ఆ సందర్భంలో ప్రసంగిస్తూ కాంగ్రెసు సోషలిస్టు సరళి సమాజానికి అంకితమైనదనీ, అస్పృశ్యత, కుల పద్ధతులకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగిస్తుందనీ ఆయన అన్నారు. అయితే హరిజనులు, హరిజన-క్రైస్తవులు, యితర వెనుకబడిన తరగతుల ప్రజలు ప్రమత్తతతో, ఉదాసీనంగా ఉండరాదని ఆయన హెచ్చరించారు. అంతేగాక వారు తమ ఆర్థిక అభ్యున్నతికి యితరులపై ఆధార పడకుండా, తమ కాళ్లపై తాము నిలబడాలని ఆయన ఉద్బోధించారు.

అస్పృశ్యత, కుల పద్ధతి నిషేధిస్తూ ప్రభుత్వం శాసనం చేసింది అయితే వాస్తవంగా సమాజంలో వాటిని ఆచరించడం జరుగుతూనే ఉన్నదని ఆయన అన్నారు. పట్టణాల అభివృద్ధి, పారిశ్రామికీకరణ ఫలితంగా యీ విషయంలో నిస్సందేహంగా కొంత మార్పు వచ్చింది. కేవలం "సాంఘిక విప్లవం" ద్వారా మాత్రమే దేశంనుండి యీ కుల పద్ధతిని రూపుమాప గలుగుతామని ఆయనా అన్నారు. సోషలిస్టు సమాజ నిర్మాణానికి కృషిచేసే శక్తులను పటిష్ఠం చేయాలని సూచించారు. ఈ "మధ్యకాలం"లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు, యితర వెనుకబడిన తరగతుల ప్రజలకు ముఖ్యంగా విద్య విషయంలో కొన్ని రక్షణలు కలిగించాలని కేంద్ర మంత్రి అన్నారు. పేద ప్రజల ఆర్థిక అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నందుకు శ్రీ జగ్జీవన్‌రామ్, ముఖ్య మంత్రికి కృతజ్ఞతలు తెల్పారు.

రాష్ట్రంలోని హరిజనులు, యితర వెనుకబడిన తరగతుల ప్రజల ఆర్థిక అభివృద్ధి నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం అమలు జరుపుతున్న వివిధ పథకాల ఫలితాలను మదింపు వేయడానికి సచివాలయం స్థాయిలోను; జిల్లా, హెడ్ క్వార్టర్స్ స్థాయిలోను "సెల్స్"ను ఏర్పాటు చేయాల్సిందిగా తాను ఉత్తర్వులు జారీ చేశానని ముఖ్య మంత్రి అన్నారు. ఇటువంటి పథకాలను మరింత తీవ్రతరంగా అమలు జరపడానికి యీ 'సెల్స్' సిఫార్సులు చేస్తాయి. ఈ సిఫార్సులను అత్యధిక ప్రాధాన్యతపై అమలు జరుపుతామని ఆయన అన్నారు.



దేశసేవ - మానవసేవ

భారత దేశానికీ, ప్రపంచ మానవాళికీ చేతనయినంత సేవ చెయ్యాలని నా ఆకాంక్ష. విధ్యుక్తధర్మ నిర్వహణలో, ప్రజా సేవలో జీవిత పరిత్యాగం చెయ్యడం నా అభిమతం ఒక వర్గాన్ని ఒక శిష్యవర్గం వంటి దానిని ఏర్పాటు చెయ్యాలని నేను అభిలషించడ లేదు అనుచరవర్గం ఉన్నంత మాత్రాన నాకు సంతృప్తి కలగదు నాకు ఇంకా పెద్దకోరికలే ఉన్నాయి. నేను క్రొత్త సత్యాలువేటినీ ప్రబోధించడం లేదు నాకు తెలిసిన సత్యాన్ని వివరించడానికీ, ఆ మార్గంలో గమించడానికీ ప్రయత్నిస్తున్నాను. పాతకాలపు అనేక సత్యాలను గురించి కొన్ని క్రొత్త విషయాలు చెప్పగలనని అభిప్రాయ పడుతున్నాను.

నేను క్రొత్తవిషయాలేమీ ప్రపంచానికి బోధించడం లేదు హిమాలయ పర్వతాలు ఎంత పురాతనమైనవో సత్యం — అహింస అంత పురాతనమైనవి నేను చేసిందల్లా ఈ విషయాలను సాధ్యమైనంత పెద్దయెత్తున ఆచరణలో పెట్టి చూడడమే నేను చేసింది ప్రయోగాలు మాత్రమే అటువంటి సందర్భాలలో నేను కొన్ని సార్లు పొరపాట్లు చేశాను. అల్లాంటి అనుభవాల మూలంగా గుణపాఠాలు నేర్చుకొన్నాను సత్యాహింస సిద్ధాంతాల ఆచరణలో జీవితం, జీవిత సమస్యలు వివిధానేక ప్రయోగాలుగా భాసించాయి

నేను సత్యాన్వేషిని, వినయ వినమ్రతలతో, హృదయ పూర్వకంగా సత్యాన్వేషణకై పరిశ్రమించాను ఫలితంగా నాతో పాటు ఈ రంగంలో కృషి చేస్తున్న సత్యాన్వేషకుల పట్ల ప్రత్యయం పెంపొందించుకున్నాను పలితంగా ఈ కృషిలో నా పొరపాట్లు తెలుసుకొని సవరించుకోడానికి వీలు కలిగింది నా అంచనాలలో అయితేనేమి, నిర్ణయాలలో అయితేనేమి తరచు పొరపడడం — తప్పటడుగు వెయ్యడం జరిగింది. ఆ సందర్భాలలో వెనుతిరిగి చూచుకొన్నాను పునఃపరిశీలన మూలంగా పెద్ద అపకారమేమి జరగలేదని తేలింది. పైపెచ్చు అహింసా సిద్ధాంతానికి సంబంధించిన మౌలిక సత్యం మరింత స్పష్టమైంది. అహింసా సిద్ధాంతం పూర్వం అప్పటికంటె బలవత్తరమైన పరమోత్కృష్టమైన సాధనంగా కన్పించింది. సాధన కొనసాగించడానికి వీల్లేనంతగా దేశ పరిస్థితి దిగజారిపోలేదు, నేను సాధన చేస్తున్నవాణ్ణి సాధనతప్ప నాకితరమైన ఆధారమేదీలేదు ఎక్కడ సత్యం కన్పించినా పరిగ్రహించి, తదనుగుణంగా సాధన కొనసాగించాను నేను ఇతరులెవరైనా అసహ్యించుకొనే వ్యక్తినే కావచ్చును కాని సత్యం నాముఖతః వెలువడినపుడు నా వ్యక్తిత్వం అప్రసక్తం అవుతుంది అందులో నా వ్యక్తిత్వానికేమీ సంబంధం ఉండదు.

ఆత్మ పరిత్యాగానికి సిద్ధపడాలని భారత ప్రజలను అభ్యర్థించాను. ఇది క్రొత్త సిద్ధాంతమేమీ కాదు దేశంలో అనాదినుంచీ ఆచరణలో ఉన్నదే ఇది సత్యాగ్రహం, తదనుబంధ కార్యక్రమాలు — సహాయ నిరాకరణ, పౌర ప్రతిఘటనోద్యమం వంటివన్నీ పాత పద్ధతులకు క్రొత్తపేర్లు మాత్రమే

భారత ప్రజలు బలహీనులు కనుక అహింసా విధానాన్ని సాధనంగా వినియోగించమని నేను కోరలేదు ప్రజలు, తమ అపూర్వశక్తి సామర్థ్యాలు గుర్తెరిగే ఈ సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టాలని నా అభిలాష తమ శక్తిసామర్థ్యాలు గుర్తించడానికి వారికి ఆయుధాల వినియోగంలో ఏ విధమైన శిక్షణ అవసరంలేదు. మనం బలహీనులం అనుకోవడం వల్లనే అటువంటి శిక్షణ ఏదో అవసరమని భావించడం జరుగుతున్నది అటువంటి అభిప్రాయానికి ఆస్కారం లేదు మనకు అనాదినుంచి ప్రబలమైన ఆత్మశక్తి ఉన్నది అది నాశనమన్నది ఎరుగదు శారీరకమైన బలహీనతలకు అది అతీతమైనది ప్రపంచమంతా ఏకమై ఎదురువచ్చినా ప్రతిఘటించగల శక్తి అది

నాకు విశ్వాసాలు ఉన్నాయి భక్తిప్రపత్తులు ఉన్నాయి. భగవంతుడున్నాడనే నా దృఢ విశ్వాసం నన్ను ముక్కలకింద కోసినా భగవంతుడు లేడని అనను. అప్పుడు కూడా భగవంతుడు నాకు నా దృఢవిశ్వాసం ప్రకటించుకునే శక్తి ప్రసాదించగలడని నమ్మకం ఉన్నది మత విశ్వాస విరహితుడనై నేనొక్క క్షణం

కూడా మనలేను రాజకీయాలలో నాతో మైత్రి కలిగినవారిలో అనేకులు నా రాజకీయాలకు కూడా నా మతమే మూలమని అభిప్రాయపడడంచేత కొంత నిరుత్సాహ పడతారు. వారి అభిప్రాయం సరియైనదే నా రాజకీయాలేమిటి—నా ఇతర కార్యక్రమాలేమిటి సమస్తం మతజన్యములే నాకే కాదు ప్రతిమానవుని వివిధానేక కార్యక్రమాలన్నీ అతని మత విశ్వాస జన్యములే. మతం అంటే సర్వం భగవంతునకు అధీనమై ఉండదు మన కార్యకలాపాలపైనే కాదు మన ఉచ్ఛ్వాస నిశ్వాసాలపై భగవంతునకే సర్వాధికారం.

నా రాజకీయ సాంఘిక ఆధ్యాత్మిక జీవితం అంతా ఒకటిగానే పరిగణిస్తాను. అవి వేరువేరుకాదు నా కార్యక్రమాలన్నింటికీ ఒకదానితో మరొకదానికి పరస్పరం సన్నిహిత సంబంధం ఉన్నది. మానవాళిపట్ల నాకు ప్రగాఢమైన ప్రేమాభిమానాలు ఉండడంవల్లనే ఈ వివిధ కార్యక్రమాలు ప్రారంభించడం జరిగింది.

భారత ప్రజలలో సౌభ్రాతృత్వ సాధన ఒక్కటే నా లక్ష్యం కాదు. భారతదేశ స్వాతంత్ర్య సముపార్జన ఒక్కటే నా లక్ష్యం కాదు. ప్రస్తుతానికి నాకున్న వ్యవధి అంతా, నా జీవితమంతా స్వాతంత్ర్య పోరాటానికే సరిపోతున్న మాట వాస్తవమే అయినా నేను అంతమాత్రమే ఆశించడం లేదు దేశానికి దాస్యవిముక్తి సాధించడం ద్వారా సర్వమానవ సౌభ్రాతృత్వం సాధించడానికి కృషిచెయ్యాలని నా లక్ష్యం.

నా దేశభక్తి స్వార్థపూరితమైనది కాదు. ఇతర దేశాల ప్రజలకు కష్టం కలిగించే ఉద్దేశం ఇందులో ఎంతమాత్రం లేదు.

పై పెచ్చు మొత్తం ప్రపంచంలోని మానవులందరి సంక్షేమాభివృద్ధి సాధించాలనే దీని లక్ష్యం. అంతేకాదు నా మతం—తత్జన్యమైన నా దేశభక్తి జీవితానికి సంబంధించినది మానవుల మధ్య సౌభ్రాతృత్వ సాధనకు మాత్రమే సంబంధించినది కాదు. సర్వప్రాణుల పట్ల ఇటువంటి సద్భావం పెంపొందించుకోవలసి ఉన్నది. సర్వ ప్రాణులను సృషించింది భగవంతుడే కనుక ఇటువంటి దృక్పథం అవసరం.

గాంధీ సిద్ధాంతాలంటూ ఏమీలేవు. కారణం, నేను కొత్త సిద్ధాంతాలను కనిపెట్టానని అనుకోవడం లేదు. నేను చేసిందల్లా సార్వకాలిక సత్యాలను జీవితంలో, జీవిత సమస్యలను పరిష్కరించడంలో ఆచరణలో పెట్టడానికి ప్రయత్నించాను. ఈ సిద్ధాంతాలకు ప్రచారం కల్పించడానికి పుస్తకాలు వల్లెవెయ్యడం వల్ల కాక వీటిని జీవితంలో ఆచరణలో పెట్టడం వల్ల ఎక్కువ అవకాశం కలుగుతుంది గాంధీ సిద్ధాంతాలలో తప్పు ఉంటే వాటిని గాలికి కొట్టుకొని పోనీయండి. కాని సత్యాహింసలకు మాత్రం చలనం ఉండదు. నా మిత్రులదగ్గరనుండి నేనాశిస్తున్న గౌరవం ఒక్కటే. నా కార్యక్రమాలను వారు తమ జీవితంలో అమలు పరచడమే. లేదా వారికి వాటిపట్ల విశ్వాసం లేకపోతే నన్ను గట్టిగా ప్రతిఘటించడమే. ఇదే నేను కోరే గౌరవం. నన్ను గౌరవించడం కోసం శిలా విగ్రహాలు ప్రతిష్ఠించడం వంటివి దండుగ. అవి శుష్కదండుగ. అటువంటివి నాకు ఎంత మాత్రం ఇష్టంలేదు. నేను నమ్మిన సత్యాలను పరిగ్రహిస్తే—నేను ప్రారంభించిన కార్యక్రమాలను అమలు పరిస్తే చాలు నన్ను ఎంతో అపూర్వంగా గౌరవించినట్లుగా భావిస్తాను. ఆత్మ గౌరవం స్వాతంత్ర్యం పరిరక్షించు కోవలసిన బాధ్యత సర్వ మానవులపైనా ఉన్నది. ఈ విషయం సర్వ మానవులకు తెలియచేయ గలిగితే నేను కృతకృత్యుడ నయినట్టే. ✦

శౌర్యఘట్టాలు

ఈయేడాది భారత స్వాతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకుని రాష్ట్రపతి పేరిట పోలీసు, అగ్నిమాపక శాఖలకు సంబంధించిన పతకాలను అయిదుగురికీ, ప్రశంసనీయమైన సేవ చేసినందుకై 119 గురు పోలీసు ఉద్యోగులకూ రాష్ట్రపతి పోలీసుపతకాలను ఇస్తున్నట్లు ప్రకటించారు. పోలీసు పతకాలను పొందినవారిలో ఏడుగురు ఆంధ్ర ప్రదేశ్‌కు చెందినవారున్నారు. వారు—

1. శ్రీ శ్రీనివాస ఆనందరాం, డిప్యూటీ పోలీస్ ఇనస్పెక్టర్ జనరల్,
2. శ్రీ మహేశ్వరం వెంకటసుబ్రమణ్యం, పోలీసు ఇనస్పెక్టర్, అవినీతి నిరోధకశాఖ, అనంతపురం.
3. శ్రీ ముద్గంటి ఇంద్రారెడ్డి, పోలీసు ఇనస్పెక్టర్, అవినీతి నిరోధక శాఖ, హైదరాబాద్,
4. శ్రీ జుట్టు లక్ష్మణరావు, పోలీసు ఇనస్పెక్టర్, విజయనగరం.
5. శ్రీ ఆకునూరి సుజ్ఞాన ప్రబోధనరావు, పోలీసు ఇనస్పెక్టర్, సి. ఐ. డి. స్పెషల్ బ్రాంచి, హైదరాబాద్.
6 శ్రీ మహబూబ్ అలీ, హెడ్‌కాన్స్‌టేబుల్, సి. ఐ. డి. క్రైమ్ బ్రాంచి.
7. శ్రీ దేగల పాపారావు, హెడ్‌కాన్స్‌టేబుల్, తూర్పుగోదావరి జిల్లా.

జనాభా సమస్య

డా॥ ఐ. భూషణ్‌రావు

ఈనాడుమనదేశం ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన సమస్యలలో జనాభా పెరుగుదల సమస్య ఒకటి. భారతదేశం ఆర్థిక, సాంఘిక రంగాలలో సత్వరం అభివృద్ధిని సాధించాలంటే వెనువెంటనే యీ సమస్యను మనం పరిష్కరించవలసివుంది.

జనాభా పెరుగుదల

జనాభా పెరుగుదలలో ప్రపంచంలో చైనాది అగ్రస్థానం. అక్కడి జనాభా 75 కోట్లు. మనది ద్వితీయ స్థానం. ఇక్కడి జనాభా 51.5 కోట్లు. అయితే చైనాకు తగినంత భూభాగం వుంది గానీ మనకు లేదు. ప్రపంచ జనాభాలో మనదేశ జనాభా 14 శాతంకాగా ప్రపంచంలోని మొత్తం భూభాగంలో మన దేశ భూప్రాంతం 2.4 శాతం మాత్రమే.

ప్రతి ఒకటిన్నర సెకన్లకూ మనదేశంలో ఒక శిశువు జన్మిస్తున్నది. అంటే రోజుకు 55 వేలపైచిలుకు జననాలు సంభవిస్తున్నాయన్నమాట. మరో విధంగా చెప్పాలంటే ఏటా 2 కోట్ల 10 లక్షల మంది పుడుతున్నారు. మనదేశంలో జననాలరేటు సంవత్సరానికి వెయ్యికి 41 కాగా మరణాలరేటు 16 మాత్రమే. ప్రతి సంవత్సరం 80 లక్షల మంది మరణిస్తున్నారు. కాగా జన్మిస్తున్నవాళ్ళ సంఖ్య 2 కోట్ల 10 లక్షలు. అంటే కోటీ పదమూడు లక్షల మంది అదనంగా ఏటా పెరుగుతున్నారన్నమాట ఈ సంఖ్య సింహళం జనాభాకన్న, ఆస్ట్రేలియా జనాభాకన్న, హరియానా జనాభాకన్న ఎక్కువే. జనాభా యీ లెక్కనే పెరుగుతూపోతే మరో 28 ఏళ్ళలో మనదేశ జనాభా నూరు కోట్లు అవుతుంది.

జనాభా పెరుగుదలకు కారణాలు

గత పదేళ్ళలోనూ మన జనాభా సుమారుగా ఎనిమిది కోట్లు పెరిగింది. మన దేశంలో జననాల రేటు అధికంగా ఉండడం, యిటీవలికాలంలో వైద్య ఆరోగ్య సదుపాయాల కారణంగా మరణాల సంఖ్య బాగా తగ్గుముఖం పట్టడం—యీరెండూ జనాభా విపరీతంగా పెరిగిపోవడానికి ప్రధాన కారణాలు.

స్వాతంత్ర్యానంతరం దేశంలో ఆరోగ్య వైద్యరంగాలలో అమోఘమైన కృషి జరిగింది. విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. వీటిలో ముఖ్యంగా చెప్పుకోదగ్గది జాతీయ మలేరియా నిర్మూలన కార్యక్రమం. ఈ కార్యక్రమంవల్ల ఏటా పది లక్షల మంది మృత్యువునుండి కాపాడబడుతున్నారు కోటి మంది యీ మలేరియా జ్వరం సోకకుండా రక్షింపబడుతున్నారు 1950లో మన దేశంలో సగటు ఆయుః ప్రమాణం 32 సంవత్సరాలు వుండేది. అది 1962లో 52 సంవత్సరాలకు పెరిగింది. జనాభా పెరుగుదలకు యిదొక కారణం.

మన దేశంలో చాలా మంది ప్రజలకు సరిగా కట్టుకోడానికి తగ్గ బట్టలేదు. మనదేశం ఉష్ణ దేశమైనా చాలా మంది అర్ధ నగ్నంగానే వుండవలసి వస్తోంది. ఇక్కడ ఏడాదికి తలసరి సగటు బట్టవాడకం 20 మీటర్లు మాత్రమే.

గృహవసతి సమస్య మరీ అధ్వాన్నంగా వుంది. నీరు, డ్రైనేజి, విద్యుచ్ఛక్తి తదితర జీవితావసరాలైన ప్రాథమిక సౌకర్యాలు కూడా లేని గృహవసతినైన మన ప్రజలకు మనం అందజేయలేక పోతున్నాం. పట్టణాలలోనూ, నగరాలలోనూ అధిక జనాభా మురుగు ప్రాంతాలలో నివసిస్తున్నారు. వేసవికాలమేకాదు చలికాలం, వర్షాకాలంలో కూడా అనేకమంది యీ నాటికీ పేవ్‌మెంట్ల మీద నివసిస్తూవుండడం, రాత్రిళ్ళు నిద్రపోతూవుండడం నిత్యం చూస్తూనే వున్నాం.

ఆహారోత్పత్తి 1951_52 లో 550 లక్షల టన్నులనుంచి 1965 లో 720 లక్షల టన్నులకు పెరిగింది. అయితే జనాభా కూడా యీ మధ్యకాలంలో విపరీతంగా పెరిగిపోవడంవల్ల తలసరి మనిషి ఒక్కంటికి లభ్యమయ్యే ఆహారం 1950_51 లో 12.8 ఔన్సులు కాగా అది 1965_66 లో 12.4 ఔన్సులకు తగ్గిపోయింది. తొలి పంచవర్ష ప్రణాళిక ఆరంభంలో 35 లక్షల మంది నిరుద్యోగులు వుండేవారు. తృతీయ పంచవర్ష ప్రణాళి కాంతానికి అదనంగా 3 కోట్ల ఉద్యోగాలు కల్పించబడినప్పటికీ నిరుద్యోగులు ఒక కోటి మంది వున్నారు.

అందుచేత మన దేశాన్ని యీనాడు పట్టి పీడిస్తున్న ప్రాథమిక సమస్య జనాభా పెరుగుదల సమస్యే, జనాభా పెరుగుదలను మందగించి వ్యవసాయోత్పత్తులను, పారిశ్రామికోత్పత్తులను పెంచడమే యీనాటి ముఖ్యకర్తవ్యం. జనాభాను విపరీతంగా పెరగనిచ్చి, అభివృద్ధి కృషిని మాత్రం నత్త నడకలోనే జరగనిస్తే అందువల్ల సమాజానికీ, కుటుంబానికీ, చివరకు వ్యక్తి గతంగా కూడా హాని జరుగుతుంది.

ఆంధ్రప్రదేశ్‌లో కుటుంబనియంత్రణ కార్యక్రమం

ఇటీవల నాలుగు రాష్ట్రాలలో జరిపిన పరిశీలనల వల్ల ప్రతి వెయ్యి మంది జనాభాకు సంతానోత్పత్తి వయస్సులోవున్న దంపతులు సూటడెబ్బయ్ మందివున్నట్లు వెల్లడైంది. వీరిలో 70 మంది దంపతులకు ముగ్గురుగాని అంతకు ఎక్కువగాని సంతానం వుంది. మిగిలిన నూరుమందికి అసలు సంతానం లేకపోవడమో, లేక ఒకరో, యిద్దరో పిల్లలు వున్నట్లో వెల్లడైంది. సగటున 7_10 మంది దంపతులకు యిద్దరు పిల్లలు వున్నారు. మూడో సంతానం కూడా వారికి కలగడానికి సిద్ధంగా వుంది దీనిని బట్టి లెక్కగట్టితే ముగ్గురుగాని, అంతకు ఎక్కువగాని సంతానంవున్న దంపతులు ఆంధ్రప్రదేశ్‌లో 28 లక్షల మంది వున్నారు వీరు గాక 3_4 లక్షల మందికి మూడో సంతానం కలగడానికి సిద్ధంగా వుంది. అందువల్ల కుటుంబ నియంత్రణ కార్యక్రమం, జనాభాను అరికట్టడంలో శక్తివంతంగా వుండాలంటే యీకార్యక్రమాన్ని శాస్త్రీయంగా పునర్నిర్మించాలి. ఇది ప్రజల కార్యక్రమం గనుక ప్రజలే ఐచ్ఛికంగా దీనిలో పాల్గొనేట్లు చేయాలి.

మన రాష్ట్రంలో 1967_68 లో కుటుంబనియంత్రణ కార్యక్రమం అనుకోనంత ఎక్కువగా విజయవంతమైంది. స్టెరిలైజేషన్ విషయంలో భారత ప్రభుత్వం స్థిరీకరించిన లక్ష్యాన్ని రాష్ట్రప్రభుత్వం అధిగమించడానికి తీవ్రంగా కృషిచేస్తున్నది. నిజానికి యీ స్టెరిలైజేషన్ కార్యక్రమం 1967 డిసెంబరులోనే ఆరంభించబడినప్పటికీ, ఎన్నో అడ్డంకులు వున్నప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లోని కొన్నిజిల్లాలలో అమోఘమైన విజయాన్ని సాధించింది. కుటుంబ నియంత్రణ కార్యక్రమంనిమిత్తం 150 మందికిపైగా డాక్టర్లు నియమింపబడ్డారు 1968_1969 లో ప్రజల ఐచ్ఛిక సహకారంతో పంచాయతీ సమితులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధస్థాయిలలోని ప్రభుత్వ నిర్వాహక సంస్థలు, వాటి తోడ్పాటుతో ప్రభుత్వం యీవిషయంలో ఏర్పరచిన లక్ష్యాన్ని అతిసుళువుగా అధిగమించ గలమని భావించబడుతున్నది.

ఈ దశాబ్దిలో రూ. 700 కోట్ల ఆదాయం

అధికార గణాంకాలను అనుసరించి జాతీయ కుటుంబ నియంత్రణ ఉద్యమం ద్వారా లాభాలు ఒనగూడడం ప్రారంభించాయి.

ఈ సంవత్సరం మార్చితో ఆఖరు అయ్యే పది సంవత్సరాల కాలంలో ప్రజలు కుటుంబ నియంత్రణ ప్రక్రియలను అనుసరించిన ఫలితంగా జననాల సంఖ్య 22 లక్షలకు నిరోధించడం జరిగింది.

ముఖ్యంగా 1967_68 సంవత్సరంలోనే జననాల రేటు చాలా తగ్గింది. ఈ సంవత్సరం 12 లక్షలకు జననాల సంఖ్య తగ్గింది. అంటే గత పదిసంవత్సరాల కాలంలో తగ్గిన రేటుకు యిది దాదాపు 50 శాతానికిపైగా ఉంటుంది.

గత పది సంవత్సరాలలో కుటుంబ నియంత్రణ కార్యక్రమాల అమలుకు రు. 67.21 కోట్లు ఖర్చుచేశారు. ఒక్కో జననానికి సగటున రు. 306 లు ఖర్చుచేశారు.

రు 67 కోట్లపెట్టుబడితో జనన నిరోధన ఫలితంగా గత పది సంవత్సరాలలో భారత ఆర్థికవ్యవస్థకు రు. 700 కోట్లు ఆదాయం లభించినట్టు గణాంక నిపుణులు అంచనావేశారు.

దేశంలో జననాల నిరోధన ఫలితంగా ఆర్థిక విషయాల దృష్ట్యా సగటున ఒకో జనన నిరోధం విలువ రు 3500 లకు ఉంటుందని పేర్కొంటున్నారు, అయితే యిది గరిష్ట పరిమితిలో రు. 21,000 లకు ఉండవచ్చు. కనీస సంఖ్య రు. 3,500 ల ప్రాతి పదికగా రు. 700 కోట్లకు లెక్కించబడింది.

ఒకో జననానికి సగటున చేసేఖర్చు గత పది సంవత్సరాలలో క్రమంగా తగ్గింది. 1958_59 లో సగటు ఖర్చు రు. 759 లు ఉండగా 1967_68 లో రు. 230 లకు తగ్గింది.

కుటుంబ నియంత్రణ కృషికి విద్యుచ్ఛక్తి వ్యవహారాల మండలి చేయూత

సంతానం మితిమీరి పోకుండా చూసుకోవటంలో తమ సిబ్బందికి తోడ్పడటం ద్వారా వారి స్థితిగతులను మెరుగు పరచడానికీ, దేశ ఆర్థికాభ్యున్నతి సాధనకు సముచిత రీతిని పాటుపడేందుకూగాను ఆంధ్రప్రదేశ్ విద్యుచ్ఛక్తి వ్యవహారాల మండలి ఒక పథకాన్ని రూపొందించింది. ఈ పథకం మేరకు, తమ ఉద్యోగులలో స్త్రీలు కానీ, పురుషులు కానీ సంతానం కలక్కుండా ఉండటానికై శస్త్రచికిత్స చేయించుకునేట్లయితే, పూర్తి జీతంతో తొమ్మిదిరోజుల ప్రత్యేక సెలవు ఇవ్వడంతో పాటు నగదుగా 25 రూపాయలను ఈ మండలి ఆ యా వ్యక్తులకు ముట్టచెపుతుంది.

సిబ్బందిలో ఎవరైనా కుటుంబ నియంత్రణ పథకం మేరకు భార్యకు శస్త్రచికిత్స చేయించినట్లయితే ఆరు రోజుల కాజువల్ సెలవు ఇవ్వడంతోపాటు నగదు రూపేణా 25 రూపాయలను ఈ మండలి ముట్టచెపుతుంది.

ఈ రెండు సందర్భాలలోనూ కూడా, అందుకు సంబంధించిన ఉద్యోగి, శస్త్ర చికిత్స జరిపిన వైద్యుని వద్దనుంచి పొందిన సర్టిఫికెటును, జీతాలను పంపిణీ చేసే అధికారికి అందచేసుకోవలసి ఉంటుంది. డ్యూటీకి వెళ్ళని రోజులను సెలవుగా పరిగణించడానికీ, నగదు పారితోషికాన్ని ముట్టచెప్పడానికీ ఈ సర్టిఫికెటు అవసరం.

సీరియల్ :

తిరస్కృతి

వాసిరెడ్డి సీతాదేవి

జరిగిన కథ

సత్యం, సూర్యం అన్నదమ్ములు సరళ, వాళ్ళతోపాటే పెరుగుతోంది. సత్యం అంటే సరళకు యిష్టం. ఎప్పుడూ అతనితోనే ఆడుకునేది. చిన్నవాడైన సూర్యానికి అది నచ్చలేదు. ఉడుకుమోత్తనం వచ్చింది. ఓ సారి సరళ గుజ్జనగూటిని సూర్యం తొక్కేసి ఆమెను రోడ్డుమీదకి తోశాడు. ఎదురుగా లారీ వస్తోంది. సత్యం చూశాడు. ఆమెను రక్షించే ప్రయత్నంలో తనే లారీకింద పడ్డాడు. అతన్ని గుంటూరు ఆస్పత్రిలో చేర్చారు.

ఆ రాత్రిపార్వతమ్మ, ఇద్దరు పిల్లలూ పడుకున్న రెండు మంచాల మధ్యన తన మంచం వేసుకుంది రాత్రంతా పసివాళ్ళు నిద్రలో వెక్కి వెక్కి పడుతూనే వున్నారు. మధ్య మధ్య ఉలిక్కిపడి లేచి కూర్చుంటున్నారు. వాళ్ళను బుజ్జగించి పడుకోబెడుతూనే వుంది. ఆమెకు ఆరాత్రి నిద్రలేదు.

ఉదయం బండికి సత్యం వస్తున్నాడని విని సరళ సంతోషం పట్టలేక ఇల్లంతా హడావిడిగా తిరుగ సాగింది. సూర్యం మాత్రం ఓ గదిలో కూర్చొని తన స్కూలు పుస్తకాలు తిరగేస్తున్నాడు. సూర్యం మనసులో పీచు పీచు మంటుంది. ఆ రోజు గందరగోళంలో తనను ఎవరూ ఏమనలేదనీ, ఇక ఇప్పుడు తండ్రిచేత దెబ్బలు తప్పవనీ భయంపట్టుకొంది. అందుకే ఒక గదిలో కూర్చొన్నాడు చదువుకుంటున్నట్లు నటిస్తూ.

బిడ్డ బ్రతికి బట్టకట్టాడు. క్షేమంగా ఇంటికొస్తున్నాడు. ఎర్రనీళ్లన్నా దిష్టితీయాలి. పార్వతమ్మ చెంబునిండుగా ఎర్ర నీళ్లను కలపసాగింది. అప్పుడే అక్కడకు వచ్చిన సరళ అది చూసి కెవ్వున కేక వేసింది.

"అయ్యో ! ఏంజరిగిందే ?" అంటూ లేచి సరళను ఎడం చేతో దగ్గరకు తీసుకుంది. సరళ భయం భయంగా తల్లి కుడి చేతికేసి చూస్తున్నది.

"ఏమిటమ్మా అలాచూస్తున్నావు ?" కలవరపడుతూ ప్రశ్నించింది పార్వతమ్మ.

"రక్తం ! అంత రక్తం...నీ చేతికికూడా" అంది సరళ బెదిరిపోతూ.

"అయ్యో తల్లీ ఇదిచూసి భయపడ్డావా ? పాపిష్టిదాన్ని రహస్యంగానన్నా చేశానుగాను. ఇది రక్తం కాదమ్మా వట్టి నీళ్లు. నీళ్లలో పసుపూ సున్నంవేసి కలిపాను" అంది పార్వతమ్మ కూతురుకు ధైర్యంచెబుతూ.

"అదెందుకూ ?"



"బావకు దిషితియ్యటానికి."

"అంటే ?"

అంటే ఏమని చెప్పాలో తోచలేదు పార్వతమ్మకు.

"బావచుట్టూ తిప్పుతాను."

"అప్పుడప్పుడు నా చుట్టూ మిరపకాయలూ, చీపురూ తిప్పినట్లా !" తేరుకుంది అప్పటికి సరళ.

"అవునమ్మా !" అంది పార్వతమ్మ ఎర్ర నీళ్లున్న చెంబు మీద మూతపెడుతూ.

వాకిట్లోకి బండి వచ్చి ఆగింది. సందడి విని సరళ పరుగెత్తింది. పార్వతమ్మ ఎర్రనీళ్ల చెంబును తీసుకొని వీధి వాకిలికేసి గబ గబా నడిచింది. సూర్యం గదిబయటకు వచ్చాడు. వెళ్ళి అన్నను చూడాలనివుంది. అమ్మను కౌగలించుకోవాలని వుంది. కాని ధైర్యం చాలటంలేదు. అలాగే దెబ్బతిన్న మూగ పశువులా దీనంగా చూస్తూ నిలబడ్డాడు.

"నువ్వు లోపలకెళ్ళవే పిల్లా !" అంది పార్వతమ్మ కూతుర్ని.

"ఊఁ హూఁ ఎందుకూ ? నేను వెళ్ళను." అంది సరళ

మాధవయ్య బండి దిగి, సత్యం దిగుతుంటె చెయ్యి ఆసరా ఇచ్చాడు. ఆ వెనకే శాంతమ్మ దిగింది.

పార్వతమ్మ సత్యంచుట్టూ మూడుసార్లు చెంబు తిప్పుతూ, మూడుసార్లు నేలమీద చెంబును ఆనిస్తూ దిష్టి తీసింది. దిష్టి నీళ్లను దూరంగా పారబోసిరావటానికి వెళ్ళింది.

మాధవయ్య లోపలకువెళ్ళాడు. సరళ కళ్ళు పెద్దవి చేసుకొని సత్యాన్నే చూస్తూ నిల్చుంది. సత్యం పాలిపోయి నీరసంగా కనిపిస్తున్నాడు. సరళను చూసి హాయిగా నవ్వాడు. సరళ నవ్వబోయిందికాని నవ్వు రాలేదు. సత్యం ఏదో కొత్తగా కనిపించాడు. సత్యం రెండడుగులు సరళవైపు వేశాడు. సత్యం ఎడం చొక్కా చెయ్యి వేలాడుతూంది బోసిగా. సరళ రెండు చేతుల్తో కళ్ళు మూసుకుంది. అర్థం అయిన శాంతమ్మ సరళను కూడా పలకరించకుండానే వస్తున్న దుఃఖాన్ని దిగమింగుకుంటూ లోపలకు వెళ్ళిపోయింది.

"సరళా ఏమిటీ అలా కొత్తవాణ్ణి చూసినట్లు భయపడుతున్నావు!" అంటూ సరళ ముఖాన్ని కప్పివున్న చేతుల్ని కుడిచేత్తో లాగేశాడు సరళ భయంగా ఎడం చేతికి వేళ్లాడుతున్న చొక్కాను చూసింది.

"ఓ, అదా!" అని ఓ క్షణం ఆగిపోయాడు సత్యం

"చెయ్యి పోయింది సరళా! నరికేశాడు డాక్టరు?"

"ఎందుకూ?" ఏడుపు గొంతుతో అడిగింది

"లారీక్రింద నలిగిపోయిందిగా. అందుకే. లోపలికెళదాం పద. సూర్యం ఎక్కడా?" అంటూ లోపలకు నడుస్తున్న సత్యాన్ని యాంత్రికంగా అనుసరించింది సరళ.

వరండాలో బిక్కమొహం వేసుకొని నిల్చొనివున్న సూర్యం తండ్రి గబగబ లోపలకు రావటంచూసి గతుక్కుమన్నాడు. ఎక్కడికైనా పారిపోవాలనుకున్నాడు. కాని అలాగే గుడ్లప్పగించి చూస్తూ నిల్చున్నాడు.

"ఏరా సూర్యం! ఎందుకు దిగాలుపడి నిల్చున్నావు . . అన్నయ్య వచ్చాడు వెళ్ళు పలకరించు" అంటూ మాధవయ్య లోపలకు వెళ్ళాడు.

తండ్రి తను అనుకున్నట్లుగా తనను దండించలేదు. సూర్యానికి ధైర్యం వచ్చింది హుషారుగా ముందుకు నడిచాడు. తల్లి ఎదురు వచ్చికూడా తనను పలకరించకుండానే గబగబా లోపలకు వెళ్ళిపోయింది. ఇంతలో సత్యం సూర్యాన్ని సమీపించాడు. సూర్యం సత్యంకేసి నివ్వెరపోయి చూశాడు ఓ క్షణకాలం. మరుక్షణంలో 'అన్నయ్యా!' అంటూ వెళ్ళి అన్నను కౌగలించుకొని పెద్దపెట్టున ఏడ్చాడు.

"ఎందుకురా తమ్ముడూ ఏడుస్తున్నావు?" అంటూ వున్న ఒక చేతినీ తమ్ముడిచుట్టూ చుట్టాడు.

"నీచెయ్యి!" అన్నాడు వెక్కిళ్లమధ్యలో సూర్యం.

"ఓస్ అందుకేనా ఏడుపు ఆ చెయ్యి లేకపోతేనేం? ఈ చెయ్యి వుందిగా!" అన్నాడు సత్యం ఉత్సాహంగా.

"నేను నిన్ను లారీకింద పడెయ్యలేదు అన్నయా!"అన్నాడు మళ్లీ వెక్కుతూ.

"ఛ! ఊరుకో తమ్ముడూ! నువ్వు నన్ను లారీ కింద ఎందుకు పడేస్తావు? ఎవరన్నారు ఆమాట?" అన్నాడు సత్యం తమ్ముడి కళ్లు తుడుస్తూ.

"సరళ!" అన్నాడు సూర్యం చొక్కా చివరతో ముఖం కళ్ళూ తుడుచుకుంటూ.

"సరళా! తమాషాగా అనివుంటుంది. ఇక అనదులే. నన్ను ఎవరూ పడెయ్యలేదు. నేనే పడ్డాను."

"ఆ మాట అమ్మకూ, నాన్నకూ చెబుతావు కదూ!"

"ఎప్పుడో చెప్పాను "

"మరి అమ్మ నాతో మాట్లాడకుండా లోపలకు వెళ్ళిందేం?"

"అదా! పద అమ్మను అడుగుదాం!" అంటూ సత్యం సూర్యాన్ని లోపలకు తీసుకెళ్ళాడు

ఆనాడంతా సరళా, సూర్యం, సత్యాన్ని చుట్టుకొని తిరుగుతూనే వున్నారు. సూర్యం తన ఆటవస్తువులన్నీ సత్యానికి ఇచ్చాడు. తమ్ముడి బాధను కొంత వరకు అర్థం చేసుకొన్న సత్యం, వాటిని తీసుకొన్నాడు. అందరూ అన్నాలకు కూర్చున్నారు. సత్యం ఎంగిలిచేత్తో మంచినీళ్ళు త్రాగటం చూసింది సరళ. సత్యానికి ప్రతి పనిలోనూ మరొకరి సహాయం అవసరం అనే విషయాన్ని లీలగా గ్రహించిన ఆ పసి హృదయం ఆవేదనతో అలమటించి పోయింది

... ...

సత్యం లారీ కింద పడి ఆరునెలలు తిరక్కుండానే పార్వతమ్మ కన్నుమూసింది. మూడు రోజుల జ్వరం ముంచేస్తుందను కోలేదు ఎవ్వరూ. ఏడుస్తున్న సరళను సత్యం అనేక విధాలుగా ఊరడించడానికి ప్రయత్నించేవాడు. ఒక నిమిషం సరళను వంటరిగా వదిలేవాడుకాదు. మాధవయ్య దంపతులు సరళను కన్నబిడ్డ కంటే ఎక్కువగా, ఎక్కడ నొప్పి పడుతుందో నన్నంత జాగ్రత్తగా చూసుకొంటున్నారు.

చెయ్యిలేని కొడుకుని చూస్తూంటే శాంతమ్మ కడుపు తరుక్కుపోయేది. మాధవయ్యకు తన బాధను పైకి చూపించటం చాతకాదు. బాధనే కాదు ప్రేమను, మరే సన్నిహిత భావాన్ని కూడా వెలిబుచ్చటం తెలియని వ్యక్తిత్వం మాధవయ్యది. సత్యం అవిటితనం గురించిన బాధ, చాలీ చాలని పగటి నిద్రతో వచ్చే తలనొప్పిలా, సన్నగా, విడువకుండా అతని హృదయంలో ఒకమూల తిష్ట వేసుకొంది. తల్లీదండ్రీ సత్యాన్ని ప్రత్యేకంగా చూడసాగారు. సరళ

అయితే సత్యం చేసే ప్రతి పనిలోనూ సహాయపడుతూ ఉండేది. భోజనం చేసేప్పుడు మంచినీళ్ళు తాగిస్తూ అతని పక్కనే కూర్చునేది. భోజనం అయాక అతని చేతిని సున్నిపిండితో తనే కడిగేది. ఇదంతా చూస్తున్న సూర్యం మనసులో తను ఆ ఇంట్లో ఎవరికీ అక్కరలేదు అనే భావం, లీలగా నాటుకొని, ఆకులు తొడగసాగింది. అంతటితో పోలేదు, ఆ భావమే సూర్యంలో ఈర్ష్యను లేవదీసింది. ఆ పసి హృదయంలో తేలుపిల్లా బయలుదేరిన అసూయ, అశాంతిని రేపింది. దాంతో అతను తనకు తెలియకుండానే అన్నమీద ద్వేషం పెంచుకోసాగాడు.

సత్యానికి పధ్నాలుగువెళ్ళి పదిహేనో సంవత్సరంవచ్చింది. ఊళ్ళోవున్న హైస్కూల్లో ఫోర్తుఫారం చదువుతున్నాడు. ఆ ఊరు స్కూల్లో ఆ సంవత్సరమే ఫోర్తుఫారం పెట్టారు. తరువాత సంవత్సరాల్లో క్రమంగా ఫిఫ్తుఫారం, సిక్స్తుఫారం పెట్టడానికి నిర్ణయం అయింది.

సూర్యానికి పన్నెండో సంవత్సరం. సెకండ్‌ఫారం చదువుతున్నాడు. సరళకు పదో సంవత్సరం. ఐదో క్లాసు చదువుతున్నది. ఆడపిల్ల చదువుని గురించి ఆలోచించే రోజులు ఇంకా ఆ గ్రామానికి రాలేదు. చాలా మంది ఆడపిల్లలు నాలుగు ప్యాసు కాగానే ఆపేసినవాళ్లు ఉన్నారు.

సరళ సత్యంతోనే కలిసి స్కూలుకు వెళ్ళేది. సూర్యం కావాలనే ముందుగానో, వెనకనో వెళ్ళేవాడు. సూర్యం ప్రవర్తన సత్యానికి బాధను కలిగిస్తూ ఉండేది. అప్పుడప్పుడు కోపం కూడా వచ్చేది. సూర్యం బయట పిల్లలతోచేరి సత్యం కుంటిచేతిని ఎగతాళి చేసేవాడు. అలాంటప్పుడు సత్యానికి కోపం కంటే దుఃఖం ఎక్కువగా వచ్చేది. తమ్ముడు అలా అంటున్నాడని ఒకసారి బాధపడుతూ తండ్రితో చెప్పాడు, చాలా కాలం క్రితం. మాధవయ్యకు పిచ్చికోపం వచ్చింది. సూర్యాన్ని చెరణాకోలతో కొట్టాడు. అప్పటినుంచి తండ్రికి చెప్పటం మానేశాడు. ఆ సంఘటన తరువాత సూర్యం సత్యాన్ని బద్ధశత్రువుగా చూడసాగాడు. మాధవయ్యా, కాంతమ్మా ఆ విషయాన్ని గ్రహించకపోలేదు. కాని ఏదో చిన్నతనం అనుకున్నారు. పెద్ద వాళ్ళయితే వాళ్ళే తెలుసుకుంటారు అని సరిపెట్టుకొన్నారు.

సత్యం, తనకు చెయ్యి లేకపోవడం వల్ల కలిగిన లోపాన్ని గురించి ఇప్పుడిప్పుడే ఆలోచించటం మొదలు పెట్టాడు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ దిగులుగా వుండేవాడు. సాయంకాలం అందరూ ఆటలు ఆడుతూఉంటే తను ఇంటికి వచ్చేవాడు. క్రికెట్ అంటే సత్యానికి చాలా ఇష్టం. తను దూరంగా నిల్చొని చూస్తూవుంటే సూర్యం రెండు చేతుల్తో బ్యాట్‌ను పట్టి బంతినికొట్టి సగర్వంగా అన్నకేసి చూసేవాడు. ఆ చూపు సత్యానికి అసహజంగా కనిపించి బాధపడేవాడు. సత్యం చిన్నప్పటి నుంచి గీతలు గీస్తూ అందులో వివిధ రూపాలను సృష్టించడానికి ప్రయత్నించేవాడు. అందరికీ పిచ్చిగీతల్లా కనిపించే తను గీచిన గీతల్లో రకరకాల ఆకారాలను చూస్తూ ఆనందంతో పరవశించిపోయేవాడు. అప్పుడు అందరూ ఆడుకుంటూ వుంటే సత్యం ఒంటరిగా ఆలోచిస్తూ పొలాలవైపు, కొండల దగ్గరకూ వెళ్ళి గంటలకొద్దీ కూర్చొని ప్రకృతి సౌందర్యాన్ని తనివితీరా చూస్తూ కూర్చుండేవాడు. కొండల వెనగ్గా అస్తమిస్తున్న సూర్యుణ్ణి, రాగరంజితమైన పడమటి దిక్కును చూస్తుంటే అతని కళా హృదయం, ఏదో అవ్యక్త ఆనందంతో స్పందించేది. రకరకాల చెట్లనూ, ఆ చెట్లమీద వుండే పిట్టల్ని కన్నార్పకుండా చూసేవాడు.

ఒక రోజు సత్యం ఏదో దృశ్యాన్ని మైమరచిచూస్తున్నాడు తమ చేను గట్టుమీద నిల్చుని. అప్పటికి ఇంకా చీకటి పడలేదు. అలా నిల్చున్న సత్యాన్ని వెనుకనుంచి వస్తున్న పాలేరు రంగన్న "ఏ బాబూ! అట్లా నిల్చున్నారు?" అంటూ పలకరించాడు. సత్యం అతని మాటలకు జవాబివ్వలేదు. అసలు వినలేదు కూడా. అతను అంత కుతూహలంగా దేన్నో చూస్తున్నాడని తెలుసుకున్న రంగన్న సత్యం పక్కనేవచ్చి నిలబడి చూశాడు. రంగన్నకు వళ్ళంతా చెమటలు పట్టింది. గబుక్కున సత్యాన్ని గట్టుమీద నుంచి రెండోవైపు చేలోకి నెట్టాడు. చేతుల్లోవున్న దుడ్డుకర్రతో తన్మయత్వంలో నాట్యం చేస్తున్న నాగన్న పడగమీద గట్టిగా కొట్టాడు. పడగ నేలకు కరుచుకుంది. మరో దెబ్బ నడుంమీద వేశాడు. నడుము విరిగిన కాలనాగు తోకను గాలిలో ఆడిస్తూ "రండి బాబూ!" అంటూ రంగన్న సత్యాన్ని పిలిచాడు.

సత్యం, మరణ బాధతో మెలికలు తిరుగుతున్న నాగరాజును కళ్ళ నిండుగా నీరు నింపుకొని చూస్తున్నాడు.

"ఆదేంది బాబూ ఏడుస్తున్నారు?" అన్నాడు రంగన్న.

"రంగన్నా ఎంత పనిచేశావు!" రుద్ధంగాఅన్నాడు సత్యం.

"అది పాము బాబూ, విషం పాము. దాన్ని కనిపిస్తే వదల కూడదు. నేను సమయానికి రాకపోతే నిన్ను పొట్టన పెట్టుకొనేదే" అన్నాడు రంగన్న.

"లేదు రంగన్నా, అది నన్ను కరవదు. అది అసలు ఎవర్నీ కరవదు. దాని జోలికి వెళ్ళిన వాళ్ళనే అది కరుస్తుంది. ఎంత చక్కగా నాట్యం చేస్తున్నదో, దాని నాట్యాన్నే చూస్తున్నాను" అన్నాడు సత్యం చప్పగా నేలమీద పడివున్న పాముకేసి జాలిగా చూస్తూ. మనస్సంతా విషాదంతో నిండిపోయింది. దాన్ని అలా చంపటానికి మనకేం అధికారం వుంది. ఈ సృష్టిలో బ్రతికే హక్కు మనకెంత వుందో దానికీ అంతే వుంది. రంగన్న కావాలంటే మళ్ళీ దాన్ని బ్రతికించగలడా? ఒక ప్రాణాన్ని ఇవ్వటం చేతకాని మనకు ప్రాణాన్ని తీసుకునే అధికారం ఎక్కడ నుంచి వచ్చింది? పరిపరి విధాలుగా ఆలోచిస్తూ సత్యం రంగన్నతో కలిసి ఇంటికి వచ్చాడు.

(సశేషం)

ఉత్తమ సమాజ నిర్మాణ కృషిలో ఉపాధ్యాయుని పాత్ర

చిల్లర కృష్ణమూర్తి

ఆదికాలంనుంచీ సంఘంలో అత్యున్నతమైన గౌరవస్థానాన్ని అలంకరించదగిన వ్యక్తిగా ఆచార్యుడు పరిగణింపబడుతున్నాడు. మానవులను చతుష్పాదులనుండి వేరుచేసే విజ్ఞాన విశేషాన్ని, విచక్షణా జ్ఞానాన్ని ప్రసాదించేది ఆచార్యుడు గనుక 'గురుడొకండు లేకున్న నరుడు వానరుడగును' అన్న పెద్దల వాక్యం అక్షరాల నిజమనిపిస్తుంది విద్యాభ్యాసానికి పూర్వం పసిపిల్లల మనస్సులు మొలకలెత్తి తీగెలు వేసే లతానికుంజాల వంటివి. ఈ తీగెలకు ఆలంబనం కలిగించి, ఆధారం చూపించి, పందిరి వేయించి అవి పెరిగి వ్యాపించేందేందుకూ, ఆ పిదప వృద్ధిచెంది మొగ్గ దొడిగి, ఫల పుష్పాలను అందించేందుకూ ఉపాధ్యాయుడు తోటమాలిగా ఉపకరిస్తాడు.

సరియైన గురువులభించి పిల్లవానికి విద్యా విజ్ఞాన వికాసాలకు దోహదం కలిగినపుడు అతడు రవీంద్రుని మించిన కవీంద్రుడే గావచ్చును, మహాత్ముని మించిన సత్యాహింసల ప్రబోధకుడే గావచ్చును- మానవ జీవిత గతిని సైతం మార్చగల మహనీయ శాస్త్రవేత్తయే కావచ్చును అట్టి మహనీయ శక్తిసామర్థ్యాలను పిల్లలకు కలిగించ కలిగినవాడు ఉపాధ్యాయు డొక్కడే. అందుకే తల్లి దండ్రుల తర్వాత దైవాని కన్న ముందుగా సముచిత స్థానం గురువుకు లభించింది.

ప్రాచీన భారతావనిలో విద్యాభ్యాసానికి కేంద్రాలుగా గురుకులాశ్రమాలు వుంటుండేవి. విద్యాభ్యాసం పూర్తి అయ్యే వరకు గురుకులాశ్రమ కార్యకలాపాల్ని నిర్వహిస్తూ, గురుశుశ్రూష చేసి ఆనాటి విద్యార్థులు విద్య నభ్యసిస్తుండేవారు.

దాదాపు ఒకటిన్నర శతాబ్దాల తరబడి సాగిన బ్రిటిష్‌వారి పరిపాలనలో మన సంస్కృతి, నాగరికత, విద్యా ప్రమాణాలు అడుగంటి పోయాయి. పాశ్చాత్య నాగరికతా విశేషాన్ని ప్రబోధించేందుకు అనువైన పద్ధతిలో విద్యా విధానం రూపొందింపబడింది ఏ కొద్ది మందికో విద్యావకాశాలు లభించేవి. ఉపాధ్యాయులు కూడా చిలుక పలుకులను పలికి అధికారుల ఆదేశానుసారం, పర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్యా ప్రణాళికల కనుగుణంగా పాఠాలు చెప్పుతుండేవారు. స్వాతంత్ర్యానంతరం జాతీయ ప్రభుత్వం ఏర్పాటు గావడంతో, విద్యా విధానంలో భారతీయ సంస్కృతి కనుగుణంగా మార్పులు తీసికొని రావడం జరిగింది. విద్యా రంగంలో కూడా అనేక కోట్ల రూపాయలు వెచ్చించి బృహత్ప్రణాళికలను చేపట్టి నిర్వహించడం జరిగింది. దేశంలో అక్కడక్కడ మచ్చుకు ఒక్కొక్కటిగా వుండే పాఠశాలలు యిప్పుడు నలు మూలలా వ్యాపించడం జరిగింది. గ్రామ గ్రామానికి పాఠశాలలు వెలిశాయి ఆనాడు వ్రేళ్ళమీద లెక్కించదగిన ఉపాధ్యాయుల సంఖ్య నేడు కొన్ని లక్షలకు పెరిగింది భారతీయుడన్న ప్రతి ఒక్కనికీ విద్యా సౌకర్యం కలిపించబడింది. నిర్బంధ విద్యా విధానం ప్రవేశ పెట్టడం జరిగింది. సులభమైన పద్ధతులలో విద్యాబోధన చేసేందుకు అధ్యాపకులకు ప్రత్యేక శిక్షణ వసతులు ఏర్పాటు చేయబడ్డాయి.

పూర్వం గ్రామస్తులకు ఉపాధ్యాయుడు మార్గదర్శకంగా వుండేవాడు పిల్లలకు విద్య చెప్పడం మాత్రమే గాకుండా, సమాజాభివృద్ధికి చక్కని సలహాలను ఇస్తూ, విజ్ఞాన విశేషాలను తెలియబరుస్తూ, వైద్య సహాయాన్ని అందజేస్తూ వారికి అండదండగా వుండేవాడు గ్రామస్థులుకూడా ఆయనను గౌరవ భావంతో చూచేవారు ఆయనకు కావలసిన సర్వసదుపాయాలను సమకూర్చేవారు. అతన్ని గ్రామంలో ఆరాధ్య వ్యక్తిగా పరిగణించేవారు.

ప్రజాస్వామ్యంలో ప్రజలే పాలకులు కాబట్టి, తమ అభివృద్ధికై తలపెట్టబడిన అన్ని కార్య క్రమాలలోనూ వారు శ్రద్ధ వహించి కృషిచేయాల్సి వుంటుంది. ఆదే విధంగా విద్యాభివృద్ధి కార్యక్రమంకూడా ప్రజల కార్యక్రమంగా పరిగణించబడాలి నేటి బాలలే రేపటి పౌరులు. వారి ఉజ్వల భవిష్యత్తు మీదనే భారతదేశ కల్యాణం ఆధారపడి వుంది. విద్యావంతులు, క్రమశిక్షణా సంపన్నులు, సమర్థులైన యువతరం మీదనే మన దేశ భవిష్యత్తు ఆధారపడి వుంది అందుకు ప్రజలు పిల్లల విద్యాభివృద్ధి రంగంలో ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి వుంటుంది. దీనికి దోహదం కలిగించే ఉపాధ్యాయులకు గౌరవ మర్యాదలు కలిగించి వారు అత్యంత వుత్సాహంతో ఏ తత్కార్య నిర్వహణకు నడుం బిగించేలా చేయాలి. పిల్లలకు విద్యా బుద్ధులు గరపడంతో పాటు ఉపాధ్యాయులు సమాజాభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని పల్లెసీమల అభివృద్ధికి కృషిచేయాలి ఈ విధమైన పరస్పర సహాయ సహకార భావంతో ప్రజలు, ఉపాధ్యాయులు ప్రవర్తించిననాడు దేశం నిత్య కల్యాణం పచ్చ తోరణంగా వుంటుందనడంలో సందేహం లేదు.

దేశంలో సమాజాభివృద్ధి కార్యక్రమం, పంచాయతీ రాజ్య వ్యవస్థ ఏర్పాటు చేయడంతో పాఠశాలలు కేవలం విద్యా కేంద్రాలుగనే గాక సంస్కృతీ కేంద్రాలుగా కూడా పని చేయాల్సిన అవ

సరం ఏర్పడింది గ్రామసీమలలో ప్రధానమైన మూడు సంస్థలలో పాఠశాల ఒకటిగా మారింది. పాఠశాలను గ్రామ సమాజమందిరంగా తీర్చిదిద్దడంలో, ఉపాధ్యాయుడు ఉత్సాహంగా కృషి చేయాలి. సమాజాభివృద్ధికి పాఠశాల మౌలికమైన శక్తి వంటిది. ఉపాధ్యాయుడు ఆ శక్తినుపయోగించేందుకు సాధనమైనవాడు. ప్రతిభావంతుడైన భావిపౌరులను తయారుగావించే పాఠశాలా కార్ఖానాలో ఉపాధ్యాయుడు కష్టించి పనిచేసే కార్మికుడంటే సమంజసంగా వుంటుందేమో. వినోబాభావే అన్నట్లు, ఉపాధ్యాయుడు ప్రజా సేవకుడు. పాఠశాల ఒక సేవా కేంద్రం ఆదర్శప్రాయమైన ఉత్తమ సమాజాన్ని రూపొందించేందుకు పాఠశాల ఒక చక్కని కేంద్రం. ఉపాధ్యాయుడు ఆ కేంద్ర నిర్వాహకుడు. గ్రామ పరిస్థితులు, గ్రామ సమస్యలు, గ్రామస్థుల జీవన సరళి మున్నగు విషయాలను ఉపాధ్యాయుడు తెలుసుకొని వుండాలి. గ్రామాభివృద్ధికి కావలసిన కార్యక్రమాలను రూపొందింపజేసి, నిర్వహింప జేయగలిగిన ప్రముఖ వ్యక్తిగా, నాయకునిగా ఉపాధ్యాయుడు వ్యవహరించాలి. అంటే గ్రామ రాజకీయాల్లో తలదూర్చి గ్రామ సమైక్యతను చెడిపేందుకు కాదు తాను నాయకత్వం వహించవలసింది. ఉపాధ్యాయుడెప్పుడూ రాజకీయాలకు దూరంగా వుండేలా చూచుకోవాలి. పాఠశాలాభివృద్ధికి, పటిష్ఠమైన గ్రామ సమాజాభివృద్ధికి మాత్రమే తాను కృషి చేయవలసి వుంటుంది. సమాజాభివృద్ధి రంగంలో శిక్షణఇచ్చేందుకే ఉపాధ్యాయులను కూడా గ్రామ సహాయక శిక్షణ శిబిరాలకు అభ్యర్థులుగా ఎన్నుకుంటుండేవారు. మూడు నాల్గు రోజులపాటు జరిగే ఈ శిబిరాలకు హాజరు కావడానికి అనుమతినిచ్చి ప్రభుత్వం ఈ కాల పరిమితిని డ్యూటీ క్రింద పరిగణించింది.

వీలైనంతలో శక్తివంచన లేకుండా కృషిచేసి, అటు పాఠశాలల అభివృద్ధికీ, యిటు సమాజాభివృద్ధికీ పాటుపడి సమాజంలో పూర్వపు ఔన్నత్యాన్ని అందుకో కలిగిన ఉపాధ్యాయులు నేటికీ వున్నారంటే అతిశయోక్తి కాదు. అటువంటి వారిని జాతి గుర్తించేటట్లు చేయాలి అనే సదుద్దేశంతోనే ప్రభుత్వం ఏటా రాష్ట్రపతి అవార్డులను నెలకొల్పింది. భారత మాజీ రాష్ట్రపతి డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ కూడా ఉపాధ్యాయవృత్తి నిర్వహించినవారే. తన జన్మదినోత్సవాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించారు. అప్పటి నుండి సెప్టెంబరు 5వ తేదీన ప్రతి సంవత్సరం ఈ ఉపాధ్యాయ దినోత్సవాన్ని మనం నిర్వహించుకుంటున్నాం. ఉపాధ్యాయ సంక్షేమ నిధిని ఏర్పాటు చేసుకున్నాం. జిల్లా పరిషత్తులలోనూ, పంచాయితీ సమితులలోనూ పనిచేసే ఉపాధ్యాయులకు సక్రమంగా సకాలాలకు జీతాలు అందజేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది

విద్యావంతులున్న దేశంలోనే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది. అట్టి విద్యావంతులతో కూడిన సమాజాన్ని నేటి పాఠశాలలు సృష్టించగలుగుతాయి. అందుకు ప్రధాన పాత్రధారి ఉపాధ్యాయుడే. కాబట్టే ఉత్తమ సమాజ నిర్మాణ కృషిలో ఉపాధ్యాయుని పాత్ర ఎంతో ప్రాముఖ్యత వహిస్తున్నది. ★

పుష్కరాల ప్రాముఖ్యం

గంగా, నర్మద, సరస్వతి, యమున, గోదావరి, కృష్ణ, కావేరి, భీమ, తామ్రపర్ణి, తుంగభద్ర, తపతి, సింధు అనే పన్నెండు పవిత్రనదులు ప్రవహించి భారతావనిని పునీతం చేస్తున్నాయి. శుభగ్రహమైన బృహస్పతి సంచారాన్ని అనుసరించి ఒక్కొక్కయేడాదీ ఒక్కొక్కనదికి సర్వపవిత్ర జలాలప్రాశస్త్యం లభిస్తుంది మేషంలో బృహస్పతి సంచరించేటప్పుడు గంగానదీ జలాలు, సింహలో సంచరించేటప్పుడు గోదావరీ జలాలు, కన్యరాశిలో సంచరించేటప్పుడు కృష్ణానదీ జలాలు పవిత్రత సంపాదించుకుంటాయి. రాశి చక్రంలో ఒక్కొక్క యింటిలో బృహస్పతి సంచరించునపుడు తదనుగుణంగా ప్రతిఒక్కనదీ పవిత్రజలాల ప్రాశస్త్యాన్ని పొందుతుంటుంది ఈ విధంగా బృహస్పతి ఆయా నదులకు సంబంధించిన రాసులలో ప్రవేశించిన లగాయతు పండ్రెండు దినములపాటు ప్రతిఒక్క నదికి ఉత్సవాలు జరుగుతాయి వీటనే పుష్కరాలంటాము సర్వపవిత్ర జలాల అధిదేవత, పుష్కర పేరిట వచ్చినదే 'పుష్కరం' అనే మాట.

గత సంవత్సరం బృహస్పతి సింహరాశిలో సంచారం మూలంగా గోదావరి పుష్కరం జరిగింది. ఆయన ఈ ఏడు కన్యారాశిలో ప్రవేశించడంతో కృష్ణాపుష్కరం ప్రారంభమౌతుంది.

స్వర్గలోకంలోని పవిత్ర స్నాన ఘట్టానికి కూడా 'పుష్కరం'. అనే నామాంతరం వుంది. ఇంద్రుని ప్రార్థన మన్నించి బ్రహ్మదేవుడు పుష్కర తీర్థం సృష్టించడం జరిగింది. కాబట్టి పుష్కరమంటే అన్ని పవిత్ర జలాల ప్రశస్తిని మించినదన్నమాట. ఒక్కముక్కలో చెప్పాలంటే పుష్కరం సర్వపవిత్ర జలాలకు సామ్రాజ్ఞి. పుష్కరకాలంలో పవిత్ర జలాలు తత్సంబంధమైన నదిలో ప్రవహిస్తాయని ప్రతీతి. ఈ కాలంలోనే దేవతామూర్తులని తమ శక్తులను ఆ నదిలోనే కేంద్రీకరించి వుంచుతాయన్నీ కూడా చెప్తుంటారు.

కాబట్టి పండ్రెండు సంవత్సరాల కొకసారి, భారతదేశంలో ప్రత్యేకించి ఒక నదిని పూజ్యభావంతో కొలుస్తారు దేశం నలుమూలల నుండి వేలాది యాత్రికులు, ఆనది ఒడ్డున జేరి, స్నానమాచరించి, తమ పితృదేవతలకు తర్పణం విడుస్తారు.

ఈ సంవత్సరం కృష్ణానదికి ఆ మహదౌన్నత్యం లభించింది.

పవిత్రనదుల కోవకు చెందిన తుంగభద్ర, భీమ ఉపనదులతో కలుపుకొని కృష్ణానదీ ప్రాశస్త్యం మూడురెట్లు పెరుగుతుందంటే అతిశయోక్తికాదు.

కృష్ణానది పుట్టుపూర్వోత్తరాలు

భారతదేశంలోని పవిత్రమైన పన్నెండు నదులలో కృష్ణానది ఒకటిగా భావించబడుతున్నది. వాటిలోని అన్నిటి మాదిరిగానే దానికి కూడ చరిత్ర ఉంది. కృష్ణానది చరిత్ర. పద్మపురాణంలోని ఉత్తరభాగానికి చెందినది.

త్రిమూర్తులలో ఒకరయిన సృష్టికర్త బ్రహ్మదేవుడు మహా యజ్ఞ క్రతువును చేయదలచి అందుకు పశ్చిమ కనుమలలోని సహ్యాద్రిని స్థలంగా ఎన్నుకున్నాడు. త్రిమూర్తులలోని స్థితి, లయకారులైన విష్ణువు, శివులను ఉపద్రష్టలుగాను, భృగు మహా ఋషిని ప్రధాన పురోహితునిగాను ఎన్నుకున్నారు. ముఖ్యులైన యితర దేవతలు యితర పనులకు వినియోగింపబడ్డారు యజ్ఞ క్రతువును ప్రారంభించడానికి సుముహూర్తాన్ని నిర్ణయించారు

బ్రహ్మకు సరస్వతి, గాయత్రి యిద్దరు భార్యలు. విద్య, లలిత కళలు, సంగీతం, సాహిత్యానికి చెందిన దేవత సరస్వతి, ఇద్దరిలో పెద్దది ఆమె. యజ్ఞక్రతువు ప్రారంభించే ముహూర్తానికి ఆ స్థలానికి ఆమె చేరలేక పోయింది తత్కారణంగా ఆమెకన్నా చిన్నదైన గాయత్రీదేవి బ్రహ్మ సరసన కూర్చొని యజ్ఞం నిర్వహించాలని దేవతలు నిర్ణయించారు. యజ్ఞం పూర్తి అయిన తర్వాత సరస్వతి అక్కడికి వచ్చింది. సంగతి తెలుసుకుని తనకు జరిగిన అవమానానికి రుద్రరూపం దాల్చింది. యజ్ఞ క్రతువులో భర్తతో పాల్గొనే అర్హత ఆమెకు మాత్రమే ఉంది. ఈ అపూర్వమైన గౌరవం గాయత్రికి దక్కడానికి దోహదం చేసిన దేవతలు-ముఖ్యంగా శివకేశవులు–ఆమెను అవమానించడానికి ముఖ్యకారకులై ఆమె ఆగ్రహానికి గురి అయ్యారు. ఈ నేరానికి బాధ్యులైన వారందరూ సెలఏర్లుగా మారి సహ్యాద్రి పర్వతాల నుండి (పశ్చిమ కనుమలు) ప్రవహిస్తూ సముద్రంలో కలవాలని ఆమె శపించింది. తత్ఫలితంగా విష్ణువు కృష్ణానదిగాను, శివుడు వేణీనదిగాను, బ్రహ్మ కాకుదుమతిగాను యితర దేవతలు విశాల, విజయ, వైష్ణవి, మాలపహారి, కౌసికి, నారాయణి, భీమ, తుంగ,భద్ర, అర్చిర, ముచికుంద ఉపనదులుగాను మారిపోయారు. ఇవన్నీ కృష్ణానదికి ఉపనదులు.

అనేక సంస్కృతులకు,మతాలకు ఆటపట్టు కృష్ణానది. దాని తీర ప్రదేశాలైన మహాబలిపురం నుండి సాగర సంగమం వరకు ఎన్నో మతాలకు చెందిన ఎన్నెన్నో దేవాలయాలు వెలిసినాయి. అన్నిటిని మించి ఈ నదీ తీరంలోని శ్రీశైలం నుండి ఘంటసాల వరకుగల అనేక ప్రదేశాలు బౌద్ధమతానికి నిలయాలు.

లాంగురస్ అభిప్రాయాన్ని అనుసరించి పురాతనపు రోజులలో కృషానది చాలా పొడవుగా ఉండేది అంతేగాక సంవత్సరం అన్ని ఋతువులలో సముద్రం వరకు సుళువుగా నౌకా యానం జరుగుతుండేది కృష్ణానది దిగువ భాగంలోని గోలి, చేజెర్ల, అమరావతి, జగ్గయ్యపేట, ఘంటసాల, గుమ్మడిదురు, భట్టిప్రోలు బౌద్ధ విహారాలకు యీనది ద్వారా రాకపోకలు జరుగుతుండేవి

కృష్ణానదిని గ్రీకులు "మైసోలాస్" అనే పేరుతో వ్యవహరిస్తుండే వారు. ఆ విధంగా యీ డెల్టా ప్రాంతం మైసోలాగా ప్రసిద్ధి చెందింది. మైసోసిస్ చాలా దూరతీర ప్రదేశమని. "ముసైన్స్" యిక్కడ ఎక్కువ పరిమాణంలో తయారుచేసే వారని టాలమీ పెరిఫిస్ నుడివాడు. కృష్ణానది ముఖద్వారంనుండి యిక్కడి ప్రజలు ఇండోనేషియా వెళ్ళి పట్టణాలను, నగరాలను నిర్మించారు.

పశ్చిమ కనుమలలోని మహాబలేశ్వర్ సమీపంలో సైకత పర్వతాల నుండి కృష్ణానది ఉద్భవించింది. సతారా సమీపంలో వేణి అనే ఉపనది కృష్ణలో లీనమవుతుంది. తత్ఫలితంగా అక్కడ యిది కృష్ణవేణిగా వ్యవహరించ బడుతున్నది. గంగాపురం సమీపంలో భీమానది అనే మరో ఉపనది యిందులో కలుస్తుంది. దత్తాత్రేయ దేవాలయానికి యిది ప్రసిద్ధిచెందింది. చంద్రభాగంగా వ్యవహరించబడే భీమానది తీరంలోనే విటోబా పేరుతో పండరిపురం ఉన్నది.

కృష్ణవేణినది రాయచూరు జిల్లామార్గంగా ప్రవహిస్తూ తాళికోట సమీపంనుండి వెళ్తుంది. ఇక్కడే 1565 లో విజయనగర సామ్రాజ్య పతనానికి దారి తీసిన మహాఘోర సంగ్రామం జరిగింది. భారతదేశంలోని పవిత్రమైన నదులలో ఒకటైన తుంగభద్ర సంగం వద్ద కృష్ణలో విలీనమవుతుంది. తుంగభద్రా నది కూడ చరిత్రాత్మకమైనది. ప్రసిద్ధమైన హంపి, ఆనెగొంది, అలంపురం యీ నదీ తీరంలోనే ఉన్నాయి. ఆ తర్వాత మాలపహారి, భావనాసి ఉపనదులు కృష్ణలో కలుస్తాయి. పరిపూర్ణమైన కృష్ణానది శ్రీశైలం వద్ద శ్రీ మల్లికార్జున స్వామి చరణ సన్నిధిలో ప్రవహిస్తూ ముందుకు వెళ్తుంది. నందికొండ గ్రామం సమీపంనుండి వెళ్తుంది ఇది. తూర్పున బహుళార్థసాధకమైన నాగార్జునసాగర్ ప్రాజెక్టు యిక్కడే ఉంది. ప్రముఖ బ్రాహ్మణిక, బౌద్ధదేవాలయాల సరసన ప్రవహిస్తూ విజయవాడ చేరుకుంటుంది. ఇక్కడ సర్ ఆర్థర్ కాటన్ ఆనకట్ట నిర్మించారు. 775 మైళ్ళ ప్రయాణం తర్వాత ఆంధ్రుల పురాతన రాజధాని అయిన శ్రీకాకుళం చేరుకుంటుంది ఈ నది. అక్కడి నుండి హంసల దీవి వద్ద బంగాళా మహాసముద్రంలో తదాత్మ్యం చెందుతుంది. తిరిగి యిక్కడ కూడ కృష్ణ విగ్రహం ఉంది.

కృషానది పోయిన పొడుగునా చరిత్రను సృష్టించింది. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రుల సాహితీ సంస్కృతులకు ఆలవాలమైంది ఈ నది. ★

సీరియల్ :

గృహిణి

పిలకా గణపతి శాస్త్రి

జరిగిన కథ

పార్థసారథికి నాటకాలపిచ్చి రాఘవ నాట్యమండలిద్వారా నాటకాలు వేస్తూండేవాడు

ఏలూరునుండి హీరోయిన్ సరోజతోకలసి మద్రాస్ వెళ్ళి సరాదాగా కాలంగడిపి పార్థసారథి తిరిగి యిల్లుచేరుకున్నాడు జబ్బుతోవున్న పార్థసారథి భార్య విజయలక్ష్మిని పరామర్శించడానికి వచ్చిన కృష్ణమూర్తి ఏ విధంగానైన సరోజ మోసాన్నిగూర్చి పార్థసారథికిచెప్పి విజయలక్ష్మి కాపురం నిలబెట్టాలనుకున్నాడు కృష్ణమూర్తి మాటలను పార్థసారథి లెక్కచేయలేదు విజయలక్ష్మి అన్నీ ఆలోచించి ఎలాగో బాధ భరించి ఊరుకొనడమే మంచిదని తీర్మానించుకొంది. పార్థసారథి ఏలూరులో నాటకం వేయడానికి వెళ్ళాడు రెండురోజుల తరువాత మిగిలిన బృందంవారు వచ్చారు కాని సరోజ రాలేదు పదిగంటల కోచ్‌లో రావచ్చని నాటకం మొదలుపెట్టారు.

అప్పటికప్పుడే రాత్రితొమ్మిదిన్నర కావచ్చింది సరస్వతీ మహల్ హాలు నిండా జనం కిటకిట లాడిపోతున్నారు చోటు చాలక కొందరు హాలులో ఇరువైపుల వరసగా నిలబడ్డారు ప్రేక్షకుల సంభాషణ ధ్వని క్రమ క్రమంగా ఒక పెద్ద ఘోషలా వినబడింది కిళ్ళీలు, సోడాలు, ఇంకా ఇతర తినుబండారాలు అమ్మేవాళ్ల కేకలు ఆ హోరులో స్పష్టాస్పష్టంగా వినిపించాయి.

సరోజ రాకమీద ఆశకొద్దీ రాఘవ, పార్థసారథి కృష్ణ తులాభారం పది గంటలయిన తరవాత ప్రారంభించాలని నిశ్చయించుకున్నారు. అయితే ప్రదర్శనానికి కావలిసిన హంగులన్నీ తొమ్మిదిన్నరికే అమర్చుకున్నారు. ప్రథమాంకంలో ప్రవేశించే నారదుడు, మహేంద్రుడు మొదలయిన వారందరు, తమ తమ వేషాలతో సిద్ధంగా నిలుచున్నారు. అలాగ ఒక పావుగంటసేపు ఏవిధమయిన గొడవ లేకుండా నిమ్మకి నీరెత్తినట్టు గడిచిపోయింది

ఆ తరవాత చిట్ట చివరి తరగతిలోనించి నెమ్మది నెమ్మదిగా ఈలలు చప్పట్లు బయలుదేరాయి క్రమ క్రమంగా అవి హాలులో నలువైపుల వ్యాపించాయి. మరి కొన్ని క్షణాలలోనే హాలు హాలంతా ఈలలతోను, చప్పట్లతోను భోరుమని మారుమ్రోగింది! ఆ గొడవ క్రమ క్రమంగా మితిమీరిపోయిందేగాని కొంచెమయినా శాంతించలేదు! ఆపైన గుప్త తొందర తొందరగా పార్థసారథిని సమీపించి ఇక నాటకం ప్రారంభించక తప్పదని తొందర పెట్టాడు. లేకపోతే నేలమీద కుర్చున్న జనం అల్లరి మరింతగా పెచ్చు పెరిగిపోగలదని హెచ్చరించాడు. పార్థసారథికిక నాటకం మొదలుపెట్టక తప్పలేదు. అనుకున్నట్టు కాక కృష్ణ తులాభారం పావుతక్కువ పదికే ప్రారంభమయింది.

నటీ నటులందరు తెర వెనక నిలిచి ముక్త కంఠాలతో ఆలాపించిన నాంది ప్రార్థన గేయంతో హాలులో గొడవంతా అయిదారు క్షణాలలో శాంతించింది. 'రాఘవ నాట్యకళా మండలికీ జయ్! రాఘవ నాట్యకళా మండలికీ జయ్! అన్న నటీ నటుల పెనుకేకలతో నెమ్మది నెమ్మదిగా తెర పైకి లేచింది. మొదటి అంకంలో మొదటి రంగంలో ఉన్నదంతా నారదమౌని స్వగతమే. రాఘవ పాటలు, పద్యాలు క్రమ క్రమంగా ప్రేక్షకుల నుర్రూతలూగించాయి. ఇంద్ర వేషం వేసిన వెంకయ్య, శచీదేవి వేషం వేసిన చిట్టెమ్మకూడా మొత్తం మీద చక్కగానే రక్తి కట్టించారు బృహస్పతి వేషధారి తన భాగం అంత బాగా అభినయించలేక, పారం అప్పజెప్పినట్టు నటించాడు. అయితే మిగిలినవారందరి శక్తి సామర్థ్యాలవల్ల మొత్తం మీద మొదటి అంకం ప్రేక్షకుల అభినందన లందుకొన్నది.

అప్పటికప్పుడే రాత్రి పదకొండు కావచ్చింది గుప్త ఒగర్చుకుంటూ వచ్చి తెరవెనకాల నిమిషమొక యుగంగా నిరీక్షిస్తున్న పార్థసారథితో పదిగంటల కోచ్‌లోకూడా సరోజ రాలేదని చెప్పాడు! అప్పటికే అతడు ఇక ఆమె రాదని నిరాశ చేసుకున్నాడు. కానున్నదేదో కాక మానదన్న గుండె నిబ్బరతో నాటకానికి కావలసిన ఏర్పాటులన్నీ ఏకాగ్ర దృష్టితో సమకూరుస్తున్నాడు. వెనువెంటనే వెళ్ళి సత్యభామ వేషానికి సిద్ధంగా ఉండవలసినదని పూర్ణని హెచ్చరించాడు మొట్ట మొదటినించి ఆమె మిత్రవింద వేషమే వేసింది. ఆమెకు ఆ నాటకంలో కొన్ని కొన్ని సంభాషణలకన్న ఎక్కువ భాగం లేదు పూర్ణ అంతకు మునుపు ఎన్నడు సరదాకయినా సత్యభామ వేషం వెయ్యలేదు. అధమం కొన్ని గంటలు ముందుగానయినా హెచ్చరించి ఉంటే అవసరాన్ని బట్టి ఎలాగో అలాగ అంగీకరించి ఉండేది. అందుచేత అంతే నిలుచున్న పాటుగా ఆ వేషం వేసి ఒప్పించడం తనవల్ల పడదని నిష్కర్షగా చెప్పివేసింది. కాని తెర వెనకాల నిలబడి సర్వవిధాల సాయపడగలమని చెప్పి, నలుగురు కాదుకూడదని బలవంత పెట్టిన తరవాత కాదనలేక అంగీకరించింది

మరి కొంతసేపటికి రెండవ అంకంలో రెండవ రంగం ప్రారంభమయింది వట్టి విగ్రహ పుష్టిని బట్టిచూస్తే పూర్ణ సత్యవేషానికన్నివిధాల అమరినట్టుగానే కనబడింది. కాని కృష్ణవేషధారి పార్థసారథితో సంభాషణలలో తెర వెనకాలనించి తిన్నగా మాటలందుకోలేక అనుక్షణము తడబడింది. అంతే కాదు! ఆమెలో సరోజ అభినయ చాతుర్యంకాని, చలాకీతనం

కాని ఏ కోశాన స్ఫురించలేదు! అలాగలాగ ఒక అరగంట గడిచిన తరవాత అంతకుమునుపు రంగస్థలంమీద సరోజ సత్యభామ వేషం ప్రత్యక్షంగా తిలకించిన ప్రేక్షకులు కొందరు ఆమె అసలు వ్యక్తి కాదని విస్పష్టంగా గ్రహించివేశారు అదేగాక పూర్ణ నటన క్రమ క్రమంగా తెచ్చిపెట్టుకున్నట్టుగా కొంత ఎబ్బెట్టుగా కూడా కనబడింది మరికొన్ని క్షణాలలోనే సత్యభామ వేషం వేసిన నటి సరోజకాదన్న వార్త ఆ నోట ఆ నోటపడి హాలులో అంతటా కార్చిచ్చులా వ్యాపించింది

మరికొంత సేపటికి 'సరోజ! సరోజ! సరోజ రావాలి!' అన్న కేకలు నాలుగయిదు హాలు మధ్యనించి గట్టిగా వినిపించాయి ఇంకా కొన్ని క్షణాలలో ఆ కేకలతో సరస్వతీ మహలు హాలంతా హోరెత్తి పోయింది! అయినా పార్థసారథి పూర్ణ, వెంకటనారాయణ. మరి కొన్ని నిమిషాలవరకు ఎంతో ఓరిమి వహించి ఎక్కడా చెక్కు చెదరకుండా అలాగే తమ నటన కొనసాగించారు క్రమక్రమంగా వారి సంభాషణ వారికే వినబడని పరిస్థితి ఏర్పడింది! నాలుగయిదు రాళ్ళు, రటిపళ్ళ తొక్కలు కాళ్ళదగ్గర పడ్డాయి! అంతలోనే ఇంకొకరాయి ఎగిరివచ్చి పార్థసారథి కాలికి గట్టిగా తగిలింది! దానితో అతడు మరి లాభంలేదని గ్రహించి వెనక నిలబడిన వారిని వెంటనే తెర దించి వెయ్యవలసినదని సన్నని గొంతుతో హెచ్చరించాడు.

తెర వాలిపోగానే పార్థసారథి ఒక కుర్చీలో కూలబడి తల చేత్తో పట్టుకుని కూర్చున్నాడు పూర్ణ, వెంకటనారాయణ మొదలయిన వారా పరిస్థితి కెంతో ఖిన్నులై మరింతగా దిగాలుపడిపోయారు! ఆ సమయంలో పార్థసారథికిక ఏమి చెయ్యడానికి పాలు పోలేదు! అంతలోనే తిరిగి హాలలో ఈలలు చప్పట్లు మరింతగా విజృంభించాయి! ఆ రణగొణ ధ్వని భరించలేక పార్థసారథి చెవులు రెండు వేళ్ళతో గట్టిగా మూసుకున్నాడు. అదే సమయంలో నారద వేషంతో రాఘవ అక్కడికి వచ్చాడు. అతనిని చూడగానే పార్థసారథికి తిరిగి ప్రాణం లేచివచ్చినట్టనిపించింది!

'ఇప్పుడేమి చేదాం రాఘవా! నువ్వేదో ధైర్యం చెబుతున్నావుగాని, నాకు నిన్నటినుంచి చిట్టచివరి కిదంతా యిలా జరుగుతుందని భయంగానే ఉంది!'

'అదే నాకూ ఏమి తోచడం లేదయ్యా! సరోజ ఇలాగ కొంప ముంచివేస్తుందని కలలో కూడా అనుకోలేదు!'

తిరిగి హాలులో నించి ఉప్పెన లాగ పెద్దగోల చెలరేగింది స్టేజీమీదికి రాళ్ళవాన ప్రారంభమయింది వేళ్లు చెవులలో నించి తీసివేసినా పార్థసారథికి రాఘవ మాటలు తిన్నగా వినిపించలేదు! దుస్సహమయిన మానసిక వ్యథతో ఉసూరుమని నిట్టూర్చి విపరీతమయిన నైరాశ్యంతో తన అభిప్రాయం వెల్లడించాడు

'వెంటనే వెళ్ళి సరోజ రావడానికి వీలుపడలేదని చెబుదాము! పూర్ణకు ఆవేషం కొత్త కనక కొంత ఆదరంతో అభిమానించి, నాటకం కొసకంటా పూర్తి కానీయ వలసిందని అడుగుదాము, ఒప్పుగుంటే ఒప్పుగుంటారు! లేకపోతే నాటకం కట్టిపెట్టివేదాము! ఏమంటావు!'



కాని రాఘవ చప్పరించి వేశాడు.

'అబ్బాయి! నేనొకమాట చెబుతాను! విను! పూర్ణ ఆ మాత్రం మాట దక్కించక పోతుందా అని నేను చాలాచాలా ఆశించాను! కాని ఏమీ లాభం లేదు! వాళ్ళింక ఆ అమ్మాయిని స్టేజీమీద అడుగుపెట్టనివ్వరు! లేనిపోని గోల తప్ప దీనివల్ల ఏమి లాభంలేదు! మనకిది మాట దక్కించే ఆలోచన కాదు! ఆ పైన నీయిష్టం!'

'అయితే ఇక సరోజ రాలేదని చెప్పి నాటకం ఆపివేదామా?'

పార్థసారథి కుర్చీలోనించి లేవబోయాడు. అంతలోనే గుప్త వగర్చుకుంటూ అతని దగ్గిరికి వచ్చాడు

'మీ పేర అర్జంట్ టెలిగ్రామ్ వచ్చింది పార్థసారథిగారు!'

'ఎంత సేపయింది వచ్చి?'

సుమారొక పావుగంటకన్న ఎక్కువ అయిఉండదు! నా కేరాఫ్‌తో మాఇంటికి వచ్చిందిట! ఇప్పుడే మా నౌఖరు ఇక్కడికి వచ్చి ఇచ్చి వెళ్ళాడు'

ఆ మాట లంటూనే గుప్త ఆ టెలిగ్రాం పార్థసారథి చేతి కందించాడు. వణుకుతున్న వేళ్ళతో అతడు దానికవరు చించి తొందరగా చదవడం మొదలు పెట్టాడు. రాఘవ కూడా అతని పక్కనే నిలబడి, దానిలో ఏమున్నదో అని ఎంతో ఆత్రంగా పరిశీలించాడు అది సరోజ మద్రాస్‌నించి పంపించిన టెలిగ్రాం! అత్యవసరమయిన తొందరపని వచ్చిపడినందువల్ల ఆ నాటకానికి రాలేక పోయినందుకు మన్నించక తప్పదని దాని సారాంశం.

చిరునామా జాగ్రత్తగా పరీక్షిస్తే 'కెరాఫ్, గోల్డెన్‌లాడ్జి, మౌంట్ రోడ్, మద్రాసు–2' అని మాత్రమే కనిపించింది. ఆపైన టెలిగ్రాం కింద సరోజ సంతకం తప్ప మరి దానిలో వేరే వివరాలేవి లేవు!

పార్థసారథి క్షణంలో తిరిగి కొంచెం ధైర్యం కలిగింది. మెరుపులా ఒక కొత్త ఉపాయం స్ఫురించింది! వెంటనే అది గుప్తకి, రాఘవకి అతి సంగ్రహంగా వివరించాడు. అప్పటి పరిస్థితులలో అంతకన్నా మరి మార్గాంతరం లేదని వారిద్దరు దాని కంగీకరించి తలలూగించారు. తిరిగి చెవులు గింగురుమనేటట్టు హాలులోనించి చప్పట్లహోరు కేకలతో కలిసి చెలరేగింది. ఇక కానున్నదేదో కాకమానదని పార్థసారథి గుండెధైర్యం చిక్కబట్టుకుని వెంటనే తెర ఎత్తవలసినదని వెంకటనారాయణతో చెప్పాడు. అది పైకి లేవగానే స్టేజిమీద అడుగుపెట్టాడు. ఒక చిన్నరాయి ఎగిరివచ్చి రప్పుమని అతని గుండెకి తగిలి నేలమీద పడింది!

అయినా పార్థసారథి ఎక్కడ చెక్కుచెదరలేదు! ముకుళిత హస్తాలతో అత్యంత వినయంతో ప్రేక్షకుల సమక్షంలో నిలుచున్నాడు. గొడవ తగ్గినదని గమనించి, అకస్మాత్తుగా వచ్చిన జ్వరంవల్ల సరోజ ఆ నాటకంలో పాల్గొనలేకపోయినందుకు మన్నించవలసినదని వేడుకున్నాడు. త్వరలోనే ఆమె ఆరోగ్యం పూర్తిగా కుదుటబడగలదని విన్నవించి, నాటకం తిరిగి అదేహాలులో నవంబరు 6వ తేదీనాడు ప్రదర్శించడానికనుమతించవలసిందని ప్రార్థించాడు. అంతమంది సహృదయులకు ఆశాభంగం కలిగించినందుకు తానెంతో కించపడుతున్నట్టు వెల్లడించాడు.

దానిమీద ఆ హాలులో అక్కడక్కడ నలుగురయిదుగురేదో సణిగినట్టు మాత్రమే వినబడింది. అంతేగాని పెద్ద, చిన్న తరగతులలో ప్రేక్షకులెవ్వరు ఆ ప్రార్థన కడ్డుచెప్పలేదు. ఆపైన గుప్తకూడా వారి సమక్షంలో నిలబడి తలవని తలంపుగా అకస్మాత్తుగా వచ్చిన ఈ అవాంతరం మన్నించవలసినదని ప్రార్థించాడు. ఆ నాటకం టిక్కెట్లన్ని పై నాటకానికికూడా చెల్లగలవని హామి ఇచ్చాడు.

అతడింకా తన ప్రసంగం ముగించకుండానే వెనక తరగతులలో ప్రేక్షకులు కొందరులేచి, పార్థసారథి, రాఘవ, జానకి, పద్యాలు, పాటలు పాడాలని కోరారు. ఆమాత్రం మర్యాదతోనయినా బయటపడినందుకు పార్థసారథి సంతోషించి, వెంటనే వారి ప్రార్థనకంగీకరించి పద్యాలు చదవడం ప్రారంభించాడు. ప్రేక్షకులందరు అది నిమ్మకినీరెత్తినట్టు నిశ్శబ్దంగా విన్నారు. అదేవిధంగా రాఘవ, జానకి తమ పాటల కచేరీలు జరిపారు. జానకి పాడుతూంటే హాలులో పిల్లికూతలు కొన్ని వినిపించాయిగాని మొత్తంమీద అట్టే గందరగోళమేది జరగకుండా ఆ కార్యక్రమం పరిసమాప్తమయింది. ఆ పైన ప్రేక్షకులలో సుమారు యాభై మంది మరి తిరిగి రావడానికి వీలుపడదని చెప్పి తమ టిక్కెట్ల సొమ్ము వాపసు తీసుకున్నారు. కృష్ణతులాభారం కంట్రాక్టు వ్యవహారం అట్టే నష్టం రాకుండా ఆ విధంగా నయినా పరిణమించడం గుడ్డిలో మెల్లఅనుకుని గుప్త కొంతవరకు సమాధానపడ్డాడు.

నాటకానికి వచ్చిన నేల తరగతి మోటుమనుష్యులు కొంతమంది రౌడీలతో కలిసి ఇష్టం వచ్చినట్టు అల్లరి చేస్తారేమోనని అతడెంతో భయపడ్డాడు. పైగా వచ్చిన ప్రేక్షకులందరు తమ సొమ్ము వెంటనే వాపసు తీసుకుంటారేమో అని కూడా ఆందోళనపడ్డాడు. కాని సుమారు యాభై మందికన్న ఎక్కువ జనం సొమ్ము వాపసు కోరలేదు. పార్థసారథి ప్రార్థన విని పరిస్థితి గ్రహించుకుని మారు మాటాడక చల్లగా ఇళ్లకు వెళ్లిపోయారు.

గుప్తకి నాటకాల కంట్రాక్టులొక్కటే ప్రధానవ్యాపారంకాదు. ఇంకా పెద్ద బట్టలకొట్టు ఒకటి బాగా లాభసాటిగా నడుస్తున్నది సరదాకోసమే అప్పుడప్పుడు నాటకాల కంట్రాక్టులు తీసుకుంటూ వుంటాడు. అందుచేత ఆ స్వల్పనష్టానికి అతడంతగా బాధ పడలేదు నవంబరు 6వ తేదీనాడు తిరిగి నాటకం ఆడినప్పుడు ఆ కొద్దినష్టం కూడా తేలికగా కూడవేసుకోవచ్చునని సమాధానపడ్డాడు. కాని ఎంతో జాగ్రత్తగా ఏర్పాటుచేసిన కృష్ణతులాభారం ఆ విధంగా అస్తవ్యస్తంగా తయారయి నలుగురిలోను నవ్వులపాలయినానని అతని కెంతయినా మనస్తాపం కలిగింది. నానా తంటాలుపడి నటీనటులందరిని కూడగట్టుకునివచ్చి చిట్టచివరికావిధంగా తలవంపులపాలయిన పార్థసారథిమీద కొంచెం జాలి కలిగింది. తలవనితలంపుగా వచ్చిన ఇబ్బందుల కెవ్వరేమి చెయ్యగలరని సరిపుచ్చుకున్నాడు. పోనీ ముందు ప్రదర్శనమయినా మాట దక్కించకపోదాఅని మనసారా ఆశించాడు. అదేవిధమయిన సానుభూతితో పార్థసారథితో ప్రసంగించి అతని కొంకొంత ఓదార్పు కలిగించాడు.

అయినా పార్థసారథికి ఆ నాటక ప్రదర్శనం అంతా ఒక భయంకరమయిన పీడకలలా గుండెమీద కూర్చుంది. దుస్సహమయిన మానసిక వ్యధవల్ల తెల్లవారేవేళ కూడా అతనికి ఎవ్వరి ముఖము చూడబుద్ధిపుట్టలేదు! దుప్పటి ముసుగుపెట్టుకుని అలాగే పరుపుమీద పడుకున్నాడు. సామాన్యంగా నటులెవ్వరు నాటకాల కంతగా శ్రద్ధపెట్టరు. అందరిని కూడగట్టుకుని అన్ని సారులు రిహార్సలు జరపరు! బాగా రాటు దేరిన నటులు అలవాటుని బట్టి కొట్టుకుపోతారు. కాని పార్థసారథి ఎడతెగని ముందుచూపుతో ప్రతి స్వల్ప విషయానికి ఎంతో జాగ్రత్తపడ్డాడు. ఈసారి నాటకానికని సరికొత్త కిరీటాలు, బాహుపురులు, మొదలయిన వస్తువులేకాక రంగురంగుల వింత దీపాలుకూడా కొన్ని కొన్నాడు. చిట్టచివరికవన్నీ ఎందుకూ కొరగాక నలుగురిలోను నవ్వులపాలయ్యాడు.

ప్రత్యేకించి అతడు సరోజమీద ఎంతయినా ఆశ పెట్టుకున్నాడు. అటువంటి మనిషి సమయానికి రాలేదు సరిగదా హఠాత్తుగా ఏదో పని వచ్చిందని చెప్పి మదరాసు వెళ్లి కూర్చుంది. ఎంతగా తల బద్దలుకొట్టుకున్నా, సరోజ అంత విలువున్న పాటుగా చెన్నపట్టణం వెళ్లిపోవడానికేమి కారణమో అతనికి బోధపడలేదు. ఆ సమయంలో అతనికి తాను ఏలూరు వెళ్లిననాడే వెంకటకృష్ణయ్య వచ్చినట్టు రాఘవ చెప్పిన సంగతి తటాలున జ్ఞాపకం వచ్చింది. బహుశ ఆమె మేనమామతో కలిసి మద్రాస

వెళ్లి ఉండవచ్చునని అనుమానించాడు అయితే టెలిగ్రామ్ సరోజ పేర ఎందుకు వచ్చింది? వెంకటకృష్ణయ్య తన సంతకంతో ఎందుకు పంపించలేదు? ఎంతగా ఆలోచించినా అతనికుచితమయిన ప్రతి సమాధానమేది దొరకలేదు. ఆ విధమయిన ఎడతెగని మథనతో అలిసిన పార్థసారథికి మరికొంత సేపటికి రవంత కలత నిద్ర పట్టింది

ఆ మరునాడు తెల్లవారిన తరవాత మిగిలిన నటీనటులందరు రాఘవతో కలిసి తిరుగు ప్రయాణసన్నాహాలారంభించారు. ఆ గందరగోళంతో పార్థసారథికి మెళుకువవచ్చింది. నెమ్మదిగా లేచి పెట్టెబేడ సర్దుకోవడం మొదలుపెట్టాడు. ఆ సమయంలో వెంటనే మదరాసు వెళ్లిపోయి, సరోజసంగతి ఆరా తియ్యాలన్న ఆలోచన అతని మనస్సులో ఒక మెరుపులా దూసుకుపోయింది. కాని తమాయించుకున్నాడు. తొందరపడి కాళ్లు విరగదొక్కుకోవడంవల్ల ప్రయోజనమేమి ఉండదని నిర్ణయించుకున్నాడు. అదీగాక సరోజ అంత అకస్మాత్తుగా మద్రాసు వెళ్లడానికేమి కారణమో అతని కింతవరకు తిన్నగా బోధపడలేదు. కనక వెంటనే ఇంటికి తిరిగివెళ్లి రంగనాయకితో ఒకసారి మాట్లాడడం మంచిదని ఆలోచించాడు. ఆ తరవాతే తన ముందు కార్యక్రమం నిర్ణయించుకోవాలని, సంకల్పించుకున్నాడు. తొందర తొందరగా సామానులన్ని సర్దుకుని తిన్నగా ఇంటికి ఒయలుదేరాడు.

గుప్త స్టేషనుకి వచ్చి రాబోయే అయిదవ తేదీనాడైనా నాటకం మాట దక్కించకపోతే ఇక ఆ ఊర్లో నలుగురిలోను తల ఎత్తుకుని తిరగడమే కష్టమని పార్థసారథితో తన గోడు వెళ్లబోసుకున్నాడు. దానికేమాత్రము భయపడవలసిన అవసరం లేదని నచ్చజెప్పిన తరవాత నటీనటులందరిని ఎంతో మర్యాదగా వీడ్కొని వెళ్లిపోయాడు. గతరాత్రి సరోజ రాకపోయినందుకు గుప్త పెద్ద రభస లేవదీయగలడేమో అని పార్థసారథి ఎతయినా కంగారుపడ్డాడు। పాపం అతడు పల్లెత్తుమాటయినా అనలేదు సరికదా, తన పరిస్థితి అర్థం చేసుకుని ఎంతో సానుభూతితో ప్రసంగించాడు. అందుచేత పార్థసారథికి అతని మీద మరింతగా అభిమానం కలిగింది. ముందు ప్రదర్శనమయినా ఏ విధమయిన అడ్డంకులు లేకుండా నడిపించి అతనికేకాక తమ మండలికి కూడా మాట దక్కించాలని మనస్ఫూర్తిగా నిశ్చయించుకున్నాడు

ఆవేళ నటీనటులందరు తిరిగి ఇళ్లకు చేరుకునేసరికి ఇంచుమించుగా మధ్యాహ్నం ఒంటిగంట అయింది. ఏలూరులో జరిగిన దుస్సంఘటనలవల్లనయితేనేమి, తలవంపులవల్లనయితేనేమి, ప్రయాణం బడలికవల్లనయితేనేమి, వారెవ్వరి ముఖాలలోను రవంతయినా ఉల్లాసరేఖ పొడకట్టలేదు. ఇక పార్థసారథిమాట వేరుగా చెప్పనక్కర లేదు. స్టేషన్‌లో నటీనటులందరిని అదరాబాదరాగా తోడ్కొని తొందరతొందరగా ఇంటికి వెళ్లిపోయాడు.

అతని విపరీత దైన్యవైఖరి గమనించి విజయలక్ష్మి రవంత విస్తుపోయింది. స్నానాదులు ముగించుకుని, భోజనంచేసి నిద్రపోయిలేచిన తరవాత కూడా అతనిలో రవంతయినా మార్పు కనబడలేదు।

'అలాగున్నారేమిటి ? ఒంట్లోగాని బాగాలేదా?'

విజయలక్ష్మి ఎంతో ఆత్రంగా అడిగింది.

'బాగాలేకేం' విక్షేపంలాగున్నాను। ప్రయాణం బడలికవల్ల నీ కలాగ కనిపిస్తున్నానేమో!'

పార్థసారథి యథాలాభంగా సమాధానం చెప్పాడు. ఆ తరవాత తనంతటతానే నాటకం ప్రస్తావన ప్రారంభించి, ఏలూరులో జరిగిన వ్యవహారం చాలా సంగ్రహంగా చెప్పి సరోజ హఠాత్తుగా మద్రాసు వెళ్లిపోయిన సంగతి చల్లగా బయటపెట్టాడు అయినా విజయలక్ష్మి ఆమెనొక పల్లెత్తుమాటయిన అనలేదు। పైగా ఏవైనా తొందరపనివల్ల అలాగ అకస్మాత్తుగ పట్టణం వెళ్లివుండవచ్చునని సమర్థించింది

పార్థసారథి మనస్సులో 'ఆమె అంత తొందరగా ఎందుకు వెళ్లిందా? అన్న మథన అలా చెలరేగుతున్నది. ఏలూరులో జరిగిన గొడవలన్ని ఏకరువుపెట్టి సరోజపేర ఒక ఉత్తరం రాసి, వెంటనే అది పోస్టులో వేయించాడు ఆ లేఖలో ఉట్టిపడుతున్న ఆత్మీయతతో వ్యక్తీకరించిన తన మనోవ్యథ గ్రహించుకుని ఆమె త్వరలోనే తిరిగిరాగలదని ఆశించాడు. అది వీలుపడకపోతే అధమం వెంటనే తిరుగుటపాలోనయినా ప్రతి సమాధానం పంపించి తీరగలదని నిశ్చయించుకున్నాడు.

ఆపైన అతనికిక ఒక్కక్షణమయినా ఇంటిదగ్గర కాలు నిలవలేదు. వెంటనే రాఘవ దగ్గిరికివెళ్లి నాటకం మాటల సందర్భంలో తన మనోవ్యథ వెళ్లబోసుకున్నాడు. అలాగ అయిదారు నిమిషాలు గడిచినా అతడేమీ ప్రతిసమాధానం చెప్పలేదు। నెమ్మదిగా ఒక సిగరెట్టు ముట్టించాడు. (సశేషం)

చైతన్యమూర్తులు



డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్
(జననం: 5, సెప్టెంబర్, 1888)

డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ తిరుత్తణిలో జన్మించారు మద్రాసు క్రైస్తవ కళాశాలలో విద్యాభ్యాసం చేశారు. మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాల, రాజమండ్రి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలలో తత్వశాస్త్రం అధ్యాపకులుగానూ, మైసూరు విశ్వ విద్యాలయం, కలకత్తా విశ్వ విద్యాలయాలలో తత్త్వ శాస్త్రం ఆచార్యులుగానూ, ఆంధ్ర విశ్వ విద్యాలయం, బెనారసు హిందూ విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షులుగానూ పనిచేశారు. ఆయన బ్రిటిష్ అకాడమీ విశిష్ట సభ్యుడు ఇట్టి గౌరవం పొందిన ఏకైక భారతీయుడాయన భారత విశ్వ విద్యాలయాల సంఘం అధ్యక్షులుగా వ్యవహరించారు. "యునెస్కో"లో భారత ప్రతినిధి వర్గానికి అనేక పర్యాయాలు నాయకత్వం వహించారు రష్యాలో భారత రాయబారిగా పనిచేశారు మొదటి భారత ఉప రాష్ట్రపతిగా, తరువాత రాష్ట్రపతిగా వున్నారు. అత్యున్నత గౌరవ బిరుదం "భారత రత్న" బిరుదాంచితులు. పెక్కు విశ్వ విద్యాలయాలనుంచి గౌరవ డాక్టరేట్లు పొందారు. "భారతీయ తత్త్వ శాస్త్రం", "హిందూ జీవన దృక్పథం" యిత్యాది అనేక ఉద్గ్రంథాలు రచించారు. —— ఇవి రాధాకృష్ణ పండితుని గురించి మనకులభించే కొన్ని వివరాలు. ఇట్టి వివరాలు, ఒకరి జీవిత విశేషాలను వెల్లడించడానికి తోడ్పడవచ్చు కాగా ఈ వివరాలు డా॥ రాధాకృష్ణన్ మహోజ్వల జీవితాన్ని సమగ్రంగా చిత్రించవు

శతేషు జాయతే శూరః
సహస్రేషు చ పండితః
వక్తా దశ సహస్రేషు
దాతా భవతి వా నవా

ప్రతీ వంద మందిలోనూ ఒక శూరుడు జన్మిస్తాడు. ప్రతి వెయ్యి మందిలోనూ ఒక పండితుడూ, ప్రతి పదివేల మందిలోనూ ఒక వక్త జన్మిస్తారు కాని దాత ఎవ్వరైనా జన్మిస్తారో లేదో తెలియదు.

రాధాకృష్ణన్ శూరుడు – మేధావి ఆయన శూరుడు ఆయన గొప్ప పండితుడు. మహా వక్త మీదు మిక్కిలి ఆయన ఉదారుడైన దాత. విజ్ఞానాన్నీ, వివేకాన్నీ పంచిపెట్టిన వదాన్యుడు.

రాధాకృష్ణన్ వక్తృత్వము, వాగ్ఝరి హిమాలయమునుంచి ప్రవహిస్తున్న పవిత్ర గంగా ప్రవాహంవలె నిర్మలమైనది ప్రశాంతమైనది. తత్వ శాస్త్రాన్ని మథించిన మహనీయుడాయన ఆయన వాక్కులలో పద్యాత్మకమైన ఉద్వేగం, తాత్త్విక చింతన, కళాత్మకమైన వ్యక్తీకరణ ద్యోతకమవుతాయి.

డా॥ రాధాకృష్ణన్, ప్రాచ్య విజ్ఞాన సంపదను పాశ్చాత్య దేశాలకూ, పాశ్చాత్య విజ్ఞాన విశేషాలను ప్రాచ్య దేశాలకూ అందించిన దాత. ఆయన గొప్ప భాష్యకారుడు. శాస్త్ర విజ్ఞానానికీ, మతానికీ మధ్య ఆయన సఖ్యత, సమన్వయం కుదిర్చారు. భగవద్గీత కానీ, ధర్మ పథం కానీ, ఖురాను కానీ, బైబిలు కానీ, స్పినోజా కానీ, కెంట్ కానీ, స్పెన్సర్ కానీ, బెర్గ్సన్ కానీ– వీటిలో అన్నింటిని గురించీ, అందరిని గురించీ ఆయన సాధికారికంగా చెప్పగలుగుతారు.

రాధాకృష్ణన్ విశ్వ మానవుడు. ప్రపంచ పౌరుడు. ఆఫ్రికా నుంచి చైనా వరకూ, ఇండియా నుంచి ఇంగ్లాండు వరకూ, ఇంగ్లాండు నుంచి అమెరికా వరకూ విద్యా వ్యాప్తికీ, తత్త్వ బోధనకూ, సంస్కృతీ సభ్యతలను వ్యాపింప జేయడం ద్వారా శాంతిని సంస్థాపించడానికి పర్యటనలు జరిపారు

ఆయన పొందిన బిరుదాలూ, ఆయన నిర్వహించిన పదవులూ ఆయనకు భూషణాలు కావు. వాటికి వన్నె తెచ్చిన మహనీయుడాయన.

శిష్టా క్రియా కస్య చిదాత్మ సంస్థా
సంక్రాంతి రన్యస్య విశేషయుక్తా
యస్యోభయం సాధు సశిక్షకాణాం
ధూరి ప్రతిష్ఠాపయితవ్య మేవ

ఒకరు గొప్ప పండితుడు కావచ్చు మరొకరు గొప్ప వ్యాఖ్యాత కావచ్చు కాని గొప్ప పండితుడు, వ్యాఖ్యాత కూడా అయిన వాడే గురు శ్రేష్ఠులలో ఉత్కృష్ట స్థానాన్ని అలంకరించడానికి అర్హుడు.

ఈ నాడు ప్రపంచం, రాధాకృష్ణన్‌ను అట్టి స్థానంలో అలంకరింప జేసింది నేటి ఆదర్శవాద తత్త్వ వేత్తలలో అగ్రగణ్యుడు ఆయన.

గురజాడ అప్పారావు

(జననం :
21 సెప్టెంబరు 1862)



ఆధునిక తెలుగు సాహిత్యంలో గిరీశం పాత్రకు విశిష్టమైన స్థానం ఉంది. తెలుగు ప్రజలలో అంతటి ప్రాచుర్యం సంపాదించిన పాత్ర బహుశః మరొకటి లేదేమో! కన్యా శుల్కం నాటకంలో ఆయన అడుగడుగున కనిపిస్తాడు గురజాడ అప్పారావుగారి రూపకల్పనే యిది ఈ నాటకంద్వారా అప్పారావు గారూ, ఆయన సృష్టించిన గిరీశం ఆంధ్రుల చరిత్రలో చిర స్థాయిగా నిలిచిపోయారు.

సాంప్రదాయ పక్కీలో సృష్టించబడ్డ వ్యక్తి కాదు గిరీశం. ధీరోదాత్తుడూ కాడు, ధీరలలితుడూ కాడు. దుష్యంతుడి లాగానో, శ్రీరాముడిలాగానో కావ్య లక్షణాలుగల నాయకుడు కూడా కాడు. ఒక విధంగా చెప్పాలంటే బడాయి కోరు, ఏ ఎండకా గొడుగు పట్టే వ్యక్తి, స్త్రీలోలుడు ఒకానొక శిథిలమవుతున్న వ్యవస్థకు ప్రతినిధివంటి వాడు గిరీశం అతి సామాన్యమైన వ్యక్తి. మానవునిలో ఉండే సహజమైన బలహీనతలన్నీ ఆయనలో ఉన్నాయి. పాపం! గిరీశం అడు గడుగునా తన స్థానాన్ని నిలుపుకోడానికి ముప్పు తిప్పలు పడాల్సి వచ్చింది. నిత్య జీవితంలో తన కనీస అవసరాలు తీర్చుకోడానికి ఎన్నో నాటకాలు ఆడాల్సి వచ్చింది. శ్రోతలు అతని వాగ్ధాటికి సమ్మోహితు లయ్యేవారు. అతను అందరి సానుభూతినీ పొందాడు తెలుగు పాఠకులకు, నాటకాల ప్రేక్షకులకు రక్త మాంసాలుగల వ్యక్తికన్నా మించి యితడు వాస్తవ రూపంగా గోచరిస్తాడు వారికి సన్నిహితులైన బంధువుల కన్నా అతి సన్నిహితుడు అయినాడు.

సాంఘికమైన యితివృత్తంతో నాటకాలు వ్రాసిన ప్రముఖ గ్రీక్ హాస్య రచయిత అరిస్టోఫాన్స్ మార్గంలో అప్పారావుగారు కన్యా శుల్కం రచించారు. ఎథెన్స్ స్త్రీలలోగల అవినీతిని ఎగతాళిచేస్తూ విమర్శించిన రీతిగా అప్పారావుగారు నాటి సమాజంలో అమలులో ఉన్న కన్యాశుల్కాన్ని గూర్చి విమర్శిస్తూ "కన్యా శుల్కం" నాటకాన్ని రచించారు. "సాంఘిక ప్రహసనాలలో కన్యా శుల్కం తలమానిక మైనదని" సుప్రసిద్ధ విమర్శకుడు, డా॥ కట్టమంచి రామలింగారెడ్డిగారు వ్యాఖ్యానించారు

"క్లిష్టమైన సాంఘిక పరిస్థితులను కల్పించే ఆధునిక జీవితాన్ని నాటక రచయితలు విస్మరించారని" అప్పారావుగారు విచారం ప్రకటించారు హానికరమైన విషయాలను ఎత్తిచూపుతూ నైతిక స్థాయిని పెంపొందించడాన్ని ప్రోత్సహించే సాహిత్యం అవసరమని ఆయన భావించారు.

ఇతి వృత్తం, శైలి రెండూ నవ్యతగలవే ఎన్నుకున్నారు ఆధునిక వచన రచనతో వ్యవహారిక భాషలో విశాఖపట్నం ప్రాంతపు యాసతో కూడిన సంభాషణలను చొప్పించారు

అసంఖ్యాకమైన గ్రంథాలు వ్రాసినందుకు అప్పారావుగారు గొప్పవారు కాలేదు. అమూల్యమైన గ్రంథాన్ని వ్రాసి సరికొత్త రచనా విధానానికి మార్గ మేర్పరచారు. ఆయన మూడు నాటకాలు వ్రాశారు అందులో రెండు అసంపూర్తిగా ఉన్నాయి. ఆయన కవితలు 100 పేజీలుకూడ లేవు. ఆయన రచించిన చిన్న కథలు డజనుకు మించిలేవు. ఆయన సాహిత్యంలోని అన్ని రంగాలలో నూతనత్వాన్ని ప్రవేశ పెట్టారు.

కావ్యరచనలో కూడ పాతపద్ధతులకు ఆయన స్వస్తి చెప్పారు. అతిసామాన్యంగా కులాసాగా పాడుకునే విధంగా "ముత్యాలసరాల" ను తీర్చిదిద్దారు. శోకరసప్రధానమైన ఆయన "పూర్ణమ్మ" ఆయనకు కవిగా శాశ్వత ఖ్యాతి నిచ్చింది. పూర్ణమ్మ ఒక యువతి విషాదగాథ. వయస్సులో తనకు తాతలాంటి ముదుసలిని నవయవ్వనవతి అయిన కన్య వివాహం చేసుకొని భరించలేక ఆత్మహత్యకు తలపడిన యువతి పూర్ణమ్మ.

అప్పారావుగారు శారీరికంగా చాలా బలహీనులు. 53 సంవత్సరాల జీవితకాలంలో ఎన్నడూ 90 పౌండ్ల బరువుకు మించి లేరు. ఆయన తరచుగా ఉదరవ్యాధి, నరాల బలహీన వ్యాధులకు గురి అయ్యేవారు. శారీరికంగా బలహీనంగానే ఉన్నా అలసట అనేది ఎరుగనివాడు.

ఆయన ఉదారస్వభావం గలవారు. తన 'లవణరాజు' కథలో ఆయన తన అభిప్రాయాలను ప్రకటించారు."మంచి చెడ్డలు మనుజులందున ఎంచి చూడగ రెండు కులములు మంచి అన్నది మాల అయితే మాలనే అగుదున్" అన్నారు.

భూలోకంలోనే స్వర్గాన్ని నిర్మించుకోవాలనే ఉదాత్తమైన భావాన్ని వ్యక్తంచేశారు.

"ఎల్లలోకము ఒక యిల్లై
వర్ణభేదములెల్ల కల్లై
భేదమెరుగని ప్రేమబంధము
వేడుకలు కురియా
మతములన్నియు మాసిపోవును
జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును
అంత స్వర్గ సుఖంబులన్నవి
అవని విలసిల్లున్"

దేశభక్తికి ఆయనొక కొత్త స్ఫూర్తి నిచ్చారు.

"దేశమంటే మట్టి కాదోయ్
దేశ మంటే మనుషులోయ్


... .

దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా
వట్టి మాటలు కట్టిపెట్టోయ్
గట్టి మేల్ తలపెట్టవోయ్

... ...

దేశాభిమానం నాకు కదని
వట్టి గొప్పలు చెప్పకోయ్
పూని యేదైనాను ఒక మేల్
కూర్చి జనులకు చూపవోయ్

అర్థవిహీనమైన వేర్పాటు ధోరణులలో శ్వాసం లేని కవి ఆయన. ప్రాంతీయ భౌగోళిక దురభిమానంతో దేశసేవ పనికి రాదనీ, సర్వమానవ సౌభ్రాతృత్వాలతో మానవ జాతినంతటినీ ప్రేమించాలనీ ఆయన ఉద్బోధించారు.



గాడిచర్ల హరి సర్వోత్తమ రావు
(జననం: 14 సెప్టెంబరు, 1883)

గాంధీజీ పిలుపునందుకొని అసంఖ్యాకమైన ప్రజలు స్వాతంత్ర్యోద్యమంలోనికి పరుగులెత్తారు. బ్రిటిష్ పాలకులు విధించిన కారాగార శిక్షలను ఆనందంతో అనుభవించారు. జనబాహుళ్యంలో ఈ విధమైన రాజకీయ చైతన్యం వెల్లివిరయ డానికి చాలా కాలం పూర్వమే, తెలుగు మాసపత్రిక "స్వరాజ్య" ముఖ్య సంపాదకులు విదేశపాలకుల ఆగ్రహానికి గురిఅయి శిక్షకు లోనయ్యారు. ఆంధ్రలో మొట్టమొదటి ఖైదీ అయిన గౌరవం ఆయనకు దక్కింది. ఆ విశిష్ట వ్యక్తియే శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావు గారు. 1908 లోనే ఆయన "ఆంధ్రతిలక్"గా కీర్తించబడినారు.

మద్రాసురాష్ట్రంలోని తిరునల్వేలిలో అమాయకులైన జన సమూహంపై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ అమానుష సంఘటనకు బ్రిటిష్ పాలకులను విమర్శించిన ఫలితంగా రావు గారికి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించబడింది. ఆ రోజుల్లో జైళ్ళలో పరిస్థితి చాలా దారుణంగా వుండేది రాజకీయ ఖైదీలకు తరువాతి కాలంలో వలె ప్రత్యేక సదుపాయాలు వుండేవికావు హంతకుల మధ్య, చోరుల మధ్య గడపవలసి రావడంవల్ల ఆ మూడు సంవత్సరాలలో ఆయన ఎంతో మానసిక క్షోభను అనుభవించవలసి వచ్చింది.

హరిసర్వోత్తమరావు గారు విద్యార్థి దశలోనే దేశసేవకు అంకితులయ్యారు. ప్రజలను విద్యావంతులను, చైతన్యవంతులను చేయడాన్ని ఆయన ఉత్తమ దేశసేవగా పరిగణించారు. తెలుగులో విజ్ఞాన దాయకమైన గ్రంథాలను ప్రచురించే ఉద్దేశంతో 1906 వ సంవత్సరంలో విజ్ఞాన చంద్రిక గ్రంథమండలి స్థాపించబడి ది. కొమర్రాజు లక్ష్మణరావుగారు దీనికి ముఖ్య సంపాదకులుగా వుండేవారు సర్వోత్తమరావు గారు కార్యదర్శులలో ఒకరు. తామెర్ రచించిన "అబ్రహాం లింకన్" అనే గ్రంథాన్ని సర్వోత్తమరావు గారు అనువదించి మండలి తొలి ప్రచురణగా ప్రకటించారు.

వందేమాతరం ఉద్యమం సందర్భంలో రాజమండ్రిలో విద్యార్థులకు నాయకత్వం వహించిన ఫలితంగా ప్రభుత్వ విద్యా సంస్థల్లోకానీ, ఎయిడెడ్ విద్యా సంస్థల్లోకానీ ఉద్యోగానికి అనర్హుడుగా ప్రకటిస్తూ ప్రభుత్వం సర్వోత్తమ రావు గారిపై ఆంక్షవిధించింది 1907 లో చేసిన ఈ ఉత్తర్వును 30 సంవత్స రాల తరువాత 1937 లో రద్దుపరిచారు. ఈ 30 సంవత్సరాలలోనూ, ఆ తరువాత కూడా ఆయన చేసిన ఉద్యోగం నిస్వార్థ ప్రజా సేవయే.

అనిబెసెంట్ స్థాపించిన హోంరూల్ లీగ్‌కు సర్వోత్తమ రావుగారు రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. స్వరాజ్య పార్టీతో కూడా ఆయనకు సంబంధం వుండేది. ఆంధ్ర కాంగ్రెసు కమిటీ కార్యదర్శిగా వున్నారు. మద్రాసు శాసనమండలి సభ్యుడిగా, ఆంధ్రవిశ్వ విద్యాలయం సెనేటు సభ్యుడిగా ప్రజాసేవ రంగం లోనూ, విద్యారంగంలోనూ కృషి చేశారు. ఆంధ్ర మహాసభ అధ్యక్షుల్నుగా ఆంధ్రోద్యమంలో ప్రముఖపాత్ర నిర్వహించారు వేసవి రాజకీయ పాఠశాలల ప్రిన్సిపాలుగా, అధ్యాపకులుగా ప్రజానీకంలో చైతన్యం కలిగించడానికి దోహదంచేశారు.

రాజకీయ రంగంలో వలెనే అనేక యితర క్షేత్రాలలోకూడా సర్వోత్తమరావుగారి సేవలు శ్లాఘనీయమైనవి. విజ్ఞాన చంద్రిక గ్రంథమండలిలో ఆయన మంచి రచయితగా పేరు తెచ్చుకున్నారు కొమర్రాజు లక్ష్మణరావుగారు తెలుగులో ప్రకటించిన విజ్ఞాన సర్వస్వాన్ని, తరువాత తెలుగు భాషాసమితి ప్రచురించిన సంపుటాలనూ ఆయన రచనలు అలంకరించాయి పెక్కు సాహిత్య గ్రంథాలను ఆయన రచించారు.

హరి సర్వోత్తమరావుగారు పత్రికా రచయిత కూడా. ఆయన "ఆంధ్రపత్రిక" తొలి సంపాదకులు ఇంగ్లీషు వారపత్రిక

"నేషనలిస్ట్" కు సంపాదకత్వం వహించారు. ఇంకా పెక్కు యితర పత్రికలకు సంపాదకత్వం వహించారు. కొన్నిటిని విర్వహించారు.

సహకార విధానంలో రావుగారికి అచంచలమైన విశ్వాసం వుండేది. దక్షిణ భారత సహకార బీమా సంఘం ఏర్పడడానికి ఆయన ముఖ్యకారకులు. పంచాయతీరాజ్య వ్యవస్థను ఆయన గాఢంగా అభిమానించారు. ఉపాధ్యాయుల సమస్యలపట్ల అమితమైన శ్రద్ధ కనబరిచారు. అనేక విద్యార్థి మహాసభలకు రావుగారు హాజరై ప్రసంగాలు చేశారు. ఆంధ్ర రాష్ట్ర జర్నలిస్టుల సంఘానికి ఆయన అధ్యక్షులు కూడా. నాటక కళా పరిషత్తు ఉపాధ్యక్షులుగా కూడా వ్యవహరించారు. వ్యవసాయం, పశుపోషణ, కార్మిక రంగం, పరిశ్రమలు, మహిళా సంక్షేమం ఒకటేమిటి రావుగారి సేవాభాగ్యాన్ని నోచుకోనని సాంఘిక క్షేత్రం, ప్రజాహిత రంగం ఏదివుందని. ఆయన సంగీత ప్రియులు. తన కూతురు, అల్లుడు సంగీతకారులైనందుకు ఆయనకు ఎంతో ఆనందంగా వుండేది.

సర్వోత్తమరావుగారు వయోజన విద్య, గ్రంథాలయోద్యమాలలో అగ్రగణ్యులు. ఈ ఉద్యమాలలో ఆయన తాదాత్మ్యం పొందారు. ఎనభయ్యోపడిలో పడిన రావుగారు ఒకసారి అనంతపురంలో ఒక వయోజన విద్యా కేంద్రంలో ప్రసంగించడం జరిగింది. వయోవృద్ధులైన రావుగారు అంతగా పరిశ్రమించడం చూసిన ఆయన మిత్రులు, అంత పెద్ద వయస్సులో ఆ విధంగా పరిశ్రమించడం మంచిది కాదనీ, విశ్రాంతి తీసుకోవాలనీ సలహా యిచ్చారు. దానికి హరి సర్వోత్తమరావుగారు ఎంతో బాధపడుతూ "మీకు నేను చావాలనివుందా ? నేను ఈ విధంగా పరిశ్రమించనట్లయితే నేను చనిపోయినట్లే లెక్క. ఈ సేవే నాకు ఔషధం, దానికి అన్నీనూ" అన్నారు. రావుగారు గొప్ప సేవా పరాయణులు. ధీరోదాత్తులు. యిటువంటి వారి తెగ యిప్పుడు శీఘ్రగతిని అంతరిస్తున్నదేమో !

సర్వోత్తమరావుగారు తాము చేసిన త్యాగాలకూ, సేవలకూ ప్రతిఫలంగా దేనినీ ఆశించలేదు. దేశానికి, దేశప్రజలకూ తన జీవితాంతంవరకూ నిస్వార్థంగా సేవచేయడానికై యువకునిగా తాను గైకొన్న ప్రతిజ్ఞను ఆసాంతం త్రికరణశుద్ధిగా పాలించారాయన. ఈ సంతృప్తితోనే ఆయన తుది నిశ్వాసం అనంత వాయువులలో లీనమైంది.

కీ. శే. పండిత సత్వలేకర్

సుప్రసిద్ధ వేద పండితుడు శ్రీ శ్రీపాదదామోదర సత్వలేకర్ (101 సంవత్సరాలు) బుల్సార్ జిల్లాలోని పర్ది (గుజరాత్) లో జూలై 31 వ తేదీన స్వర్గస్థులయ్యారు.

కీ. శే. వి. రామారావు

రాష్ట్ర శాసనసభ కాంగ్రెసు సభ్యుడు శ్రీ వి. రామారావు (53) జూలై 31వ తేదీన హైదరాబాదులో నిర్యాణంజెందారు. స్వర్గీయ శ్రీ రామారావు 1953 వ సంవత్సరం నుంచి బొలారం కంటోన్మెంటు నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈయన ప్రముఖ హరిజన నాయకుడు.


(18వ పుట నుండి)

కేంద్రం హామీ

కేంద్ర ప్రభుత్వం యీ అనావృష్టి పరిస్థితుల తీవ్ర పరిమాణాలను గుర్తించి సహాయక కార్యక్రమాలను సత్వరంగా చేపట్టాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరడం హర్షించదగిన విషయం. అనావృష్టికి గురిఅయిన ప్రాంతాలలో మంచినీటి సౌకర్యం కల్పించడానికి వీలుగా బోరింగ్ బావుల త్రవ్వకానికి అవసరమైన రిగ్గులను దిగుమతి చేసుకునేందుకు అనుమతించడం జరుగుతుందని కేంద్ర ఆహార మంత్రి శ్రీ జగ్జీవన్‌రామ్ హామీ యిచ్చారు. అనావృష్టి ప్రాంతాలలో నీటి సరఫరాకు శాశ్వత పరిష్కారానికి యిది దోహదం చేస్తుంది. కరువు పరిస్థితులను శాశ్వత ప్రాతిపదికపై పరిష్కరించడానికి సహాయపడే విధంగా సహాయక కార్యక్రమాలను అమలు జరపాలి. మరోవిధంగా చెప్పాలంటే ప్రస్తుతం ఉన్న మంచినీటి బావులను యింకాలోతుగా త్రవ్వడమేగాక కరువు ప్రాంతాలలో గొట్టం బావులను నిర్మించి, రైతులు పంపుసెట్లు కొనుగోలు చేయడానికి బుణాలు మంజూరు చేసి విద్యుచ్ఛక్తి సరఫరాచేసే విధంగా సహాయక కార్యక్రమాలను అమలుజరపాలి.

ఆరిపోని ఆశాదీపం

—యర్రమిల్లి చలపతిరావు శ్రీవత్సవ



చీకటి ముసిరి లోకం గుండెల్లో
కాలమేఘం గర్జిస్తుంటే
జీవితపు కాళరాత్రిలో గగనతలాన్ని
కారుమబ్బులావరించి పెనుతుఫాను వీస్తుంటే
ఆశలు పరచుకొన్న ప్రపంచప్రాంగణంలో
విశ్వాత్మ వెలిగించుకొన్న చిన్నదీపం
చావు బ్రతుకుల మధ్య తల్లడిల్లి పోతోంది.
యుగాంతాల నిశ్శబ్ద నిశీధుల్లో
దిగంతాల అంచులో మెరిసే విశ్వమానవుని
కోరికల చిన్నదీపాలు కోటానుకోట్లు తారకలై
మెరుస్తూనే వున్నాయి నేటికీ
భయద హేమంత నిశీథాల్లో ఈ నాటికీ.
యుగాలు గడిచినా లోకం గుండెల్లో
చీకట్లు ముసరడం మానలేదు
జగాలుమారినా ప్రకృతిలో
రుతుక్రమం మారలేదు
ఏ రుతువు నిత్య వసంతమై
విశ్వాత్మకు హాయిగూర్చింది ?
ఏ కాలం బాధలూ భయాలూ లేక
విశ్వాత్మ హాయిగా నిదురించింది ?
విశ్వాత్మ సుదీర్ఘ జీవనయామినిలో
తుఫాను రాని రోజు లేదు
నిత్యం తుఫాను వస్తూనే వుంది
తెల్లవార్లూ అల్లరి చేస్తూనే వుంది
దీపం ఆరిపోతుందేమోనని పాపం ! విశ్వాత్మ
దిగులు పడుతూనే వుంది.
వేకువ లేని నితాంత నిశ్శబ్ద నిశీధిలో
మేలుకొని మహోదయం కోసం ఎదురుచూసే లోకంకళ్ళు
ఎరబడి తూర్పు దిక్కున
ప్రాతస్సంధ్యారోచిస్సులు అలముకొన్నాయి.
ఎక్కడో మంగళతూర్యారవాల సన్నాయి సంగీతం
హాయిగా వినిపించసాగింది
గాఢ నిద్రలోంచి విశ్వాత్మ మేల్కొని
రెండు కళ్లూ విప్పిచూసింది
ఎదురుగా తాను వెలిగించుకొన్న చిన్నిదీపం
మినుకు మినుకు మంటూ వెలుగుతూనేవుంది.

పండుగలూ పర్వదినాలూ

దేవి నవరాత్రులు

కమలా త్రివేణి

ఆశ్వీజ, కార్తీకమాసాలను శరదృతువు అంటాము ఆశ్వీజ శుద్ధ పాఢ్యమి మొదలు నవమి వరకు దేవీ నవరాత్రులు జరుపుకుంటాము. ఈ తొమ్మిది రాత్రిలూ దేవికి పవిత్రమైనవి

సర్వాంతర్యామియైన శక్తియే దేవి ఆమె మిక్కిలి ప్రకాశమానమైనది. ఆమె రూపముల వలెనే ఆమె నామములు కూడా అనేకములు. పార్వతి, అంబిక, జగద్ధాత్రి, అన్నపూర్ణ, దుర్గ, సింహరధి, భీమాదేవి—ఇవన్నీ దేవి నామాంతరములే.

విధ్వంసం పూర్తిగా వినాశకారికాదు. అది నూతన సృష్టికి నాంది మాత్రమే దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ గావించే శక్తిగా ఈ నవరాత్రులలో దేవిని ఆరాధిస్తాము. ఈ తొమ్మిది రోజులూ మార్కండేయ పురాణంలోని దుర్గా సప్తశతిని పారాయణం చేస్తాము. దీనిలో 700 శ్లోకాలున్నాయి మహామాయ యొక్క విభిన్న రూపాలనూ, అవతారాలనూ ఇది వర్ణిస్తుంది దుర్గా సప్తశతి పారాయణం వల్ల చెడు నివృత్తి అవుతుందనీ, దురదృష్టం తొలగిపోతుందనీ ప్రతీతి.

మహా ప్రళయం వచ్చి విశ్వమంతా జలమయమైపోయినప్పుడు శ్రీ మహావిష్ణువు నాభి నుంచి బ్రహ్మ ఉద్భవించాడు విష్ణువు చెవిలోని మలినం నుంచి మధు, కైటభులనే యిద్దరు రాక్షసులు జన్మించారు. మహామాయ, యోగనిద్ర రూపంలో విష్ణువు చక్షువులలో ఆవాసం ఏర్పర్చుకున్నది రాక్షసుల హింసకు తాళలేక బ్రహ్మ మహామాయ దేవిని ప్రార్థించాడు. దేవి విష్ణువును మేల్కొల్పగా ఆయన రాక్షసులతో అయిదువేల సంవత్సరాలపాటు పోరాడాడు. అయినప్పటికీ వారిని ఆయన సంహరింపలేకపోయాడు అంతట మహామాయ రంగంలోనికి ప్రవేశించింది. ఆమె శక్తికి లోనయిన రాక్షసులు తమతో వీరోచితంగా పోరాడినందుకు ప్రతిఫలంగా తమ నుంచి ఏదైనా వరం కోరుకొనమని విష్ణువును కోరారు. విష్ణువు వారిని చనిపొమ్మని అడిగాడు. అయితే రాక్షసులు తమను రక్షించుకొనదలచి ఒక ఎత్తు వేశారు నిర్జలమైన ప్రదేశంలో తమను వధించమని వారు విష్ణువును కోరారు. సృష్టి అంతా జలమయమైనప్పుడు నిర్జల ప్రదేశం ఎక్కడ వుంటుందని వారనుకున్నారు. కాని భగవంతుడు మనుష్యులకంటే, రాక్షసులకంటే తెలివిగలవాడు. విష్ణుమూర్తి ఆ రాక్షసులను తన కటి భాగంలో వుంచుకొని సంహరించాడు ఈ విజయానికి కారకురాలైన దేవిని మహాకాళి అంటాము

మహిషాసురుడనే రాక్షసుడుండేవాడు. అతడు సమస్త లోకాలనూ, దేవతలనూ జయించాడు. దేవతలు స్వర్గలోకం నుంచి నిరాశ్రయులై వెళ్ళిపోవలసి వచ్చింది.

వారు తమ రక్షణకై బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను అభ్యర్థించారు. వారి నుంచి తీక్షణమైన కాంతి ప్రసరించి మహాలక్ష్మిగా రూపొందింది ఆమెయే మహిషాసురమర్దని

దేవి మూడవ అవతారం మహాసరస్వతి. శుంభ, నిశుంభలనే రాక్షసులు దేవతలను జయించారు దేవతలు హిమాలయ పర్వతాలకు వెళ్ళి పార్వతిని ప్రార్థించారు. ఆమె నుంచి మహాసరస్వతి ఉద్భవించింది దేవి రాక్షస సంహారం కావించి దేవతలను కాపాడింది.

యశోదకు జన్మించిన ఆడ శిశువును, దేవకికి జన్మించిన కృష్ణుని స్థానంలో వుంచారు. కంసుడు ఆడశిశువును కాళ్ళు పట్టి పైకి ఎత్తి రాయిపై విసిరి కొట్టాడు. అంతట ఆ శిశువు ఆకాశానికి ఎగిరిపోయి కంసుని వధించడానికి జన్మించినవాడు మరో చోట క్షేమంగా వున్నాడని అతనిని హెచ్చరిస్తుంది. యశోద కూతురు నంద దేవి యొక్క నాలుగవ అవతారం ఆమె ఐదవ అవతారం రక్తదంతిక

నూరు సంవత్సరాల పాటు తీవ్రమైన కరువు కాటకాలు ఏర్పడినవి మునులందరూ దేవిని ప్రార్థించారు దేవి శాంబరిగా అవతరించింది. ఆమె వరప్రసాదంగా పృథ్వి మరల సస్యశ్యామలమైంది. తరువాత దేవి దుర్గరూపం దాల్చి దుర్గముడనే రాక్షసుని తుదముట్టించింది. అరుణుడనే రాక్షసుని అత్యాచారాలు ప్రబలిపోయినప్పుడు దేవి భ్రమరముల సమూహంగా రూపాంతరంజెంది ఆ రాక్షసునీ, అతని బలగాన్నీ హతమార్చింది దేవి తొమ్మిదవ అవతారం చండిక.


దేవీ నవరాత్రులలో దేవిని మొదటి మూడు రోజులూ దుర్గగానూ, మూడవరోజు నుంచి ఆరవ రోజు వరకు లక్ష్మిగాను, ఏడవ రోజు నుంచి తొమ్మిదవ రోజు వరకు సరస్వతిగానూ ఆరాధిస్తాము.

*

జనసంబంధశాఖ నిర్వహించిన

కాశ్మీరు యాత్ర

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జనసంబంధశాఖ ఆధ్వర్యాన ఆగస్టు నెల 10 వ తేదీనుంచి 26 వ తేదీవరకూ కాశ్మీరు యాత్ర నిర్వహించబడింది. యాత్రికులు ఆగ్రా, ఫతేపూర్ సిక్రీ, మధుర, బృందావనం, ఢిల్లీ, శ్రీనగర్, గుల్మార్గు, పహల్గామ్, చండీగర్, భాక్రానంగల్ ఆదిగాగల అనేక ప్రదేశాలను సందర్శించారు. తమ యీ పర్యటనను గూర్చి వారు వ్యక్తీకరించిన అభిప్రాయాలు యీ దిగువ పొందుపరచబడ్డాయి.



ఢిల్లీలో బిర్లా మందిరం వద్ద ఆంధ్రప్రదేశ్ కాశ్మీరు యాత్రా బృందం

పారిశ్రామిక ప్రదేశాలు చూపించాలి

రాష్ట్ర జనసంబంధ శాఖచే నిర్వహించబడ్డ 15 రోజుల ఉత్తర భారతదేశ యాత్ర అనుకున్న మేరకు సఫలీకృత మయింది. ఇటువంటి యాత్రలవల్ల స్వల్ప వ్యవధిలో యాత్రికుల మైన మేము ఎన్నో అనుభవాలు గడించాము. ఇది, ఇతర రాష్ట్రాల ప్రజల సంప్రదాయాలను సదవగాహన చేసుకోడానికి సహకరించింది. భారతదేశాభివృద్ధిని గమనించడానికి యిదొక సదవకాశం.

యాత్రికులకు ప్రముఖ భారీపరిశ్రమలను, ప్రాజెక్టు ప్రాంతాలను ఇతోధికంగా చూపించడానికి ప్రభుత్వం ప్రయత్నించాలి. యాత్రలో జనసంబంధ శాఖోద్యోగులు ప్రదర్శించిన సంయమనం, సహనం, సమయస్ఫూర్తి కొనియాడదగినవి. ఈ కాశ్మీరు యాత్ర వ్యవధిని 15 రోజులనుంచి 21 రోజులకు పొడిగించి, వ్యయం తగ్గించడానికి ప్రయత్నించడం చాలా అవసరం.

టి. చంద్రశేఖరరెడ్డి,
కోశాధికారి, సహకార భూమితనఖాబ్యాంకు, రాయచోటి.

యాత్రలు

మరొక మహదవకాశం

సౌందర్య సంభరితమైన అనేక ప్రదేశాలను సందర్శించడానికి మాకు యీ కాశ్మీరు యాత్ర ఒక మహదవకాశం కలుగజేసింది. అల్ప వ్యవధిలో అనేక అపూర్వమైన అనుభవాలను మేము సముపార్జించుకున్నాము. జయప్రదమైన యీ యాత్రలో జనసంబంధ శాఖాధికారులు అవిరళకృషి చేశారు. వివిధ ప్రాంతాల ప్రజలను కలుసుకుని, వారి సంస్కృతీ సభ్యతలను తెలుసుకోడానికి దోహదంచేసే ఇలాంటి యాత్రలు ప్రజా సౌకర్యార్థం నిర్వహించడం అతిముఖ్యం.

బి. నారాయణరెడ్డి,
ప్రెసిడెంటు, పంచాయతీ సమితి, కొడిగినహళ్లి,
అనంతపురం జిల్లా.

ఆనందోత్సాహాలు కలిగించిన యాత్ర

ఆగస్టు 10 వ తేదీనుంచి 26 వ తేదీవరకూ నిర్వహించిన కాశ్మీరు యాత్రలో పాల్గొన్నవారందరికీ ఆనందం, ఉత్సాహాలు కలిగాయి. చారిత్రక ప్రదేశాలను దర్శించడానికి అనువుగా త్వరలో మరో ప్రాంతానికి యాత్రను ఏర్పాటు చేయవలసిందిగా కోరుచున్నాను. మాకు తోడుగా వచ్చిన ఉద్యోగులు అన్ని విధాల సహాయపడ్డారు. ఇలాంటి చక్కని యాత్రను నిర్వహించినందుకు జనసంబంధ శాఖకు నా హృదయపూర్వకాభినందనలు. యాత్రల కాల వ్యవధిని కొంచెం పెంచవలసిందిగా కోరుచున్నాను.

కె. ఎల్. హనుమంతరావు,
ఇనుప వ్యాపారస్తుడు, విజయవాడ.

తగిన వ్యవధి అవసరం

సతీసమేతంగా నేను కాశ్మీరు యాత్రలో పాల్గొనే అవకాశం కలిగింది. రైలు కంపార్టుమెంటులో తగిన విశ్రాంతి, విశాలం లేక కొంత అసౌకర్యం కలిగింది. ఆగ్రా, మధుర, బృందావనం ఒకే రోజులో సందర్శించడం వల్ల దయాల్‌బాగ్ మొదలైన ముఖ్య స్థలాలను చూడడం కుదరలేదు. ఢిల్లీలో మన ప్రధాని ఇందిరా గాంధీతో ఇంటర్వ్యూ ఏర్పాటు చేసివుంటే బాగుండేది. కాశ్మీరు ప్రకృతిశోభను తిలకించడానికి మూడురోజుల గడువు చాలదు. భోజన సౌకర్య విషయంలో ప్రత్యేకశ్రద్ధ వహించడం అవసరం. ముందుముందు రైల్వే టూరిస్టు కారుకు బదులు స్లీపరు కోచ్‌లు ఏర్పాటు చేయడం సముచితం కాగలదు. వీలైనంతలో ఏ విధమైన లోటుపాట్లు రాకుండా శ్రద్ధ వహించిన ఉద్యోగులు అభినందనీయులు.

వెలగా బసవపూర్ణయ్య,
నర్సాపురం, భద్రాచలం తాలూకా,
ఖమ్మం జిల్లా.

రాళ్ళు నాట్యం చేసిన

రామప్ప దేవాలయం



ఓరుగల్లును రాజధానిగాచేసుకుని విశాలమైన ఆంధ్ర సామ్రాజ్యాన్ని అరివీర భయంకరులై ఏలిన కాకతీయ ప్రభువులు రాజ్య పాలనలోనూ, యుద్ధతంత్రంలోనూ మాత్రమేగాక, లలిత కళల లోనూ గాఢమైన ఆసక్తి గలవారు. వీరి కాలంలో ప్రధానంగా శిల్ప, నృత్యకళలు బహుధా విస్తరిల్లి అభివృద్ధి చెందాయి. కాకతీయుల కాలంలో సుమారు మూడు వందల యాభై ఆలయాలు నిర్మింపబడ్డాయని చెప్తారు. అయితే యిప్పటికి వీటిలో పాతిక దేవాలయాలకన్న ఎక్కువ మిగలలేదు. మిగిలివున్న ఆ కొద్ది ఆలయాలు కూడా అనేక దండయాత్రలకు గురై శిథిలమై తొల్లిటి వైభవాన్ని సహితం గుర్తుపట్ట వీలులేనట్టుగా వున్నాయి.

మధ్యయుగం నాటికి వాస్తుకళ, శిల్పకళ విడిపోయాయి. అంతవరకూ వాస్తుకళలో ఒక భాగంగా వుంటూ ప్రత్యేక ప్రతిపత్తి అంటూ లేకుండావున్న శిల్పకళ క్రమ క్రమంగా ఒక సంపూర్ణ కళగా రూపొందింది. కాకతీయుల కాలంలో అనేక దేవాలయాలు నిర్మింపబడగా అందులో కొన్ని కేవలం శిల్పకళకు ప్రత్యేకించబడ్డాయి పానగల్లు దేవాలయం, రామప్ప ఆలయం, అలాంటివి. అయితే వీటన్నిటిలో మకుటాయమానంగా పేర్కొనదగ్గది రామప్ప దేవాలయం చక్కటి వాస్తు కళగాకాక అద్భుతమైన శిల్ప కళా కేంద్రంగా దీనిని పేర్కొనవచ్చు.


రామప్ప దేవాలయం అద్భుతమైన శిల్పకళా కేంద్రం మాత్రమే కాదు నాట్యకళామ తల్లికి రంగస్థలం కూడా. ఇక్కడ కొన్ని వందల నర్తకీమణులు రాళ్ళలోనుంచి తొంగి చూస్తుంటారు. నాట్యశాస్త్రం యావత్తూ దృశ్యమాన మౌతుందిక్కడ. ప్రతాప రుద్రుని బావమరిది జాయపసేనాని వ్రాసిన నృత్య రత్నావళి అనే నాట్య శాస్త్ర గ్రంథాన్ని ఆధారంగా చేసుకుని యీ ఆలయంలోని నాట్యభంగిమలను చెక్కారట. అందుకే రామప్ప దేవాలయంలో ఒక శిల్పిగాని, ఒక చిత్రకారుడుగాని ఎంతగా మైమరచి ఆనందిస్తాడో ఒక నర్తకి కూడా అదే విధంగా ఆనందిస్తుంది. ఊహా విహంగాలపై సమున్నతమైన కళా పథంలోకి ప్రవేశించి తనను తానుమరిచిపోతుంది.


అంతేకాదు భక్తుడుకూడ అంతటి అలౌకిక ఆనందాన్ని పొందగలడు. ఆధ్యాత్మిక వీచికలతో ఒళ్ళు పులకరించి పరమ శివుని భావనలో తన్మయుడై తననుతనే మరిచిపోగలడు. అందుకే రామప్ప దేవాలయం భక్తగణాన్నీ, శిల్పులనూ, నర్తకులనూ ఆకర్షించి అలరారుతోంది. ఏడు వందల సంవత్సరాలుగా ఆరాధనా కేంద్రంగా, శిల్ప, నృత్య కళలకు సంగమ స్థానంగా వినుతి కెక్కుతూ వస్తోంది

వరంగల్లుకు సుమారు అరవైఅయిదు కిలోమీటర్ల దూరంలో పాలంపేట గ్రామంవుంది. ఇక్కడ చరిత్రాత్మకమైన రామప్ప చెరువు వుంది. కాకతీయుల కాలంలో యిది నిర్మించబడింది. దీనివద్దనే అనేక దేవాలయాలు నిర్మితమైనవి. వీటిలో యీనాటికీ మిగిలివున్నవి నాలుగైదు మాత్రమే. చెరువు గట్టుమీదే శిథిలమై చెల్లాచెదురుగా పడివున్న విగ్రహాలతో శివాలయం ఒకటి వుంది. ఇటీవల, ప్రభుత్వం దీని వద్దనే విశ్రాంతి గృహాన్ని ఒకదానిని నిర్మించింది.

రామప్ప చెరువుకు సుమారు మూడు ఫర్లాంగుల దూరంలో రామప్ప ఆలయంవుంది. కాకతీయుల శిల్పకళాప్రాభవానికి యీ దేవాలయమే మచ్చుతునక. ఈ దేవాలయం క్రీ. శ. 1204లో నిర్మించబడినట్లు యిక్కడవున్న కన్నడ-తెలుగు లిపిలోని శిలా శాసనంద్వారా వెల్లడవుతున్నది. ఒకప్పుడు జాజ్వల్యమానంగా వెలిగిన యీ ప్రాంతమంతా కాలగతిలో కలిసిపోయి కేవలం చరిత్రమాత్రంగానే మిగిలిపోయింది. యీ ఆలయాలే లేకుంటే కాకతీయుల స్మృతి చిహ్నాలుకూడా మనకు మిగిలి వుండకపోను. క్రీ. శ. 1323లో కాకతీయ సామ్రాజ్యం పతనమైపోయినతర్వాత చాలవరకు యిక్కడిశిల్పాలు నాశనంచేయబడ్డాయి. ఓరుగల్లు

నగరంకూడా శిథిలమై నామ మాత్రావశిష్టమైపోయింది. రామప్ప ఆలయప్రాంతం అరణ్యమయమై జనపదాలకు దూరమైపోయింది. ఇటీవలి కాలంలో దీని ప్రాశస్త్యాన్ని గుర్తించి యీ ఆలయాన్ని పురాతత్వ కేంద్రంగా భద్రపరుస్తున్నారు. కళాకారులను, యాత్రికులను ఆకర్షించే విధంగా దీనిని అభివృద్ధి పరుస్తున్నారు.





కాకతీయులుకూడా చాళుక్యుల వలె నక్షత్రరూపంలో ఆలయ నిర్మాణం కావించారు. రామప్ప ఆలయంకూడా యీ మాదిరిదే.


రామప్ప ఆలయ గోపుర నిర్మాణంలో, ఒక విశేషంవుంది. ఆలయమంతా పెద్దపెద్ద రాతిఫలకాలతో నిర్మించినప్పటికీ గోపురం మాత్రం ఇటుకలు, చెక్క సున్నంతో కట్టారు. ఈ ఇటుకలు నీటిలో తేలుతాయి. బరువుతక్కువగా వున్నప్పటికీ గట్టిదనంలో యివి రాతికిఏమాత్రం తీసిపోవు. కాకతీయుల వాస్తు కళాప్రతిభకు, శాస్త్రవిజ్ఞాన వికాసానికి యీ యిటుకలే తార్కాణాలు.

రామప్ప శిల్పాన్ని రెండు ప్రధాన వర్గాలుగా విడదీయవచ్చు. ఒకటి – అమరావతి మొదలైన ప్రాంతాలోవలె శిలాఫలకాలపై చెక్కిన ఫలకశిల్పం. ఈ పద్ధతి ఆలయవాస్తు శాస్త్రంలో ఒకభాగంగా చిరకాలంగా ప్రచారంలో వుంటూవచ్చింది. రెండవది వాస్తుశాస్త్రంలో ఒక భాగంగాగాక సర్వహంగులతోనూ ఒకప్రత్యేక కళగా విడిపోయిన విగ్రహశిల్పం.

ఫలక శిల్పరీతిలో ఆలయం వెలుపలిభాగంలో చుట్టూ కొన్ని వందల నాట్య భంగిమలు చెక్కబడి వున్నాయి. శిల్పంలో ఎక్కువగా పురుషులు కనుపించరు. వాద్యకారులుగాకూడా స్త్రీలే కనిపిస్తారు. ఈ నాట్యశిల్పం అంతా సుమారు ఒక అడుగు వెడల్పులో దేవాలయంచుట్టూ అలంకరణ కళగా అనుసరించబడింది.

ఏనుగులనుకూడా యిదే పద్ధతిలో చుట్టూ చెక్కారు. సశాస్త్రీయమైన యీ నాట్యభంగిమలు జాయప సేనాని నృత్యరత్నావళికి రూపకల్పనలు.

ఆలయానికి మూడు ప్రవేశ ద్వారాలు వున్నాయి. ఒకొక్క ద్వారానికి పైభాగంలో నాలుగేసిచొప్పున మొత్తం పన్నెండు 'బ్రాకెట్స్' వున్నాయి. రామప్ప దేవాలయంలో ప్రత్యేకంగా చెప్పుకోదగ్గ శిల్పాలు యివే. ఈ పన్నెండూ అత్యంత మనోహరమైన, లావణ్యవంతమైన నర్తకీమణుల మూర్తులు. నాలుగైదు అడుగుల ఎత్తుగల యీ విగ్రహాలు ప్రాణసదృశమైన నర్తకీలుగా అనిపిస్తాయి. కాకతీయ శిల్పకళా వైభవానికి రామప్ప మచ్చుతునక అయితే రామప్ప శిల్పంలో యీపన్నెండూ మణిపూసలు. చక్కటి అభినయాన్ని ముఖంలో ద్యోతకంచేస్తూ.



నాజూకుగా శరీరాన్ని ఒంచి, చేతులను ముద్రపట్టి నాట్యశాస్త్రాన్ని విపులీకరించబూనిన గంధర్వాంగనయుగా కనిపిస్తారు. ఈ విగ్రహాలు బాగాపొడుగుగావుండి మరీనాజూకుగా అనిపిస్తాయి. అలంకారాలు అతిగావుండవు. చాలావరకు శరీరం నగ్నంగావుండి ఎక్కడికక్కడ శరీరపు వొంపులు స్పష్టంగా కనిపించి సహజ సౌందర్యాన్ని ప్రకటింప జేసు ంటాయి.


ఆలయం లోపలి భాగంలో స్తంభాల మీద కూడా నాట్య భంగిమలు వున్నాయి స్తంభాలు ఒక ప్రత్యేకతని కలిగివున్నాయి పాలిష్ చేసిన నల్లరాతి స్తంభాలివి అద్దంలాగ నిగనిగలాడుతూ లీలగా మన రూపం కూడా దీనిలో ప్రతిఫలిస్తుంటుంది గర్భాలయం సింహద్వారం వద్ద ద్వారపాలికలు కూడా నాట్య భంగిమల్లోనే నిలిచివున్నారు. ఆ ప్రక్కనే జాలీ పనితనంతో వున్న రాతిగోడల మీద వాద్యకారులు, నర్తకిలు బహు భంగిమల్లో నిలిచి వున్నారు దేవాలయంలో ఎక్కడ చూసినా ఏ మూలకు తిరిగినా నాట్యరూపాలే, నాట్యశాస్త్రమే అంతటా కనిపిస్తుంది

రామాయణ మహాభారత గాధలు చెక్కివున్నప్పటికీ ప్రత్యేకించి నాట్యరూపాలే ప్రధానంగా ఆక్రమించుకుని వున్నాయి. ఇక్కడి వివిధ భూషణాలంకృతమైన నంది విగ్రహం కూడా అతి మనోహరంగా వుంటుంది ఆలయంలో శిధిలంకాగా మిగిలిన విగ్రహాలు బహుకొద్ది కాకతీయుల కాలంలో యింకా ఎక్కువగా యిక్కడ శిల్పం వుండి వుండవచ్చు ఆలయానికి ఉత్తర, దక్షిణ దిశల్లో పై కప్పు కూలిపోయి లోపలకు ప్రవేశించడానికి వీలులేకుండా శిథిలమైపోయిన రెండు చిన్న ఆలయాలు వున్నాయి. విరిగి పడిన స్తంభాలు, రాతిఫలకలు మాత్రమే కనిపిస్తున్నాయిగాని విగ్రహాలు కనిపించడంలేదు విదేశీ దండయాత్రలకు గురై చాలా వరకు శిల్పం నాశనమైపోయింది

కాకతీయులు మతానికీ, లలిత కళలకు ఎనలేని సేవ చేశారనడానికి రామప్ప దేవాలయమే ఒక చక్కటి తార్కాణం వాస్తు కళ కూడా వీరి కాలంలో ఉచ్ఛస్థితిలో వుంది హనుమకొండలోని వెయ్యి స్తంభాల గుడిని చూస్తే ఆ విషయం స్పష్టపడుతుంది వెయ్యి స్తంభాల గుడిలో విగ్రహ శిల్పం బహు తక్కువ. స్తంభాల నిర్మాణ కౌశలం, చెక్కడపు పనితనం ప్రధానంగా కనిపిస్తాయి

సాంఘిక జీవితంలోకి లలిత కళలను ప్రవేశ పెట్టడానికి కాకతీయులు చేసిన సేవ అనుపమానమైనది ఆంధ్రదేశాన్ని ఏలిన ప్రధాన రాజ వంశాలలో కాకతీయ వంశం తృతీయస్థానం ఆక్రమించి రాజకీయంగా ప్రసిద్ధికెక్కడమేగాక నృత్య, శిల్పకళల వికాసానికి ఎనలేని సేవచేసి ఆంధ్ర సంస్కృతీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది.


— చిత్రమూర్తి



క్రీడారంగం

—జైరాజ్

హైదరాబాదులో కొత్త రేసు కోర్సు



మలకపేటలో నూతనంగా నెలకొల్పిన రేసు కోర్సుకు అగస్టు 10 న ప్రారంభోత్సవం చేస్తున్న ముఖ్యమంత్రి

ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి మలకపేటలో రేసు కోర్సుకు ప్రారంభోత్సవం చేశారు. రాష్ట్ర క్రీడారంగంలో ఈ నెల (ఆగస్టు)లో జరిగిన ఒక ప్రధాన సంఘటన యిది. అనేక దశాబ్దాల తరువాత మలకపేట తిరిగి గుర్రపు పందాలకు కేంద్రమైంది.


అవిభాజిత హైద్రాబాదు రాష్ట్రంలో మలకపేట గుర్రపు పందాలకు ప్రధాన కేంద్రంగా వుండేది. ఆరవ నిజాం మీర్ మహబూబ్‌అలీ ఖాన్ గుర్రపు పందాల పట్ల ఎంతో ఆసక్తి ప్రదర్శించేవారు. అంటువ్యాధి ప్రబలినప్పుడు మలకపేటలో గుర్రపు పందాలను మానివేశారు. 1902వ సంవత్సరంలో సికింద్రాబాదులో రేసు కోర్సు ఏర్పాటైంది.

తమ కార్యకలాపాలను విస్తృతీకరించడానికి సికింద్రాబాదులోని ఆవరణ సరిపోదని హైద్రాబాదు రేసు క్లబ్బు అభిప్రాయపడింది. ఈ సమయంలో స్వర్గీయ ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్, మలకపేట రేసు కోర్సును హైద్రాబాదు రేసు క్లబ్బుకు రెండు లక్షల పై చిలుకు మొత్తానికి అప్పగించడానికి నిశ్చయించారు. క్రీడారంగంలో అమిత ఆసక్తిగలవారు కనుకనే నిజాం, రేసు కోర్సును యింత స్వల్ప ధరకు విక్రయించారనీ, 126 ఎకరాల విస్తీర్ణం కలిగిన రేసు కోర్సు మైదానానికి ఒక కోటి రూపాయలకు పైగా విలువ కట్టడం జరిగిందనీ పోలీసు ఇనస్పెక్టరు జనరలూ, హైద్రాబాదు రేసు క్లబ్బు స్టువర్డూ అయిన శ్రీ శివకుమార్‌లాల్ తెలిపారు.

హైద్రాబాదు రేసు క్లబ్బువారు అనేక కార్యక్రమాలు చేపట్టారు. హైద్రాబాదుకు విచ్చేసేందుకై యజమానులకూ, శిక్షకులకూ వారు అనేక ప్రోత్సాహాలు కల్పిస్తున్నారు.

శ్రీ బ్రహ్మానందరెడ్డి, రేసు కోర్సును ప్రారంభిస్తూ రేసులను నిషేధించడానికై ఒక పొరుగు రాష్ట్రం నిశ్చయించడాన్ని గురించి ప్రస్తావించారు. ఈ నిర్ణయాన్ని చాలా సంవత్సరాల క్రితమే తీసుకున్నప్పటికీ దీనికి వ్యతిరేకత బాగా వుండడం వల్ల ఆ ప్రభుత్వం తన నిశ్చయాన్ని అమలు పరచలేకపోయిందని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గుర్రపు పందాలకు ప్రోత్సాహం లభిస్తూ వుండగలదని ఆయన పేర్కొన్నారు.

మద్రాసు, బెంగుళూరు రేసు క్లబ్బుల సీనియర్ స్టూవార్డులు శ్రీ లోకనాథన్, శ్రీ గురుస్వామిగారలు ప్రారంభోత్సవానికి హాజరై తమ శుభాకాంక్షలు తెలియజేశారు.



రేస్ కోర్సు దృశ్యం

ముఖ్యమంత్రి రేసు కోర్సును ప్రారంభించిన మర్నాడు 16 రోజుల హైద్రాబాదు సీజను ప్రారంభమైంది.

హైద్రాబాదు రేసు క్లబ్ సీనియర్ స్టూవర్డు శ్రీ శివరామ ప్రసాద్ మాట్లాడుతూ రేసింగు సువ్యవస్థీకృతమైన వ్యాపారం అని అన్నారు. స్వాతంత్ర్యానంతరం దేశంలో గుర్రాల పెంపకం పరిశ్రమ గణనీయమైన అభివృద్ధిని సాధించిందని ఆయన పేర్కొన్నారు.

టేబిల్ టెన్నిస్

హనుమాన్ వ్యాయామశాల, వై.ఎం.సి.ఏ.ల ఆధ్వర్యంలో జరిగిన టోర్నమెంట్లలో దిలీప్‌రాజ్ సక్సేనా మంచి ఆట ప్రదర్శించాడు. వ్యాయామశాల టోర్నమెంటు ఫైనల్స్‌లో ఆయన మీర్ కాసిమ్‌పై బాగా విజృంభించి ఆడాడు.

బొంబాయిలో జరిగిన పశ్చిమ భారత టోర్నమెంటులో దిలీప్‌రాజ్ గెలుపొందడం మరో విశేషం. అతను అశోక్‌తో కలిసి ఆడి జూనియర్ డబుల్స్ బిరుదాన్ని కూడా సాధించాడు. ఈ టోర్నమెంటులో పురుషుల ఛాంపియన్‌షిప్‌ను జాతీయ ఛాంపియన్ ఫరూక్ భొదాయ్‌జీ గెలుచుకున్నాడు.

ఫుట్‌బాల్

కౌలాలంపూర్‌లో జరిగిన మెరెడెకా ఫుట్‌బాల్ టోర్నమెంటులో భారత జట్టు ఆరవ స్థానం పొందింది. అయితే బర్మాతో జరిగిన పోటీలో 3-1 స్కోరుతో విజయంపొంది భారత జట్టు ఉత్సాహం కలిగించింది. కాని తరువాతి మేచ్‌లలో మన జట్టు విఫలమైంది గత సంవత్సరపు విజేతలైన బర్మాను 3-0 స్కోరుతో ఓడించి మలేషియా మెరెడెకా బిరుదం గెలుచుకున్నది.

హైదరాబాదులో జరుగుతున్న ఎస్ ఏ రహీం ట్రాఫీ ఫుట్‌బాల్ టోర్నమెంటులో హైదరాబాద్ టెలిఫోన్స్ జట్టు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ జట్టుతోనూ, సెంట్రల్ పోలీసు లైన్స్ జట్టు ఆర్టిలరీ సెంటర్ జట్టుతోనూ ఓడిపోవడం గమనించదగినవి.

హాకీ

ఒలంపిక్ హాకీ టోర్నమెంటులో పాలొనే భారత జట్టులోని ఆటగాళ్ళ పేర్లు ప్రకటించారు. పృథిపాల్‌సింగ్ కెప్టెన్‌గానూ, గురుబక్‌సింగ్ జాయింట్ కెప్టెన్‌గానూ ఎన్నికయ్యారు. మన ఆటగాళ్లు ప్రతిభావంతంగా ఆడి ఒలంపిక్ హాకీ ఛాంపియన్‌షిప్‌ను నిలబెట్టుకొనగలరని ఆశిద్దాం.

క్రికెట్

ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు పోటీలలో ఇంగ్లాండు ఎట్టకేలకు ప్రతికక్షలకు సమఉజ్జీ కాగలిగింది. ఆస్ట్రేలియా కౌంటీ మేచ్‌లలో బాగా విఫలమైనప్పటికీ మొదటి టెస్టులో చక్కగా ఆడి ఇంగ్లాండును ఓడించింది. కాని తరువాత జరిగిన మూడు టెస్టులలోనూ ఇంగ్లాండుదే పైచేయిగా వుంది. వారికి విజయావకాశాలు వుండినప్పటికీ వాతావరణ పరిస్థితులు వారికి అనుకూలించలేదు. కాని ఓవల్‌లో జరిగిన చివరి టెస్టులో ఇంగ్లాండు 226 పరుగులతో గెలుపొంది తన ఆధిక్యాన్ని ప్రదర్శించుకున్నది అయితే "రబ్బర్" డ్రా కావడంచేత "ఆషెస్"ను నిలబెట్టుకున్న సంతృప్తిని ఆస్ట్రేలియా పొందింది.

ఉస్మానియా విశ్వవిద్యాలయ స్వర్ణోత్సవం

ఉస్మానియా విశ్వవిద్యాలయం 1917 లో స్థాపించబడి ఆనాటినుండి విద్యావ్యాప్తికి విశేషంగా కృషి చేస్తున్నది. 1948 నుంచి ఈ విశ్వవిద్యాలయం మరింతగా విద్యారంగంలో అమోఘమైన కృషిచేసి అద్భుతమైన ప్రగతిని సాధిస్తున్నది. 1956 లో భాషా ప్రాతిపదికపై రాష్ట్రాల పునర్విభజన జరిగినప్పుడు మహారాష్ట్ర కర్నాటక ప్రాంతాలలోని కళాశాలలు దీనికి అనుబంధంగా వున్నవన్నీ విడిపోవడంతో యీ విశ్వవిద్యాలయం నూతనంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణా ప్రాంతానికి పూర్తిగా అంకితమై విద్యావ్యాప్తికి కృషిచేసే అవకాశం దీనికి లభించింది. పి.యు సి, మూడేళ్ళ డిగ్రీ కోర్సును, సాధారణ విద్యా పథకాన్ని ప్రారంభించాలని రాధాకృష్ణ కమీషన్ చేసిన సిఫారసును అమలు పరచిన విశ్వ విద్యాలయాలలో యావద్భారత దేశంలోనూ యీ విశ్వ విద్యాలయమే మొట్టమొదటిది. పైగా జర్మన్, ఫ్రెంచ్, ఇటాలియన్, రష్యన్ భాషల బోధనా తరగతులను, పత్రికా రంగంలో, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో, లైబ్రరీ సైన్సులో తరగతులను యీ విశ్వ విద్యాలయంలో నడుపుతున్నారు ఈ ఏడాది అక్టోబరు నెలలో యీ విశ్వ విద్యాలయం స్వర్ణోత్సవాన్ని జరుపుకోనున్నది. అక్టోబరు 5 వ తేదీన ఈ స్వర్ణోత్సవానికి రాష్ట్రపతి డా॥ జాకిర్ హుసేన్ ప్రారంభోత్సవం చేస్తారు. వారం రోజులపాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంలో భారతదేశంలో సుప్రసిద్ధులను యీ విశ్వ విద్యాలయం సన్మానించి గౌరవ డాక్టరేటులను వారికి సమర్పిస్తున్నది. పుస్తకాల ప్రదర్శన, సాంస్కృతిక ప్రదర్శనలుకూడా వుంటాయి. ఈ ఉత్సవాల ఆర్థిక సంఘానికి ప్రో-చాన్సలర్ అధ్యక్షులు.

జిల్లాలనుండి

రైతుల ఉపయోగార్థం పవర్‌డ్రిల్ యంత్రాలు

వ్యవసాయ భూములలో రంధ్రపు బావులు త్రవ్వేందుకు ఉపకరించే పవర్ డ్రిల్ యంత్రాలను రైతులకు అందుబాటులో వుంచేందుకు పశ్చిమ గోదావరి జిల్లా అభివృద్ధి మండలివారు యిట్టి యంత్రాలను కొన్నింటిని తెప్పించివుంచారు. అన్ని నేలల్లోనూ 300 అడుగులలోతుకు త్రవ్వగలిగే ఈ యంత్రాలను అద్దెప్రాతి పదికపై రైతులకు అందజేస్తారు. అవసరమున్న రైతులు జిలా కలెకరుకు దరఖాస్తుపెట్టుకొనడంద్వారా ఈ యంత్రాలను పొందవచ్చు.

కడలికి రక్షిత మంచినీటి పథకం


తూ. గో. జిల్లాకుచెందిన కడలిలో ఒకలక్షయిరవై వేల రూపాయల వ్యయంతో కూడుకొన్న రక్షిత మంచినీటి పథకానికి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి శ్రీ తోట రామస్వామి ప్రారంభోత్సవంచేశారు.



హాయత్‌నగర్ బ్లాకులోని అంకుశపూర్ గ్రామంలో గ్రామస్తులతో కరువు పరిస్థితులను గూర్చి చర్చిస్తున్న రెవిన్యూ మంత్రి శ్రీ. వి. బి. రాజు

ఆర్ట్సు కాలేజికి ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం

హైదరాబాద్ జిల్లా, వికారాబాద్‌లో, జిల్లాలో మొట్టమొదటిసారిగా ఏర్పాటు చేయబడిన నూతన ఆర్ట్సు అండ్ సైన్సుకాలేజికి, ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి జూలై 31న ప్రారంభోత్సవంచేశారు. గత ఐదేండ్లలో రైతులనుండి వసూలుచేయ



హాయత్‌నగర్ బ్లాకులోని పెడులవాడ గ్రామములో వర్షాభావంవల్ల ఎండిపోతున్న చెఱువు

బడిన విరాళాలతో ఈ కాలేజి ఏర్పాటుచేసుకొనడం జరిగింది. ప్రవేశంకోరే విద్యార్థులనుండి విధిగా విరాళాలుకోరే విధానాన్ని అనుసరించ కూడదని కాలేజి మేనేజ్‌మెంటు వారికి ముఖ్యమంత్రి హెచ్చరికచేశారు. ఇంతేకాక ఈ కాలేజీలో ఉపాధ్యాయుల నియమించే విషయంలోనూ, విద్యార్థులను చేర్చుకొనే విషయంలోనూ కులమత ప్రసక్తివుండరాదని కూడా ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు.

తిరుమలలో-నీటిని వడబోసే యంత్రానికి ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం

తిరుమల-తిరుపతి దేవస్థానంవారి, తిరుమల నీటి సరఫరా పథకానికిచెందిన నీటిని వడబోసే యంత్రానికి ఆగస్టు 5వ తేదీన ముఖ్య మంత్రి ప్రారంభోత్సవంచేశారు.

నూటికి నూరుపాళ్ళు పంచాయితీ పన్నుల వసూళ్ళు

తూ. గో. జిల్లా, రామచంద్రపురం తాలుకాకుచెందిన ఫోక్సు పేట గ్రామ పంచాయితీలో 1968-69 సంవత్సరానికి సంబంధించిన పన్నులు నూటికి నూరుపాళ్ళు వసూలుచేయడం జరిగింది. జూలై 12వ తేదీకి ఈ పన్నుల వసూళ్ళుపూర్తి చేయబడ్డాయి. దీనితో జిల్లా మొత్తానికి, వర్తమాన సంవత్సరంలో పూర్తి పంచాయితీ పన్నులు వసూలు చేసిన ప్రథమ పంచాయితీగా, ఫోక్సుపేట పంచాయితీ పరిగణింపబడింది. అదే తాలూకాకు చెందిన వీరంపల్లి పంచాయితీ జూలై ఆఖరుకు పూర్తి పన్నులు వసూలుచేసి ద్వితీయ స్థానం ఆక్రమించింది.



ముఖ్యమంత్రి జూలై 27న ప్రారంభోత్సవం చేసిన లంకసాగర్ కుడి కాలువ

పాఠశాల భవనానికి ప్రారంభోత్సవం

80 వేల రూపాయల వ్యయంతో కృష్ణా జిల్లా, ఏలూరు పాడులో నిర్మించిన నూతన ఉన్నత పాఠశాల భవనానికి రాష్ట్ర పంచాయతీరాజ్ అటవీశాఖల మంత్రి శ్రీ తోట రామస్వామి ప్రారంభోత్సవం జరిపారు.

వీరేశ్వరవరంలో జిల్లా పరిషత్ హైస్కూలు భవనంలో సైన్సు లేబొరేటరీ నెలకొల్పేందుకు 72 వేల రూపాయల వ్యయంతో నిర్మించిన క్రొత్త బ్లాకుకు మంత్రి ప్రారంభోత్సవం జరిపారు.

వైకుంఠపురానికి లిఫ్ట్ యిరిగేషన్ పథకం

గుంటూరు జిల్లాలో వైకుంఠపురం, పరిసర గ్రామాలలో 3,000 ఎకరాలకు కృష్ణానదీ జలాలను సరఫరా గావించే వైకుంఠపురం లిఫ్ట్ యిరిగేషన్ పథకానికి యిరిగేషన్ శాఖ మంత్రి శ్రీ శీలం సిద్దారెడ్డి ఆగస్టు 7న ప్రారంభోత్సవం జరిపారు. ఈ పథకానికి ఖర్చు రు. 9.42 లక్షలు.

పంటపాళెంలో కృత్రిమ పశు సంపర్క కేంద్రం

ఆగస్టు 10వ తేదీన శాసన సభ్యులు శ్రీ ఎ. సంజీవరెడ్డి నెల్లూరు జిల్లా పంటపాళెం గ్రామంలో ఒక కృత్రిమ పశు సంపర్క కేంద్రానికి ప్రారంభోత్సవం జరిపారు.

హరిజనుల ఇండ్ల నివేశన స్థలాలకు పట్టాల పంపిణీ

తూర్పు గోదావరి జిల్లా టాటుక్రురులో హరిజన ఇండ్ల నివేశన స్థలాలకు సంబంధించిన 82 పట్టాలను పంచాయతీరాజ్ శాఖా మంత్రి శ్రీ తోట రామస్వామి ఆగస్టు 12న హరిజనులకు పంపిణీ చేశారు. ఈ 82 పట్టాల మొత్తం విస్తీర్ణం 6½ ఎకరాలు.


ఉత్తమ రేడియో రూరల్ ఫోరమ్

పశ్చిమ గోదావరి జిల్లాలో, గణపవరం బ్లాకుకు చెందిన కస్పాపెంటపాడు రేడియో రూరల్ ఫోరమ్ 1963-64 సంవత్సరంలో ఉత్తమ రేడియో రూరల్ ఫోరమ్‌గా నిర్ణయించబడింది. కస్పాపెంటపాడులో ఈ సందర్భంగా ఆగస్టు 7న ప్రత్యేకించి ఏర్పాటు చేసిన ఉత్సవంలో కెనడా ప్రభుత్వం బహూకరించిన రేడియోను, ఏలూరు ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీ బి. ఆర్. వెంకటరామ్ ఉత్తమంగా పరిగణింపబడిన ఈ ఫోరమ్‌కు బహుమతిగా అందజేశారు.

మద్దిపాడు లిఫ్ట్ యిరిగేషన్ పథకానికి ప్రారంభోత్సవం

గుంటూరు జిల్లాలో మద్దిపాడు వద్ద 68 వేల రూపాయలకు అంచనా వేయబడిన లిఫ్టు యిరిగేషన్ పథకానికి రాష్ట్ర ప్రధాన

కార్యదర్శి శ్రీ యం. టి. రాజు ఆగస్టు 9వ తేదీన ప్రారంభో త్సవం జరిపారు. ఈ పథకం గుండ్లకమ్మ నది నుండి 170 ఎకరా లకు నీరు లభింపజేస్తుంది. ఈ సందర్భంలో ప్రసంగిస్తూ ప్రధాన



ప్రారంభోత్సవానంతరం ప్రసంగిస్తున్న రాష్ట్రీ ప్రధాన కార్యదర్శి శ్రీ యం. టి. రాజు

కార్యదర్శి, జిల్లాల ఆర్థికాభివృద్ధికి దోహదంచేసే పథకాలను ప్రజలు చేపట్టేటట్లు ప్రజాశక్తిని సమీకరించే నాయకత్వం గ్రామాలలో సృష్టించేందుకు జిల్లా పరిషత్ అధ్యక్షులు, సమితి ప్రెసిడెంట్లు కృషి చేయాలని ఉద్బోధించారు. సభకు, శాసన మండలి సభ్యులు శ్రీ రొండా నారపరెడ్డి అధ్యక్షత వహించారు.

హవలాగి ప్రసూతి కేంద్రానికి ప్రారంభోత్సవం

అనంతపురం జిల్లా, ఉరవకొండకు దగ్గరగా హవలాగి గ్రామంలో ప్రసూతి కేంద్రానికి మంత్రి శ్రీ పి. వి. నరసింహా రావు జూలై 26 న ప్రారంభోత్సవం జరిపారు.

జూలై 24 న పెనుగొండలో మంత్రి ఒక గ్రామీణ ఆరోగ్య పారిశుధ్య శిబిరానికి కూడా ప్రారంభోత్సవం జరిపారు. రాష్ట్రంలో ఈ రకమైన శిబిరం నిర్వహించడం యిదే మొదటిసారి.


పరిసర గ్రామాల నుంచి తీసుకొనబడిన 200 మందికి (మహిళలతో సహా) ప్రథమ చికిత్స, గ్రామీణ పారిశుధ్యం, అంటువ్యాధుల నివారణ విషయంలో నాలుగు రోజులపాటు ఈ శిబిరంలో శిక్షణ యివ్వబడింది.

మరో 30 వేల ఎకరాలకు నాగార్జునసాగర్ జలాలు

కేంద్ర ఆహార మంత్రి శ్రీ జగ్‌జీవనరాం ఆగస్టు 17న నాగార్జునసాగర్ ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టుకు చెందిన వివిధ అభివృద్ధి విషయాలను ఆయన పరిశీలించారు. ఆయనవెంట కేంద్ర నీటిపారుదలశాఖ మంత్రి డా॥ కె. యల్. రావు, రాష్ట్రీ ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి వున్నారు. కోదాడకు దగ్గరగా నేరేడిచర్ల వద్ద నాగార్జునసాగర్ ఎడమవైపు కాలువ పదవ బ్లాక్‌కు కేంద్ర మంత్రి శ్రీ జగ్‌జీవనరాం నీటిని విడుదల చేశారు. ఈ బ్లాక్ క్రింద దాదాపు 30 వేల ఎకరాలు సాగుకావచ్చు.

కోదాడ వద్ద ఆర్ట్సు అండ్ సైన్సు కాలేజీకి ప్రారంభోత్సవం

ఆగస్టు 17న కోదాడలో కొండపల్లి రాఘవమ్మ రంగారావు ఆర్ట్సు అండ్ సైన్సు కాలేజీకి కేంద్ర ఆహార మంత్రి శ్రీ జగ్‌జీవన్‌రాం ప్రారంభోత్సవం జరిపారు. ఆయన కాలేజీ భవనాలకు శంఖుస్థాపన గావించారు.



కోదాడలో ఆర్ట్సు అండ్ సైన్స్ కాలేజీకి ప్రారంభోత్సవం జరుపుతున్న కేంద్ర మంత్రి శ్రీ జగ్జీవన్‌రాం

సభకు అధ్యక్షత వహించిన ముఖ్యమంత్రి శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి కాలేజీ స్థాపన విషయంలో మూడు లక్షల రూపాయలు విరాళంగా వసూలు చేసినందుకు కార్యకర్తలను అభినందించారు.



జోగిపేటలో మెదక్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు అగస్టు 15న ప్రారంభోత్సవం చేస్తున్న వాణిజ్యశాఖామంత్రి శ్రీ కె. వి. నారాయణరెడ్డి


వివేకానంద విద్యా సమితి తరఫున రాష్ట్ర విద్యామంత్రి శ్రీ పి. వి. నరసింహారావు కేంద్ర ఆహార మంత్రికి స్వాగత పత్రాన్ని సమర్పించారు. సమితి కార్యదర్శి, శాసన సభ్యులైన శ్రీ ఎ. వాసుదేవరావు ఈ సందర్భంలో నివేదిక సమర్పిస్తూ ప్రారంభంలో ఈ కాలేజీలో పి. యు. సి. కోర్సును ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. విద్యార్థులకు హాస్టలు వసతులు కల్పించవలసిందిగా ఆయన ప్రభుత్వాన్ని అర్థించారు.

కర్నూలులో ఆధునిక మత్స్య కేంద్రం

కర్నూలులోని మత్స్య క్షేత్రంలో మత్స్య శాఖ ఆధునిక మత్స్య ఉత్పత్తి కేంద్రాన్ని (హాచరీ) ప్రారంభించింది. భారత దేశంలో యిటువంటి కేంద్రాలలో యిది మొదటిది. చేపల గ్రుడ్లలో 90 శాతం గ్రుడ్లవరకు పిల్లలు చేయడానికి అనువైన పరిస్థితులను ఈ కేంద్రం కల్పిస్తుంది. ఈ కేంద్రంలో వుత్పత్తి అయిన చేప పిల్లలను, గ్రామీణ ప్రాంతాలలో చేపలను పెంచే నిమిత్తం, పంచాయతీలకు సరఫరా చేస్తారు.


సిద్ధిపేటలో మహిళా మండలి ప్రారంభోత్సవం

రెవెన్యూ, పౌరసరఫరాల శాఖా మంత్రి శ్రీ వి. బి. రాజు ఆగస్టు మొదటి తేదీన సిద్ధిపేటలో గీతా మహిళా మండలికి ప్రారంభోత్సవం చేశారు.




సంగారెడ్డిలో గాంధీ శతజయంత్యుత్సవాల సందర్భంగా ఆగస్టు 8న రాష్ట్ర గవర్నరు పునశ్చరణ శిబిరానికి ప్రారంభోత్సవం చేశారు

నగరంలో...



డిప్యూటీ ప్రధాన మంత్రి, శ్రీ మొరార్జీ దేశాయ్ ఆగస్టు 10వ తేదీన హైదరాబాదులో ఆంధ్రమహిళా సభ నర్సుల హాస్టలుకు ప్రారంభోత్సవం చేశారు.



ప్రధాన కార్యదర్శి శ్రీ యం. టి. రాజు ఆగస్టు 2 వ తేదీన సెక్రెటేరియట్‌లో ఉద్యోగుల రిక్రియేషన్ హాలుకు ప్రారంభోత్సవం చేశారు.

ఏక లిపి ఆవశ్యకతను గూర్చి గవర్నరు ఉద్ఘాటన

భారతీయ భాషలన్నిటికీ ఏక లిపిని రూపొందించుకునే రోజు అతిదూరంలో లేదనీ, ఏకలిపిని రూపొందించుకోవడం వల్ల ప్రస్తుతం వున్న ఆయా భాషల లిపులను పరిత్యజిస్తున్నట్టు కాదనీ, ఏక లిపి వల్ల భారతీయ సాహిత్యం బహుధా వికాసమందడానికి, విస్తృతి జెందడానికి అవకాశం వుంటుందనీ రాష్ట్ర గవర్నరు శ్రీ ఖండూభాయ్ దేశాయ్ అన్నారు. సర్వశ్రీ బండారు తమ్మయ్య, శివశంకరస్వామి, పురిపండా అప్పలస్వామి గార్లను అకాడమీ విశిష్టసభ్యులుగా సన్మానిస్తున్న సందర్భంలో సాహిత్య అకాడమీ సారస్వత పరిషత్తులో ఆగష్టు 24 వ ఏర్పాటు చేసిన సభలో ఈ విషయాన్ని గవర్నరు తెలియజేశారు.


శ్రీ లచ్చన్న జన్మదినోత్సవం

హైద్రాబాదులోని గాంధీ భవనంలో ఆగష్టు 18వ తేదీన జరిగిన, రాష్ట్ర శాసనసభ ప్రతిపక్షనాయకుడు శ్రీ గౌతు లచ్చన్న 60వ జన్మదినోత్సవంలో, వెనుకబడిన తరగతుల అభ్యున్నతికై ఆయన చేసిన సేవలను కొనియాడుతు కేంద్ర ఆహార మంత్రి శ్రీ జగ్జీవన్‌రామ్, ముఖ్య మంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి, పార్లమెంటు సభ్యుడు శ్రీ ఎన్. జి. రంగా ప్రసంగించారు.

రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖా మంత్రి శ్రీ అరిగె రామస్వామి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. శాసనసభ్యులు శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య, శ్రీ బి. రత్నసభాపతికూడా శ్రీ లచ్చన్న సేవలను ప్రస్తుతిస్తూ, మాట్లాడారు.

సూపర్ బజారులో బియ్యం అమ్మకం :

సూపర్ బజారు "కల్పలత"లో ఆగష్టు 5 వ తేదీన, ప్రభుత్వం సరఫరా చేసే సన్నబియ్యం విక్రయించే ప్రత్యేక కౌంటరుకు కేంద్ర సహకార శాఖ సహాయ మంత్రి శ్రీ ఎం. ఎస్. గురుపాదస్వామి ప్రారంభోత్సవం చేశారు. ఇక్కడ ఈ బియ్యాన్ని "కొనుగోలు ధరకంటే తక్కువ వెల"కు ఒక కిలో గ్రాము



ఆగస్టు 6వ తేదీన కేంద్ర ప్రభుత్వ సహకారశాఖ స్టేట్ మంత్రి శ్రీ యం. యస్. గురుపాద స్వామి హైదరాబాదు సూపర్ బజార్ సందర్శించినప్పుడు.

రూ. 1-05 ల చొప్పున విక్రయిస్తారు. ఒక వ్యక్తికి ఆయిదు కి. గ్రా. లకు మించి ఈ బియ్యం అమ్మరు. సహకార మంత్రి శ్రీ కె. విజయభాస్కరరెడ్డి కార్యక్రమానికి హాజరయ్యారు.

ప్రతి ఆదివారం నాడు సూపర్ బజారులో ఒక అత్యవసర వస్తువును "కొనుగోలు ధర"కు విక్రయించగా అనేక గృహోప కరణాలను "తగ్గింపు ధర"కు విక్రయిస్తారు.

సూపర్ బజారు మొదటి ఆరు నెలల కాలంలోనే నాలుగు లక్షల రూపాయల వరకు లాభం గడించగలిగినట్లు తెలుసుకొని చాలా ఆనందించినట్లు కేంద్ర మంత్రి తెలియజేశారు. ఉత్తమ సేవా కేంద్రంగా రూపొందినందుకు ఆయన "కల్పలత"ను అభినందించారు.

అంతర్ కళాశాలల వక్తృత్వపోటీ

'సోషలిస్టుతరహా సమాజం రూపొందాలంటే సహకార సంఘాలను అభివృద్ధి పరచాలి' అన్న అంశం మీద ఇంగ్లీషులో అంతర్ కళాశాలల వక్తృత్వ పోటీని ఒకదానిని హైదరాబాదులోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార యూనియన్ ఏర్పాటు చేసింది రాష్ట్రమంతటినుంచీ మొత్తం యిరవైరెండు కళాశాల తరఫున నలభై అయిదుగురు యీ పోటీలో పాల్గొన్నారు.

పత్రికావిలేఖరి శ్రీ సి.వి.హెచ్. రావు, సహకారసంఘాల జాయింట్ రిజిష్ట్రారు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవితభీమా సంస్థ కార్యదర్శి కుమారి ఎం. చటోపాధ్యాయ యీ పోటీకి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ప్రథమబహుమతి క్రింద కాసుబ్రహ్మానందరెడ్డి బంగారు పతకం హైదరాబాదులోని ఉస్మానియా విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాలవిద్యార్థి శ్రీ ఎం. ఎ. ఖాదర్‌కు లభించింది. ద్వితీయబహుమతి ఆంధ్రప్రదేశ్ సహకార యూనియన్ రజతపతకం ఉస్మానియా విశ్వవిద్యాలయ సైన్సు కళాశాల విద్యార్థిని కుమారి అరవిందశర్మకు లభించింది. మహిళలకొరకు ఉద్దేశించిన ప్రత్యేక బహుమతికూడా ఈమె గెలుచుకున్నారు. న్యూసైన్సు కళాశాల విద్యార్థి శ్రీ కార్తిక్ కుమార్ సైనాకు కన్సొలేషన్ బహుమతి లభించింది. ఉస్మానియా వైద్యకళాశాల విద్యార్థి శ్రీనాథరెడ్డి, గాంధీవైద్య కళాశాల విద్యార్థి శ్రీ ఆర్. వరదరాజ్‌లకు కన్సొలేషన్ బహుమతులు లభించాయి.

సేద్యపునీటి విషయాల మంత్రి శ్రీ శీలం సిద్ధారెడ్డి బహుమతులను పంపిణీచేశారు. బహుమతివిజేతలను అభినందిస్తూ శ్రీ సిద్ధారెడ్డి, సహకారోద్యమంలో ప్రజల సహకారం మద్దతు అవసరమని నొక్కి చెప్పారు. ఈ బహుమతి ప్రధానోత్సవానికి వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ శ్రీ ఒ. పుల్లారెడ్డి అధ్యక్షత వహించారు.

సహకార సంఘాల జాయింట్ రిజిష్ట్రార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార యూనియన్ అజమాయిషీదారు అయిన శ్రీ పి.వి.వి. వర్మ ముందుగా సభికులకు స్వాగతం చెప్పుతూ సహకారోద్యమం ద్వారా సోషలిష్టుతరహా సమాజం ఆవిర్భవింపచేయడం సాధ్యమేనని పేర్కొన్నారు.

యూనియన్ కార్యదర్శి శ్రీ టి. రామసుబ్బారెడ్డి వందన సమర్పణ చేశారు



ప్రథమ బహుమతి
శ్రీ ఎం. ఏ. ఖాదర్, ఇంజనీరింగ్ కళాశాల
ఉస్మానియాయూనివర్సిటీ.



ద్వితీయ బహుమతి
కుమారి అరవిందశర్మ, సైన్సుకళాశాల
ఉస్మానియా యూనివర్సిటీ

'మనోరమ'లో ఒకరోజు

హైదరాబాదు యాత్రికులకు 'మనోరమ' లో
ఒకరోజు మరపురాని అనుభూతి

గోల్కొండ కోట
చార్‌మినార్
పబ్లిక్ గార్డెన్స్

ఉస్మాన్‌సాగర్
సాలార్జంగ్ మ్యూజియం
ఉస్మానియా విశ్వవిద్యాలయం

మొదలయిన స్థలాలకు తీసుకొని వెళ్తుంది

శుక్రవారం మినహా ప్రతిరోజూ పర్యటించవచ్చు

సాలార్జంగ్ మ్యూజియం

ప్రవేశ రుసుముతో సహా

రూ. 8-00 మాత్రమే

రిజర్వేషన్లు చేయించుకోవలసిన స్థలము-మనోరమ బయలుదేరు స్థలము

రాష్ట్ర జన సంబంధ శాఖ

గాంధీభవనం ఎదుట, హైదరాబాదు

PUBLISHED BY THE DIRECTOR OF JANA SAMBANDHA SAKHA, ANDHRA PRADESH AND PRINTED BY THE DIRECTOR OF PRINTING, GOVERNMENT OF ANDHRA PRADESH, AT THE GOVERNMENT CENTRAL PRESS HYDERABAD.

